ఆంధ్ర ప్రదేశ్

1975 జూలై 50పై



ఆంధ్ర కేసరి కథ



1940లో మళ్ళీ రాష్ట్ర కాంగ్రెస్‌కి అధ్యక్షులుగా ప్రకాశంగారు ఎన్నుకోబడ్డారు. ప్రకాశం మహాత్ముని ఆజ్ఞననుసరించి యుద్ధ వ్యతిరేకోద్యమం ప్రారంభించారు. ప్రకాశం పట్టాభి ప్రభృతులను అరెస్టు చేశారు.
క్విట్ ఇండియా ఉద్యమంలో కాంగ్రెసు అగ్రనాయకులతో మళ్ళీ మహాత్ముని! నిరశన వ్రతం 21 రోజు చేసిన కారాగారంలో పెట్టారు. భారతదేశంలో చెప్పలేని అశాంతి చెలరేగింది.
స్వాతంత్ర్యమో వీర మరణమో!
రైళ్ళ రాకపోకలను నిలిపి వేశారు. రైలు స్టేషన్లను నిప్పు పెట్టారు. రైలు పట్టాలు ఊడబెరికారు. పోస్టాఫీసులు తగలబెట్టారు. పోలీసులు కాల్పులు చేశారు. ఎందరో భారతీయులు మరణించారు. వేలకొలది జైళ్ళకు వెళ్ళారు.
1945 జూన్‌లో ప్రకాశాన్ని విడుదల చేశారు. వెంటనే మన రాష్ట్రం అంతటా పర్యటించారు.
ఇంతలో రెండవ ప్రపంచ యుద్ధం ముగిసింది. 1946లో దేశంలో రాష్ట్ర శాసన సభలకు ఎన్నికలు జరిగాయి.
కాంగ్రెసుకే వోటు!
కాంగ్రెసుకి అపూర్వ విజయం లభించింది. అన్ని రాష్ట్రాలలోనూ కాంగ్రెసు ప్రభుత్వం ఏర్పడింది. అప్పుడే మద్రాసు రాష్ట్రంలో ఏర్పడిన ప్రభుత్వానికి ప్రకాశం ముఖ్యమంత్రి
మన రాష్ట్రంలో మద్యపాన నిషేధం అమలు జరపాలి!
ప్రకాశం ముఖ్య మంత్రిగా ఉన్న కాలంలో మద్యపాన నిషేధం, ఖద్దరు కార్యక్రమం వంటివి ఎన్నో ప్రవేశ పెట్టారు. ఆంధ్ర కాంగ్రెస్‌లో చీలికలు వచ్చి కొందరు తమిళులతో చేతులు కలిపి ప్రకాశం మంత్రి వర్గాన్ని పడగొట్టడానికి ప్రయత్నాలు ప్రారంభించారు.

ఆంధ్రప్రదేశ్

సంపుటి : 19]

జూలై, 1975
ఆషాఢ—శ్రావణ, 1897

[సంచిక : 9

ప్రధాన సంపాదకులు
శ్రీ రాజ్యం సిన్హా

సంపాదకులు
యన్. వి. గోపాలశాస్త్రి

ఆరు ఋతువుల భూరి సంభారమెల్ల
పేర్చి నాగేటి కర్రున పెళ్ళగించి
నేల బంగరు పంట పండించి మెరసె
సునిశిత ప్రతిభాశాలి తెలుగుబిడ్డ

—నాయని సుబ్బారావు

మొదటి కవరు పేజీ : తెలుగునాట వరినాట్లు

రెండవ, మూడవ కవరు పేజీలు : ప్రకాశం కథ (చిత్రాల్లో)

చివరి కవరు పేజీ : నెహ్రూ జూలాజికల్ పార్కులో
ఎవరికీ గజారోహణోత్సవం !

(ఫొటో : శ్రీధర్స్ ఫొటో సర్వీస్)

సాలు చందా ఆరు రూపాయలు

వెల: 50 పైసలు

రిజిస్టరు నెం హెచ్/హెచ్. డి 31

ఈ సంచికలో..

శంపా ధ్వజాలు

కవిత

నా ఉదయం ఇక్ష్వాకుల నాడు!
నా పలకలు
కిరీటాల కీర్తి శిశువుల జోలపాటలతో
పులకలుగా మారిపోయాయి!
నా పుస్తకం
జానపదుల అష్టపదుల నూరుపదుల గీతాలకు
మస్తకంగా నిలిచిపోయింది!
నేను
రాజమండ్రిలో చదువుకుంటున్నప్పుడు
రాజరాజనరేంద్రుడి మత్తేభ మెక్కాను!
నెల్లూరులో చుట్టాలింటికి వెళ్ళినప్పుడు
తిక్కన సోమయాజి కలాని కందం దిద్దాను!
నేను
కొండవీడు పోగా
అక్కడ ఎర్రాప్రెగడ
చిక్కని పాలు, పెరుగు, నెయ్యి వడ్డించి
చక్కని విందులు చేశాడు
వరంగల్లునుంచి కబురు వస్తే
తరంగంలా పరుగెత్తి
పోతన్నగారి పొలం పండించాను!
కానీ
శ్రీనాథుడి ఆహ్వానం కాదనలేక
తిరిగి రాజమండ్రి వచ్చేశాను!
అక్కడ
బంగారు పళ్ళెరాల్లో తిని
వెండి 'సీసా' లలో త్రాగి
రూపాంతరం పొందాను!
కస్తూరి గమగమల సెంటు పూసుకున్నాను!
దేశమంతా నన్ను చూసి చేసింది కవితా స్వీకారం
నా కవితా స్నానం చేసింది బంగారం
నా అనుభవాలను మోసింది శృంగారం!
ఇంతలో
నన్ను పిలిపించాడు కన్నడరాజు శ్రీకృష్ణదేవరాయలు!
అష్టదిగ్గజాలను ఆశీర్వదించాను
శంపాధ్వజాలను హంపీ విద్యానగరంలో ఎత్తించాను
అక్కడనుంచి సాగిపోయాను
తంజావూరు, మధుర, పుదుక్కోట
ఇంకా ఇంకా
అలాఅలా తిరిగి
అవీఇవీ కొని
రెండెడ్ల బండిలో కూచుని అలసిసొలసి
కుదుపుకి కునికిపాట్లు పడుతుండగా
లేపారు నన్ను
ఎవరు చెప్మా!
ఎవరో ఎవరో ఎవరో!
చూద్దును గదా
ఇరవయ్యో శతాబ్దం గబాగబా వచ్చేస్తోంది
కళ్ళు నులుముకునే సరికి
రైలు గుప్పుగుప్పుమని వస్తోంది
రేడియో వందేమాతరం పాడుతోంది
ప్రెస్సు వార్తాపత్రికలు పంచుతోంది!
ప్లాట్‌ఫారం అందంగా ఉంది
జడకుచ్చులు కట్టుకుని
ముత్యాల సరాలు పెట్టుకుని
ముస్తాబయ్యాను.
కృష్ణ పక్షుల బారుల వెనక
పరుగెడుతున్న నా అక్షుల్ని
ఉరుములూ మెరుపులూ ఆకర్షించాయి!
దూరాన
జానపదుల పాటలు వినిపించాయి!
ఇదిగాక
మరో ప్రపంచం ఉందని ఊహించాను
మహాప్రస్థానానికి సిద్ధమయ్యాను!
ఇప్పుడు
నాకు ఆత్మవిశ్వాసం పెరిగింది!
అందుకే కాబోలు
నిన్నకన్నా అందంగా ఉన్నాను
నిరాడంబరంగానూ ఉన్నాను!
నేడు
నన్ను ప్రపంచమంతా ఎరుగుదురు
నేడు
నన్ను ఇండియా అంతా చదువుదురు!
నే నిప్పుడుంటున్నది
విశ్వజననీమయిన సాహిత్యనగరంలో
విప్లవోన్ముఖమయిన సంస్కృతిరంగంలో
వికాసోత్సుకమయిన సమాజభవనంలో
నా పేరు తెలుగు
నా ఊరు వెలుగు
రండి రేపొకసారి
ఆల్వేజ్ వెల్‌కమ్


శ్రీ మిరియాల రామకృష్ణ

పరిపూర్ణ ప్రజాస్వామ్యమే పంచాయతీరాజ్

---శ్రీ లుకలాపు లక్ష్మణదాస్

ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు, పంచాయతీరాజ్ వ్యవస్థకు మూలపురుషుడు శ్రీ బల్వంతరాయ్ మెహతా గాంధీజీకి ప్రీతిపాత్రమైన గ్రామ స్వరాజ్య సిద్ధాంతానికి, రాజ్యాంగంలో పొందుపరచబడిన ఆదేశ సూత్రాలకు ఒక నిర్దుష్ట రూపకల్పన చేసిన ఘనత స్వర్గీయ శ్రీ మెహతాకే దక్కింది.

1899 ఫిబ్రవరి 19 న శ్రీ మెహతా గుజరాత్‌లోని భావనగరంలో జన్మించారు అనేక ప్రసిద్ధ దేశనాయకులవలెనే శ్రీ మెహతా, శ్రీ లాలాలజపతిరాయ్ స్థాపించిన "సర్వెంట్సు ఆఫ్ పీపుల్సు సొసైటీ" లో సభ్యులు స్వాతంత్ర్య పోరాటంలో అనేక క్లేశములనుభవించుతూ కూడా విద్యారంగంలో పట్టభద్రులు కావడం వీరియొక్క పట్టుదలకు నిదర్శనం. వీరు 1920 సంవత్సరములోనే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని 8 పర్యాయములు జైలుశిక్ష పొంది 7 సంవత్సరములు కారాగారములో గడిపిన ధీరమూర్తి రెండు పర్యాయములు లోకసభ అంచనాల సంఘ అధ్యక్షులుగా ఎన్నికై పరిణతి చెందిన పరిపాలనా దక్షతతో వ్యవహరించి అంచనాల సంఘముయొక్క విలువలను ఇనుమడింప జేశారు. వీరు అంచనాల సంఘ అధ్యక్షులుగా నిర్వహించిన కాలము భారత పార్లమెంటు చరిత్రలో ప్రత్యేకముగా గుర్తుంచుకోవలసిన ఘట్టము.



1963 లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఏకగ్రీవంగా ఎన్నికగావడం శ్రీ మెహతాకు ప్రజల్లోగల ప్రగాఢ అనురక్తికి నిదర్శనం. ఏ పదవి చేపట్టినా అతి నిపుణతతోను, దక్షతతోను నిర్వహించి ఆ పదవికి ఎనలేని గౌరవము తెచ్చిన విశిష్ట వ్యక్తి శ్రీ మెహతా. పంచాయతీరాజ్ పేరు స్మరించిన జ్ఞప్తికి వచ్చేది శ్రీ మెహతాయే ప్రజాస్వామ్యంలో ఆయనకున్న ప్రగాఢ విశ్వాసమే ఈ పంచాయతీ రాజ్య సంస్థల రూపకల్పన

వీరి జన్మదినోత్సవం ఫిబ్రవరి 19 వ తేదీన అఖిల భారత పంచాయతీ పరిషత్, రాష్ట్ర పంచాయతీ పరిషత్ జరుపుకున్నాయి. ఇప్పుడు మన దేశంలో మొత్తం 2,20,000 గ్రామ పంచాయతీలు, 3,600 పంచాయతీ సమితులు. 236 జిల్లా పరిషత్తులు వివిధ రాష్ట్రములలో స్థాపించబడినవి

1975 సంవత్సరము నాటికి గ్రామ పంచాయతీలు స్థాపించి 25 సంవత్సరములు పూర్తి అగును. ఈ సందర్భంగా అఖిల భారత కాంగ్రెసు కమిటీవారు అఖిల భారత పంచాయతీ పరిషత్తువారు రజతోత్సవము జరుప నిశ్చయించినారు

ఈ సంవత్సరంలోనే వివిధ కార్యక్రమములు గ్రామ పంచాయతీలు చేబట్టి పూర్తిచేస్తాయి. ఈ సందర్భమును పురస్కరించు కొని మన రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థ గురించి క్లుప్తంగా వివరిస్తా.

మహాత్మాగాంధీ నాయకత్వంలో మనదేశం స్వాతంత్ర్యం సంపాదించుకుంది. కాని అంతటితో మన పోరాటం ఆగలేదు. ప్రగతి పథంలో ఉన్న అడ్డంకులు తొలగించుటయే స్వాతంత్ర్యం. మన ప్రియతమ నాయకుడు స్వర్గీయ జవహర్‌లాల్ నాయకత్వంలో మన దేశములో కొంత పురోభివృద్ధి జరిగింది. అభివృద్ధి ప్రగతికి అవధులు లేవు. కాబట్టి మన పోరాటానికి అంతేలేదు అందుచేతనే పండిట్ జీ "మనము చేపట్టిన మార్గంలో విశ్రాంతి స్థలాలు లేవు. మనము ముందుకు నడుస్తూనే ఉండాలి" అని అన్నారు.

మనకు స్వాతంత్ర్యం వచ్చి కొంత అభివృద్ధి సాధించినప్పటికీ, అధికారము కేంద్రీకృతము అగుటచేత స్వాతంత్ర్యపు ప్రయోజనాన్ని, ఫలితాలను ప్రజలు అవగాహన చేసుకోగల స్థాయిలో ఏ విధమైన మార్పు కనబడలేదు. అందుచేత ప్రజాస్వామిక పద్ధతుల ద్వారా అధికార వికేంద్రీకరణ జరిపి గ్రామస్థాయిలో ఉన్న ప్రజలు కూడా ప్రజాస్వామిక విలువలను, ప్రగతిని గుర్తించేటట్లు చేయుట తప్పనిసరి అయింది. తదనుగుణంగా 1957 సంవత్సరములో శ్రీ బల్వంతరాయ్ మెహతా అధ్యక్షతన ఏర్పాటు చేసిన పరి

శీలనా సంఘము మన దేశములో అమలు జరుగుచున్న సమాజ వికాస కార్యక్రమాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ప్రజాస్వామిక వికేంద్రీకరణ సూత్రాన్ని అనుసరించి జిల్లాపరిపాలన మూడు స్థాయిలలో అనగా:—

గ్రామస్థాయిలో గ్రామ పంచాయతీలు

బ్లాకు స్థాయిలో చట్టబద్ధమైన ఎన్నిక పద్ధతి మీద స్వపరిపాలనా సంస్థగా ఏర్పాటు చేయబడి బ్లాకు కౌన్సిలు లేదా పంచాయతీ సమితి.

జిల్లా స్థాయిలో పంచాయతీ సమితులను గురించి సలహా సంప్రదింపులకు, పర్యవేక్షణకు పనిజేసే ప్రజాప్రతినిధుల సంస్థ, జిల్లా కౌన్సిలు లేదా జిల్లా పరిషత్ ఉండాలని సిఫార్సు చేసినది.

వికేంద్రీకరణ విధానాన్ని చట్టబద్ధంగా అమలుజరుపడానికి 1958 సంవత్సరములో ప్రతిజిల్లాలో జిల్లాకు ఒక బ్లాకు చొప్పున పంచాయతీ సమితులను 'అడ్‌హాక్' పద్ధతిమీద ఏర్పాటు చేయడము ద్వారా మన రాష్ట్రములో పంచాయతీరాజ్ వ్యవస్థకు అంకురార్పణ జరిగింది ఈ అడ్‌హాక్ పంచాయతీ సమితులను, ఒక సంవత్సరము పనిచేసిన తీరును ఆధారముగా చేసుకొని మూడంతస్థుల పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టుటకు మన ప్రభుత్వం నిర్ణయించింది తదనుగుణంగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తుల చట్టమును రూపొందించి 1959 వ సంవత్సరము నవంబరు 1 వ తేదీ నుండి అమలు జరిపారు పరిపాలనా వికేంద్రీకరణ సూత్రాన్ని అనుసరించి జిల్లా పరిపాలనలో మూడు స్థాయిల పంచాయతీరాజ్ వ్యవస్థను మొదటిసారిగా ప్రవేశపెట్టిన ఖ్యాతి మన రాష్ట్రానికి, రాజస్థాన్ రాష్ట్రానికి దక్కినది తరువాత మిగతా రాష్ట్రాలు కూడా పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టినవి. మన రాష్ట్రములో అమలు జరుపుచున్న మూడంతస్థుల పంచాయతీ రాజ్ వ్యవస్థలో మౌలికమైన ప్రజాసంస్థ గ్రామ పంచాయతీ, ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఏర్పాటు చేయబడిన సంస్థ కూడా గ్రామ పంచాయతీయే మిగతా రెండంతస్థులలో గల సంస్థలు అనగా బ్లాకు స్థాయిలో పంచాయతీసమితి, జిల్లాస్థాయిలో గల జిల్లా పరిషత్ పరోక్ష ఎన్నిక పద్ధతి ద్వారా ఏర్పాటు చేయబడినవి.

పంచాయతీరాజ్ సంస్థలు మన రాష్ట్రంలో 15 సంవత్సరాలుగా పనిచేస్తున్నాయి ఈ సంస్థలు మొదటి అయిదు ఏండ్లు కాలములో ప్రశంసనీయముగా పనిచేశాయి. ఈ సంస్థలు సమీకరించిన ప్రజావిరాళాలు, వాటితో నిర్మించిన విద్యా, ఆరోగ్య సంస్థల భవనములు, గ్రామీణ ప్రాంతములలో నిర్మించిన రహదారులు మొదలైనవి అందుకు ప్రత్యక్ష తార్కాణం.

రానురాను ఈ సంస్థలలో ఉత్సాహం, ప్రగతి కుంటుబడింది. ఇందుకు అనేకకారణాలు ఉన్నాయి. ఈ సంస్థలు తమ లక్ష్యాన్ని చేరుకోలేక పోయిన మాట కొంతవరకు వాస్తవమే. అందుకని ఈ సంస్థల ఉనికినే శంకించడం సబబుకాదు. ఆవిధమైన ఆలోచన మన ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు కాగలదు. అందుకనే ఈ సంస్థలు పటిష్టంగాను సమర్ధవంతంగాను పనిచేయుటకు వెంగళరావు కమిటీ, నరసింహం కమిటీ చేసిన సిఫార్సులను దృష్టిలో ఉంచుకుని ఆ సంస్థల ఎన్నికల పద్ధతిలోను, పరిపాలనా విధానంలోను కొన్ని మార్పులు తెచ్చుటకు ప్రభుత్వం ఆలోచించుచున్నది.

ఈ సంస్థలకు ధనాభావం లేకుండా ఉండుటకుగాను తగిన వనరులను సమకూర్చుటకు కూడా ప్రభుత్వం ఆలోచిస్తున్నది.

మన దేశ జనాభాలో ఈనాటికీ 80 వంతుల మంది గ్రామాలలోనే నివసిస్తున్నారు. కాబట్టి నూటికి నూరు గ్రామాలను సర్వతోముఖంగా అభివృద్ధి పరచవలసిన బాధ్యత పంచాయతీరాజ్ సంస్థలపై ఎంతైనా ఉంది. ఈ సంస్థల విజయం స్థానిక నాయకత్వ కృషిపై ఆధారపడివుంటుంది. మన ముఖ్యమంత్రి గారు చెప్పినట్లు నిస్వార్థసేవ చేయటానికి ఎవరూ అధికారం కోసం ఆలోచించ నక్కరలేదు.

గాంధీజీ నిర్వచనం

ఒకప్పుడు మహాత్మగాంధీ యిల్లా అన్నారు "గ్రామ స్వరాజ్యం అంటే నా భావం ప్రతి గ్రామమూ ఒక సంపూర్ణ జనతంత్ర వ్యవస్థ అయివుండాలని. గ్రామంలో ఈడువచ్చిన స్త్రీ, పురుషులచేత ప్రతిసంవత్సరము ఎన్నుకోబడే పంచాయత్ గ్రామ పరిపాలనను నిర్వహిస్తుంది. కావలసిన అధికారం అంతా వుంటుంది. ఈ పంచాయతీ శాసన సభగానూ, న్యాయసభగాను కూడా పని చేయాలి. అది ఎన్నికైన ఒక ఏడాదిపాటు వ్యక్తి స్వాతంత్ర్యం మీద ఆధారపడిన సంపూర్ణ ప్రజాస్వామ్యం ఉండాలి. ఇక్కడ తన యొక్క, తన గ్రామం యొక్క గౌరవాన్ని కాపాడడానికి ప్రాణత్యాగం చేయడం ప్రతి గ్రామీణుని విధి అయివుంటుంది" ఈ సిద్ధాంతాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ పంచాయతీల రజతోత్సవ సంవత్సరములో ప్రజలు అందరు సహకరించి తగిన కార్యక్రమములు చేపట్టి గ్రామాలను సర్వతోముఖంగా అభివృద్ధి పరుస్తారని భవిష్యత్తులో మన రాష్ట్రములో పంచాయతీరాజ్ సంస్థలకు నిస్వార్థమైన, సమర్థవంతమైన నాయకత్వం లభిస్తుందని, ఈ సంస్థలు మూడు పూవులు—ఆరుకాయలుగా వర్ధిల్లుతాయని ఆశిస్తున్నాను.

'ఆంధ్ర రత్న'

శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్య

జననం :
1889 జూన్ 2 వ తేదీ

శ్రీ మాదల వీరభద్రరావు

మరణం :
1928 జూన్ 10 వ తేదీ



అవి సహాయ నిరాకరణోద్యమపు రోజులు. మహాత్మాగాంధీ దివ్యవాణి భారతీయుల నుత్తేజపరుస్తూ, బ్రిటిష్ దాస్య విముక్తికై అసమాన త్యాగాలు చేయుటకు పురిగొల్పుతున్న దినాలు.

స్థానిక ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా పరప్రభుత్వాధికారులు చీరాల, పేరాల ప్రాంతాన్ని పురపాలక సంఘంగా చేయ దలపెట్టినారు. అందుకు నిరసనగా, 20 వేల మంది గ్రామీణ ప్రజలను ఇండ్లు వాకిళ్లు వదలిపెట్టి ఊరు వెలుపల తాటియాకుల పర్ణకుటీరాలలో నెలల తరబడి కాపురం చేయించే అసామాన్యమైన మహాద్భుత కార్యాన్ని సాధించిన ఘనత ఆంధ్రదేశంలోని 'ఆంధ్రరత్న'కు దక్కింది.

తెలుగు దేశంలోనే గాదు, యావద్భారతంలోను ఈ చీరాల పుర నిర్గమన కథనం, ఈ మహాప్రస్థానానికి నాయకత్వం వహించి నడిపించిన శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి పేరు దశ దిశలు ప్రాకింది సహాయనిరాకరణోద్యమంలో ఇది సువర్ణాక్షరాలతో లిఖించబడిన ప్రముఖ ఘట్టాలలో నొకటిగా పేర్గాంచినది. పార్లమెంటులో మెప్పుబడసింది. మన గోపాలకృష్ణులు 'ఆంధ్ర రత్న' అయినారు.

ఈయన పరప్రభుత్వాజ్ఞలను ధిక్కరించారు. ప్రజలచే ధిక్కరింపచేశారు. కఠిన జైలు శిక్షలకు గురిచేసినా, త్యాగమార్గాన్ని చూపించారు. తమ వాగమృత ధారలచే అశేష ప్రజలను సంఘటిత పరచి స్వధర్మ, స్వదేశీ వ్రతాల ననుష్ఠింపజేశారు 'ఆంధ్ర విద్యాపీఠగోష్ఠి' అనే సంస్థను స్థాపించి ఆర్యధర్మ ప్రచారానికి పూనుకొన్న మహోన్నత ఆదర్శవాదులు.

ఆంధ్రరత్న అకుంఠిత దేశభక్తి, అద్వితీయ ప్రతిభా చతుర్యాలు, అసమాన సాహసకృత్యాలు వేనోళ్ల పొగడ్తల నందుకొన్నవి.

శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు విరోధినామ సంవత్సర జ్యేష్ఠ శుద్ధ చతుర్దశికి సరియగు 1889 జూన్ నెల 2 వ తేదీన పెనుగంచి ప్రోలులో జన్మించారు. వీరితల్లి సీతమాంబ తండ్రి కోదండ రామయ్యగారు సీతమ్మ తల్లి వీరు జననమొందిన తృతీయ దినముననే పరమ పదించారు వీరికి 3 వ ఏటనే తండ్రి గూడా దివంగతులయినందున, ఈ బిడ్డడు పిన తండ్రి శివరామయ్య గారి వద్ద పెంచబడినాడు.

చిన్న తనం నుండీ గోపాలకృష్ణయ్యగారికి ఆటపాటల యందు అభినివేశం వుండేది. సంగీత సాహిత్యముల యందు మంచి అభిరుచి వుండేది. 1906 లో బాపట్ల ఉన్నత పాఠశాలలో

ద్యనభ్యసించి, అనంతరం గుంటూరులో ఎఫ్. ఏ. చదువుటకు వెళ్లారు. అచట నెలకొల్పిన 'జాతీయ నాట్యమండలి' వారి నాటకాలలో ప్రముఖ పాత్ర వహించారు. గుంటూరులో నడింపల్లి వెంకట లక్ష్మీనరసింహారావు గారితో చెలిమికలిగింది వందేమాతర ఉద్యమ ప్రభావం ఆంధ్రదేశానికి వ్యాపించింది. శ్రీ బిపిన్ చంద్రపాల్ ప్రసంగాలు విద్యార్థులలో ఉత్సాహోద్రేకాలు వెలిగించినవి. దేశాభిమానంగల గోపాలకృష్ణయ్యగారు 1909 లో 'జాతీయత-కళ' అను అంశంపై ఉపన్యసించారు. స్వతంత్ర జాతీయ భావాలుగల భారతీయ యువకులు అప్పట్లో ఉన్నత విద్య నభ్యసించేందుకు ఇంగ్లండు, ఐర్లండు దేశాలకు వెళ్లుతుండేవారు. నడింపల్లి నరసింహారావు గారి ఆర్థిక సహాయంతో గోపాల కృష్ణయ్యగారు గూడా లండన్‌కు బయలుదేరి వెళ్లారు. అచట ఎం. ఏ. పరీక్షలో ఉత్తీర్ణులైనారు. ఎడింబరో విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్రంలో పట్టంబొందారు. వేదాంతం రాజ్యతంత్రం, వ్యవసాయ శాస్త్రాదుల నభ్యసించారు. ఎడింబరోలోని భారత సంఘానికి వీరు కార్యదర్శిగా పనిచేశారు.

గోపాలకృష్ణయ్యగారికి అరవింద ఘోషు అన్నా, బాల గంగాధర తిలక్ అన్నా అమిత అభిమానం వుండేది. భారతీయ మత, సంస్కృతుల ప్రభావం వీరిపై హెచ్చుగా ప్రసరించి, స్ఫూర్తి నిచ్చినవి. భారతీయ విద్యార్థుల సభలో వీరచట గావించిన ఉపన్యాసం పలువురి ప్రశంసల నందుకొంది. క్రమేణా డాక్టరు ఆనంద కుమారస్వామితో మైత్రి ఏర్పడింది. వీరిరువురు కలసి 'అభినవదర్పణ' మను గ్రంథం వ్రాశారు.

ప్రథమ ప్రపంచ యుద్ధకాలంలో గోపాలకృష్ణయ్యగారు తిరిగి స్వదేశానికి వచ్చారు. 1917 లో రాజమహేంద్రవరం బోధనాభ్యసన కళాశాలలో చరిత్రాధ్యాపకులుగా చేరారు. వీరు అద్వైత మతావలంబకులు. అప్పటికే చాలా భక్తిపరులు. వీరి ఆచార సంప్రదాయాలకు, స్నాన సంధ్యానుష్ఠానాలకు, అధ్యాపక వృత్తి బాధ్యతలకు పొత్తు కుదిరేదికాదు. ఇంటివద్ద పూజాపునస్కారములు చేయుటవలన బడిపని ఆలశ్యమయ్యేది. కళాశాల ప్రిన్సిపాల్ ఆలశ్యంగా వచ్చావేమనగా తమ ఉద్యోగానికి రాజీనామా యిచ్చారు. 1918 లో బందరు జాతీయ కళాశాలలో గూడా కొద్ది కాలం అధ్యాపకులుగా పనిచేశారు.

అప్పట్లో అనిబిసెంట్ 'హోంరూలు' ప్రచారంగావిస్తున్నారు. రాజకీయోద్యమ ప్రభావంతో గోపాలకృష్ణయ్య గారు కాంగ్రెసులో చేరారు. గాంధీమహాత్ముని అసహాయోద్యమ శంఖారావం వినిపించింది. 1920 లో జరిగిన కలకత్తా కాంగ్రెసు మహాసభకు హాజరైనారు తదాది సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు.

అంతకు పూర్వం పాశ్చాత్యానుకరణతో వున్న సూట్లు బూట్లను తీసివేసి, భారతీయ వేషం ధరించారు. సహజంగా ఆయనది మంచి అందమైన ముఖవర్చస్సు. యూరోపియన్ దుస్తులతోనున్నప్పటి వ్యక్తికీ, తర్వాత వ్యక్తికీ దుగ్గిరాలవారిలో గుర్తుపట్టలేనంత మార్పువచ్చింది. ఆ ముఖమునకు విభూతిరేఖలు, మెడలో రుద్రాక్ష మాలలు, చేతికి చిరుతలు, తలకొక తలపాగా ఇవన్నీ అపర రామదాసుగా మూర్తీభవించారు.

శ్రీ దుగ్గిరాల భారతీయ వేషం, వారి ఉద్రూత లూగించే ఉపన్యాసాలు అశేష ప్రజాసామాన్యాన్ని మంత్రముగ్ధులను చేసేవి. 1920 లో మహానందిలో జరిగిన ఆంధ్రమహాజన సభకు రామ భక్తవేషంతో హాజరై సభికుల నందరినీ ఆనందపరవశులనుచేశారు.

ఆర్యధర్మ ప్రతిష్ఠాపన కనువుగా ఆంధ్రవిద్యాగోష్ఠి సంస్థను నెలకొల్పారు. సిక్కుల అకాలీదళంవలె, ఆంగ్లేయుల స్కౌట్లవలె, ఆంధ్రులలో 'రామదండు' పేరుతో సుశిక్షిత స్వచ్ఛంద సేవకులను తయారుచేశారు. అస్పృశ్యతా నివారణ, సురాపాన నిషేధం, బ్రిటిష్ వస్త్ర వస్తు బహిష్కరణలు మున్నగు పంచవిధ బహిష్కారాలను చేపట్టినారు. ఖద్దరుధారణ, అహింసా వ్రతనిష్ఠ అలవరుచుకొన్నారు.

స్వరాజ్య ఉద్యమంలో బెజవాడలో 1920 మార్చి 31 నుండి జరిగిన అఖిల భారత కాంగ్రెసు కార్యవర్గ సభలు ఆంధ్రకు అత్యంత ప్రాముఖ్యంగలవి. గాంధీజీ, చిత్తరంజన్‌దాస్, ఆలీ సోదరులు మొదలగు నాయకులంతా విచ్చేశారు. బెజవాడ సభలకు చీరాల నుండి రామదండుతో సహా గోపాలకృష్ణుడు హాజరైనారు. ఆ మహాసభల సందర్భాన చక్కని క్రమశిక్షణతో రామదండు చేసిన సేవ నాయకుల ప్రశంసలందుకొనడమే గాక వారిని ఆశ్చర్య చకితులను చేసింది. గాంధీజీ ఉపన్యాసమును వీరు తర్జుమా చేసినందుకు 'గోష్ఠి' నిర్మాణానికి యిచ్చిన భూమిని ప్రభుత్వం రద్దు చేసివేసింది.

రామనగరం ఉదంతం

15 వేల జనాభాగల చీరాల, పేరాల ప్రాంతాన్ని ప్రభుత్వం పురపాలక సంఘంగా చేయనుద్దేశించింది. దీని వలన అంతకు పూర్వం గ్రామపంచాయతీకి చెల్లిస్తున్న పన్నులు 4 వేల రూపాయల నుండి ఒక్కసారి 40 వేలకు పెరిగే భారం కనుపించింది. పురపాలక సంఘ నిర్మాణానికి పౌరులు తీవ్ర ప్రతికూలాభిప్రాయంతో వున్నప్పటికీ, 1919 లో మునిసిపాలిటీగా చేయడం జరిగింది. కాని ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు ప్రజాఒత్తిడికి తట్టుకోజాలక రాజీనామాలు యిచ్చారు. ప్రభుత్వమే మునిసిపల్ ఛైర్మన్‌ను నియమించింది. గోపాలకృష్ణుని నాయకత్వాన ప్రజలు పన్నులు చెల్లించ నిరాకరించారు. ప్రభుత్వం దమననీతి నవలంబించి అరెస్టులు ప్రారంభించింది.

ఈ ప్రాంతంలో కాంగ్రెసు పలుకుబడి విస్తరించడం అప్పటి జస్టిసు పార్టీపాలక వర్గానికి కన్నెర్రగా వుండేది. ఈ ఉద్యమాన్ని అణచివేయ సమకట్టినారు. గోపాలకృష్ణుడు బెజవాడ మహాసభలకు వచ్చారేగాని మనస్సంతా చీరాల మహోద్యమంపైనే లగ్నమయివుంది. స్వయంగా రమ్మని మహాత్ముడిని ఆహ్వానించారు. గాంధీజీ చీరాల, పేరాల ప్రాంతాన్ని సందర్శించారు. అప్పటికే అరెస్టుఅయి విడుదలచేయబడిన సత్యాగ్రహులతో గూడా బ్రహ్మాండమైన ఊరేగింపు జరిగింది. ప్రజలు పన్నులు చెల్లించ నిరాకరించడం లేదా మునిసిపల్ పరిమితులను దాటి వెలుపల నివసించడం గాంధీజీ రెండు ప్రత్యామ్నాయ సూచనలను చేశారు. రానున్న మహా సంరంభాన్ని దృష్టిలో పెట్టుకొన్న గోపాలకృష్ణుడు పురనిర్గమనం చేయడానికే నిశ్చయించాడు.

ఏప్రిల్ 7వ తేదీ గాంధీజీ 'రాంనగర్' కు శంకుస్థాపన గావించారు. ఇండ్లు వాకిళ్లను వదిలి, ప్రజలు ఇసుక దిబ్బలలో తాటి యాకుల పాకలు వేశారు. వేలాది ప్రజలు ఏప్రిల్ 25 కల్లా చీరాల, పేరాలలను ఖాళీచేసి రాంనగరం చేరుకున్నారు. ఎంతటి అకుంఠిత దీక్ష, అచంచల ఆత్మవిశ్వాసంవుంటే ఈ మహాకార్యానికి పూనుకోగలరు! గోపాలకృష్ణుని దృష్టిలో (పారలల్ గవర్నమెంటు) ప్రత్యామ్నాయ ప్రభుత్వస్థాపన అనేది మెదులుతూవుంది. రాం నగరం ప్రజలు పంచాయతీ నెన్నుకొన్నారు. తానే అధ్యక్షుడుగా వుండి గ్రామ పరిపాలనా బాధ్యతలను స్వయంగా స్వీకరించారు. నిరంతరం సామూహిక భజనలు, మత సాంస్కృతికోపన్యాసాలతో కోలాహలంగా వుండేది. రామనామస్మరణతో రాంనగరం అంతా ప్రతిధ్వనిస్తుండేది. వీటన్నిటి మూలంగా ప్రజల్లో మనోనిబ్బరం పెరిగింది. భయసందేహాలు పటాపంచలయినవి. దేశాభిమాన ప్రభావితులయిన ప్రజలు సంతోషాతిశయాలతో కేరింతలు కొడు తుండేవాడు.

ఇది జూచి ప్రభుత్వం సహించలేక పోయింది. సామ దాన భేద దండోపాయాలతో, తీవ్రనిర్బంధ విధానాలతో ఎలాగైనా ఈ ఉద్యమాన్ని అణచివేయుటకు పూనుకొంది. అరెస్టులు సాగించింది. సాంఘిక వ్యతిరేకశక్తులను చేరదీసి తుదకు రాంనగరం గుడిశెలను తగల పెట్టడానికి గూడా ప్రోత్సహించింది. కాని ప్రజలు మనోనిబ్బరం కోల్పోలేదు. పదినెలల పాటు అష్టకష్టాలు సంతోషంతో భరించారు. గోపాలకృష్ణుడు ప్రజల దగ్గరే అండ దండగా వుండేవాడు.

ఇదే కాలంలో పల్నాటి పుల్లరి సత్యాగ్రహం, పెదనంది పాడు ఫిర్కా పన్నుల నిరాకరణోద్యమాలకు జిల్లాలో ప్రయత్నాలు జరుగుతూ వచ్చినవి. ఉన్నవ లక్ష్మీనారాయణగారు, గొల్లపూడి సీతారామశాస్త్రిగారు ఈ మహోద్యమాలకు సారథ్యం వహించారు. 'దేశభక్త' కొండ వెంకటప్పయ్య గారు మూలవిరాట్టుగా వుండి నడిపించేవారు.

మరపురాని ఘట్టం

పొన్నూరులో జరిగిన మహాసభలో గోపాలకృష్ణునకు 'ఆంధ్ర రత్న' బిరుదు ప్రదానంచేసి ప్రజలు గౌరవించారు. ఆంధ్రరత్న పేరు ప్రఖ్యాతులు యావద్భారతం మార్మోగాయి.

బరంపురంలో జరిగిన ఆంధ్ర మహాసభలకు వెళ్లి రాంనగరం ప్రజల సహాయార్థం నిధులు వసూలుచేయ సమకట్టినారు. కలెక్టరు రూథర్ ఫర్డుదొర 144 సెక్షన్ క్రింద నిర్బంధాజ్ఞలు జారీచేయడం జరిగింది. ఆంధ్రరత్నకు ఆ నిషేధాజ్ఞలు ఒక లెక్కలోనివా? నిషేధాజ్ఞలు ధిక్కరించి ప్రసంగం చేశారనే నేరంమోపి ఆంధ్ర రత్నను అరెస్టు చేశారు. ఒక ఏడాది కఠినశిక్ష విధించి తిరుచు నాపల్లి జైలులో నిర్బంధించారు. ప్రధాన నాయకుడులేని నిస్సహాయ స్థితిలో కొందరిని బెదిరించి లాలించి ప్రభుత్వం లొంగతీసుకున్నది. ఒక ఏడాది తర్వాత ప్రజలు విధిలేక మరల చీరాల చేరుకొన్నారు. ఈ చీరాల కథనం, ఆంధ్రలోని స్వరాజ్య పోరాటంలో ఒక మహోజ్జ్వలఘట్టం.

కోర్టులో ఆంధ్రరత్న వాఙ్మూలము, న్యాయమూర్తి శిక్ష చెప్పిన అనంతరం జైలుకుపోతూ, గోపాలకృష్ణుడు చీరాల పేరాల పౌరులకు వ్రాసిన లేఖ సత్యాగ్రహి కుండే అచంచల దీక్షను తెలియ చేయడమేగాక, శాశ్వతత్వాన్ని సంపాదించు కొన్నవి.

గోపాలకృష్ణుడు 1922 అక్టోబరు 2వ తేదీన జైలునుండి విముక్తుడై మరల బయటి ప్రపంచంలోకి వచ్చారు. 1920 ఉద్యమ సందర్భంలో ఆంధ్ర నాయకులలో బహుకొలది మంది మాత్రమే జైలు శిక్షల ననుభవించారని గమనించ వలసివుంది. కారాగార వాసము నందున్నప్పుడే దేశ పునర్నిర్మాణమునకు సంబంధించిన పలువిధ సమస్యలను గురించి ఆంధ్రరత్న తీవ్రంగా ఆలోచన సాగించారు. విడుదలైన తర్వాత అనేక తీర్థయాత్రలు చేశారు. ప్రాచీన భారతీయ సంప్రదాయాల కనుగుణంగా సమస్యల పరి ష్కార మార్గాలను లోతుగా పరిశీలన గావించారు. తమకు గల ఆదర్శాల నమలు జరుపుటకు జాతీయ విద్యావిధానాన్నొక దానిని ఒక పత్రంగా రూపొందించారు. కాంగ్రెసు వాదులు, అభిమానులు గల పురపాలక సంఘాలలో అనుసరించవలసిన కార్యక్రమం సిద్ధపరిచారు.

స్వరాజ్యమంటే 'రామరాజ్య' మేనని నిర్వచన మిచ్చారు. 'రామదండు'ను సైన్యంగా ఎంచుకొన్నారు. హనుమధ్వజాన్ని పతాకంగా ఎగురవేయాలన్నారు. చీరాల అసహాయోద్యమాన్ని నడి పించిన ఏకైక వీరుడుగానే గాక, సృజనాత్మక జాతీయ కార్య క్రమం రూపొందించుటలో సిద్ధహస్తుడైన గోపాలకృష్ణుని శక్తి సామర్థ్యాలను గమనించిన కాంగ్రెసు సభాసదులు నాగపూరు సభలో 1923 ఆంధ్రరత్నను అఖిలభారత కాంగ్రెసు సంఘ కార్య దర్శిగా ఎన్నుకొన్నారు.

అప్పుడే దేశభక్త కొండ వెంకటప్పయ్యగారిని అ. భా. కాంగ్రెసు అధ్యక్షులుగా వరించారు. కాంగ్రెసు కార్యాలయాన్ని బెజవాడకు మార్పించి కార్యకలాపాలు కొనసాగించారు. ఆంధ్రజాతీ యోద్యమంలో 1923లో జరిగిన కాకినాడ కాంగ్రెసు మహాసభలు మరో ముఖ్యఘట్టం. ఆంధ్రరత్న హాజరై పాల్గొన్నారు. అనంతరం ఆంధ్రరత్న కొంత హృదయావేదన పడినట్లు కనుపిస్తుంది. 1925లో రాష్ట్రకాంగ్రెసు కార్యదర్శిపదవికి గూడా వీరు రాజీనామా యిచ్చారు. అప్పట్లో యిప్పుడు రాయలసీమ అని పిలువబడుతున్న పశ్చిమాంధ్రలో గాడిచర్ల హరిసర్వోత్తమ రావుగారు, బెజవాడ కార్యాలయంలో అయ్యదేవర కాళేశ్వర రావుగారు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు ముగ్గురు కార్యదర్శులుగావుండి కార్యక్రమాలు కొనసాగించేవారు.

తర్వాత 3 ఏండ్లకాలం ఆంధ్రరత్న యావదాంధ్రదేశం విస్తృతంగా పర్యటించారు. 1924లో ఆలమూరులో తూర్పు గోదావరి జిల్లా సభలు జరిగినవి. రామదండు శిక్షణ శిబిరాలు నిర్వహించారు. నరసారావుపేట తాలూకా పమిడిపాడు గ్రామంలో జరిగిన ఆంధ్రగ్రంథాలయ మహాసభలకు అధ్యక్షత వహించి విజ్ఞాన దాయకమైన మహోపన్యాసం యిచ్చారు. కొండజాతి ఉద్ధరణకై విశాఖ మాడుగుల సభలకు వెళ్లారు. కొవ్వూరు గీర్వాణ విద్యా పీఠమును సందర్శించారు. అనేక స్వచ్ఛంద సేవకుల శిక్షణ

శిబిరాలకు వెళ్లి, కార్యకర్తలలో చైతన్యాన్ని కలిగించి తరిఫీదు నిచ్చారు. ఎల్లెడలా రామనామ సప్తాహాలు జరిపించారు. తమ ఆదర్శాలను, ఆశయాలను బహుళ ప్రచారం గావించుటకు 'సాధన' అనే ఆంగ్ల వారపత్రిక స్థాపించారు.

ధన్య జీవి

1926లో దేహారోగ్యం సరిలేకున్నా గుంటూరు మండల సభలకు ఆహ్వాన సంఘాధ్యక్షులుగా వుండి నిర్వహించారు. తమ సంచార కార్యక్రమంలో ఉపన్యాసానికి నూటపదహార్ల వంతున స్వీకరించి, ఆ నిధులను కాంగ్రెసుకు కానుకలుగా సమర్పించేవారు.

స్వీయారోగ్యాన్ని సైతం లెక్కచేయని, నిరంతర పర్యటనలు, కార్యక్రమాల వలన ఆరోగ్యం క్షీణించి, 1926 నుండి దీర్ఘరుగ్మత ఏర్పడింది. క్షయలోకి దించింది. 10_6-1928 రాత్రి 10 గంటలకు ఆంధ్రరత్న తమ 38 వ ఏటనే గుంటూరులో దివంగతులయినారు. ఆయన సహచరులు గౌస్‌బేగ్‌గారు తదితర మిత్రులు రాంనగరం చేర్చి అచట వారి దహన సంస్కారాలు గావించారు. తమకున్న కొద్దిపాటి ఆస్తిపాస్తులనుగూడా రామనగరం శ్రీరామాలయ నిర్మాణానికి అర్పించి, ఆంధ్రరత్న ధన్యజీవి అయినారు.

ఆంధ్రరత్న ఒక్కరాజకీయ నాయకుడేకాదు. కవి, పండితుడు, మంచినాయకుడు. అకుంఠిత కార్యదీక్షాపరుడు. స్వరాజ్య స్వధర్మ రక్షణకు కంకణం ధరించిన దేశారాధకుడు. పిన్నవయస్సులోనే చేపట్టిన బహుముఖ కార్యాలెన్నిటినో అసంపూర్తిగా విడిచిపెట్టి, స్వర్గానికి పయనించారు. " ఆంధ్రరత్న చీరాల సత్యాగ్రహమును నడిపిన ఏకైక వీరుడు. వారి ధైర్యము, త్యాగము, వాగ్విశారదత్వము, ప్రజాకర్షణశక్తియు, అనన్యము అపూర్వమునవి చెప్పతగినవి. ఇరువది వేలమంది పౌరులను వశపరుచుకొని, ఒక్క త్రాటిమీద నడిపించి, తరతరములనుండి కాపురము చేయు ఇండ్లు వాకిళ్లు వదలి పరస్థలమున పూరిపాకలలో నివసింప చేసిన మహోదంతము, హిమాచలమునుండి కన్యాకుమారి వరకు ప్రజల హృదయముల నాశ్చర్య పూరితము గావించినది. కాంగ్రెసు ఉద్యమమునకు నిరుపమానమగు బలమును సమకూర్చినది. ఆంధ్ర రాష్ట్రమునకు అపూర్వమగు గౌరవమును కల్గించినది. "

('దేశభక్త' జీవితచరిత్ర)


"ఆయన సుందరరూపం, మోహనగానం, సరస సూక్తులు, హాస్యం, ఎండిన చెట్లనే చిగిరింప జేయుననగా, మానవులను ముగ్ధులను చేయుటలో ఆశ్చర్యమేమి ?" (కృష్ణాపత్రిక)

★

'ఆంధ్రరత్న' జీవితంలో ముఖ్య ఘట్టములు

జననం	విరోధినామ సంవత్సర జ్యేష్ఠ శుద్ధ చతుర్దశి 1889 జూన్ నెల 2వ తేదీ
1906	బాపట్ల హైస్కూలులో చదువు-గుంటూరు ఉన్నత విద్య
1911	ఇంగ్లండుకు పయనం_గాంధీజీ దర్శనం ఐర్లండులో_ భారత సంఘానికి కార్యదర్శిత్వం
1916	స్వదేశానికి తిరిగిరాక
1917	రాజమహేంద్రవరం ట్రయినింగు కళాశాలలో చరిత్రాధ్యాపకులు.
1918	బందరు జాతీయ కళాశాల అధ్యాపకత్వం
1920	కలకత్తా కాంగ్రెసుకు హాజరు మహానంది ఆంధ్రమహాజన సభకు హాజరు ఆంధ్ర విద్యాగోష్ఠి సంస్థ స్థాపన 'రామదండు' స్థాపన బెజవాడ కాంగ్రెసు సభలకు హాజరు చీరాల, పేరాల పురనిర్గమనం
ఏప్రిల్ 7	రాంనగర్‌కు గాందీజీ శంకుస్థాపన బరంపురం ఆంధ్రమహాసభ ఆంధ్రరత్న అరెస్టు
1922	అక్టోబరు 2న జైలునుండి విడుదల
1922_23	తీర్థ యాత్రలు ఆంధ్ర సోదర సమితి స్థాపన
1923	అ. భా. కాంగ్రెసు కార్యదర్శిత్వం. 8 వ ఆంధ్ర గ్రంథాలయ మహాసభకు అధ్యక్షత_పమిడిపాడు.
1923	కాకినాడ కాంగ్రెసు మహాసభలకు హాజరు.
1924_25	ఆలమూరు మహాసభలు-రాష్ట్ర పర్యటన.
1924-26	రాష్ట్ర కాంగ్రెసు కార్యదర్శిత్వం తదనంతరం రాజీనామా.
1926	శరీర రుగ్మత_గుంటూరు మండల సన్మాన సభకు ఆహ్వాన సంఘ కార్యదర్శిత్వం
1928	గుంటూరులో మరణం. రాంనగర్‌లో దహన సంస్కారాలు.

★



మెట్ట సాగుపై అంతర్జాతీయ పరిశోధన

శ్రీ ముసునూరి శివరామకృష్ణారావు

సాధ్యమైనంత త్వరగా ఆహారోత్పత్తిని పెంచి స్వయం సమృద్ధి సాధించే యత్నంలో శీఘ్రంగా ఫలితాల్నిచ్చే ప్రాంతాలపై ప్రణాళికా వ్యూహాన్ని కేంద్రీకరించడం వలన వర్షాధారపు భూముల విషయంలో-ప్రత్యేకించి అనావృష్టికి గురి అయ్యే వాటి విషయంలో పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ నిర్లక్ష్యం చెయ్యబడ్డాయనే భావం ప్రబలంగా వున్నది. వర్షాధారపు భూముల్లో ఉత్పత్తిని పెంచి గణనీయమైన విజయాల్ని సాధించడం కష్టతరమైనప్పటికీ, ఏ కొద్ది పాటి అభివృద్ధిని తేగలిగినా మొత్తం లభ్యమయ్యే ధాన్యరాశిని పెంచడంలో అది ముఖ్యపాత్ర వహించ గలదని చెప్పవచ్చు ఎందుకంటే ఉష్ణమండలాల్లోని 48 దేశాలలో 51 కోట్లపైచిలుకు ప్రజలు ఈ విశాలమైన వర్షాధార ప్రాంతాల్లో నివసిస్తున్నారు.

ఈ వర్షాధార ప్రాంతాల్లో వ్యవసాయోత్పత్తిని పెంచడమే గాక అక్కడి ప్రజలకు ఉపాధి కల్పించి వారి ఆదాయాన్ని అధికం చేయవలసిన అవసరాన్ని గురించి ఐ.రా.స. ఆహార, వ్యవసాయ సంస్థ టోక్యోలో 1970 లో జరిపిన ఆసియా ప్రాంతీయ సభలో నొక్కి చెప్పగా, ఇటీవల రోములో జరిగిన ప్రపంచ ఆహార విషయాల మహాసభలో ఆ విషయాన్ని మరింత గట్టిగా ఉగ్గడించడం జరిగింది. శీతోష్ణస్థితికి వ్యవసాయోత్పత్తికి మధ్య వున్న సంబంధం, ముఖ్యంగా అసాధారణమైన ప్రకృతి వైపరీత్యాలకు గురి అయ్యే ప్రాంతాలలో ఈ సంబంధం గురించి మన జ్ఞానాన్ని వృద్ధి చేసుకొనడం, ఈ ప్రాంతాల్లోని సహజ వనరులను మరింత సద్వినియోగం చేసుకొనడం, వర్షాధార భూముల వ్యవసాయంలో నష్టపడే అవకాశాలు, పెట్టుబడి అవసరాలు తగ్గించి మేలైన సాంకేతిక పద్ధతులను రూపొందించి రైతులు అనుసరించేటట్లు చేయడం పట్ల శ్రద్ధ వహించడం అవసరమని రోము మహాసభ పేర్కొన్నది. ఇందుకు సంబంధించిన పరిశోధన అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలకు అదనపు నిధులు కేటాయించాలని ఈ సభ సిఫారసు చేసింది.

ఈ కార్యక్రమ రచనకు నాందిగా, వర్షాధార వ్యవసాయాభివృద్ధికి ప్రస్తుత వ్యవసాయ పద్ధతులు ఎంత వరకు ఉపయోగపడతాయో పరిశీలింప జేయడానికీ, ఉష్ణమండలాల్లోని వర్షాధార ప్రాంతాల్లో వున్న అగ్రశ్రేణి పరిశోధనా కేంద్రాలు రూపొందిస్తున్న నూతన పద్ధతులను పరీక్షించడానికీ, ఈ ప్రయోగ ఫలితాలు రైతులు ఎంతవరకు ఉపయోగిస్తున్నారో, అందుకున్న అడ్డంకులు ఏమిటో అధ్యయనం చేయడానికీ, విషయ పరిజ్ఞానం గలిగిన అందరినీ ఒక జట్టుగా ఏర్పరచాలని ఐ.రా.స. ఆహార, వ్యవసాయ సంస్థ నిర్ణయించింది.

వివిధ ప్రాంతాలలో పరిశోధన

ఈ నిర్ణయానుసారం ఆసియాలోని 12 దేశాలు, ఆఫ్రికాలోని 4 దేశాలు, మరో ఐదు ఇతర దేశాలు అంతర్జాతీయ, ప్రాంతీయ, ధర్మనిధి సంస్థలు మొత్తం 7 పాల్గొంటున్న జట్టును ఐ.రా.స. అభివృద్ధి కార్యక్రమ సంస్థ సహకారంతో సమావేశపరచడం జరిగింది. ఈ జట్టు ఇండియా, థాయిలాండ్, మలేసియాలలో సమాలోచనలు జరపాలని నిర్ణయం అయ్యింది. వర్షాధార వ్యవసాయం అభివృద్ధి పరచడానికి ముఖ్యమైన పరిశోధనలు జరుగుతున్న ప్రాంతాల్లో సమాలోచనలు జరపాలని ఆయా ప్రాంతాల్లో క్షేత్రాలను సందర్శించాలనే లక్ష్యంతో మొట్టమొదట సమాలోచనలు హైదరాబాదులో గడచిన నవంబరు చివరి వారంలో జరిపారు. ఆ మీదట డిసెంబరులో ఈ జట్టు థాయిలాండ్, మలేసియాలను సందర్శించింది.

హైదరాబాదులో మెట్టసాగుకు సంబంధించిన అఖిలభారత పరిశోధనా సమన్వయ పథకం, ఉష్ణమండలాల్లోని వర్షాధార పైరులకు సంబంధించిన అంతర్జాతీయ పరిశోధనా సంస్థ నిర్వహిస్తున్న ప్రయోగక్షేత్రాలను ఈ జట్టు సందర్శించింది. ఈ రెండు సంస్థలు భూమిని నీటిని మరింత ప్రయోజన కరంగా ఉపయోగించుకొనడానికి మార్గాల నన్వేషించడంలో నిమగ్నమై వున్నాయి. ఇందులో అఖిల భారత సంస్థ ప్రత్యేకించి వాతావరణ వైపరీత్యాలు ఏర్పడినప్పుడు పైరును మార్చడం, మిశ్రమ పైరులను సాగు చేయడం మొదలైన ఆపద్ధర్మ పథకాలను రూపొందించడంలో కృషిచేస్తున్నది. సజ్జ, జొన్న, కంది, శెనగ, వేరుశెనగ, పైరులపై ప్రత్యేక పరిశోధనలు చేస్తున్నది. అంతర్జాతీయ సంస్థ ఈ ఐదు పైరులు వర్షాధార ప్రాంతాలకు ముఖ్యమైనవి గాబట్టి వాటిని ఎంచుకొనడం జరిగింది. ఉభయ సంస్థల ప్రధాన లక్ష్యం వర్షాధార వ్యవసాయంలో అననుకూల వాతావరణం వలన పంటల దిగుబడి తగ్గి రైతులు నష్టపడిపోకుండా చేయడమే.

(తరువాత 11 వ పేజీలో)

రాష్ట్రంలో కొత్త విద్యుచ్ఛక్తి పథకాలు

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి విద్యుచ్ఛక్తి కీలక పాత్ర వహిస్తుంది. జల విద్యుచ్ఛక్తి, థర్మల్ విద్యుచ్ఛక్తి వనరుల ద్వారా విద్యుచ్ఛక్తి ఉత్పత్తిని అధికం చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక శ్రద్ధతో నిరంతరం కృషి చేస్తున్నది. మన ప్రణాళికలలో విద్యుచ్ఛక్తి ఉత్పాదనకూ, పంపిణీకీ చేసిన కేటాయింపులే దీనికి నిదర్శనం. మూడవ ప్రణాళికలో రూ 93.6 కోట్లు కేటాయించబడగా నాలుగవ ప్రణాళికలో దానికి రెండింతలు రూ. 186.4 కోట్లు కేటాయించారు. 1974-75 సంవత్సరంలో రాష్ట్ర వార్షిక ప్రణాళికా వనరుల నుండి దాదాపు 35 శాతం పైగా విద్యుచ్ఛక్తి రంగానికి కేటాయించారు

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో స్థాపిత విద్యుదుత్పాదన శక్తి 870.4 మెగావాట్లు ఉంది. 1978-79 నాటికి గరిష్టస్థాయిలో అవసరాలు 1300 మెగావాట్లు ఉండవచ్చు. ఆరవ ప్రణాళిక ఆఖరు నాటికి పదేండ్లకాలంలో యీ అవసరం 2,400 మెగావాట్లకు పెరగవచ్చు. యీ అవసరాలను ఆదుకోవడానికి వీలుగా 1985 నాటికి స్థాపిత ఉత్పాదకశక్తి 2800 మెగావాట్లకు పెరగాల్సి ఉంటుంది ప్రస్తుతపు స్థాయినుండి ప్రతి ఐదు సంవత్సరాలకు స్థాపిత ఉత్పాదక శక్తిని రెండింతలు చేయాల్సిఉంటుందని దీనివల్ల విదితమవుతుంది. అందువల్ల, ముందువచ్చే అవసరాలను ఆదుకోవడానికి వీలుగా దిగువ తెల్పిన పథకాలను అమలు జరపాలని ప్రతిపాదించారు. 1. కొత్తగూడెం మూడవ దశ, 2. దిగువ సీలేరు జలవిద్యుచ్ఛక్తి పథకం, 3. కొత్తగూడెం నాలుగవ దశ, 4. నాగార్జునసాగార్ జలవిద్యుచ్ఛక్తి పథకం, 5. శ్రీశైలం జల విద్యుచ్ఛక్తి పథకం, 6 విజయవాడ థర్మల్ పథకం.

యూనిట్ల ఉత్పాదన

కొత్తగూడెం థర్మల్ పథకం మూడవదశలో ఒకటి, రెండవ దశలలో పరంపరగా కొత్తగూడెంలో 110 మెగావాట్లశక్తిగల రెండు థర్మల్ సెట్లు ఏర్పాటుచేస్తారు. ఈ పథకం అమలుకు రూ. 5166 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని అంచనా మొదటి సెట్టును 1974 ఆగస్టులో ప్రారంభించారు. ఆ తర్వాత నాలుగు నెలలకు రెండవ సెట్టు ప్రారంభించారు. 1974 మార్చి ఆఖరి వరకు రూ. 4589 లక్షలు ఖర్చు చేశారు.

రూ. 96 కోట్లతో అమలు జరుపుతున్న దిగువ సీలేరు జల విద్యుచ్ఛక్తి పథకంలో 100 మె. వా. శక్తిల నాలుగు సెట్లు ఏర్పాటు చేస్తారు. మొదటి రెండు సెట్లను రష్యానుండి దిగుమతి చేసుకున్నారు. మిగతావి భారత భారీ విద్యుత్పరికరాల ఫ్యాక్టరీనుండి పొందుతారు. సివిల్ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. హెడ్‌రేస్ సొరంగం త్రవ్వకం పని దాదాపు పూర్తి అయింది. ఒకటి, రెండు యూనిట్లకు చెందిన పరికరాలు అందాయి. వాటిని అమర్చే పని ప్రారంభించారు. 1975 ఆగస్టులో మొదటి యూనిటు పని ప్రారంభిస్తుంది.

థర్మల్ యూనిట్లు

రూ. 60 కోట్ల ఖర్చుతో కూడిన కొత్తగూడెం థర్మల్ పథకం 4వ దశ పథకంలో యిటీవలి కాలంలో ప్రారంభించిన 'బి' స్టేషన్‌కు విస్తరణగా రెండు 110 మె. వా థర్మల్ యూనిట్లు ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతపు అంచనాలను బట్టి 1976 ఆఖరు నాటికి మొదటి యూనిటు. 1977 మొదట్లో రెండవ యూనిటు పని ప్రారంభించవచ్చు.

రూ. 77 కోట్ల ఖర్చుతో కూడిన విజయవాడ థర్మల్ పథకంలో హైదరాబాదు-విజయవాడ రోడ్డుపై పాత విజయవాడకు పది మైళ్ళ దూరంలో ఇబ్రహీంపట్నం సమీపంలో రెండు థర్మల్ యూనిట్లు నెలకొల్పుతారు. ఈ పవర్ స్టేషన్ నిమిత్తం ప్రకాశం బ్యారేజి నుండి నీటి సరఫరా జరుగుతుంది. ప్రాథమిక సివిలు పనులు ప్రారంభించారు. భారత భారీ విద్యుత్పరికరాల సంస్థ రెండవ సెట్టు సరఫరా చేస్తుంది.

సాగర్‌నుండి విద్యుచ్ఛక్తి

నాగార్జునసాగర్ డామ్ చివరిలో 110 మెగావాట్ల శక్తివుండే ఒక సెట్టును ఏర్పాటుచేస్తారు. ఈ నాగార్జున సాగర్ జలవిద్యుచ్ఛక్తి పథకానికి రూ. 15.52 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. సేద్యం నిమిత్తం దిగువ కాలువల నుండి ప్రవహించే నీటిని ఉపయోగించుకుని విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేస్తారు. నిర్ణయించిన గడువుకు ముందుగా 1978-79 లో యీ యూనిటు పని ప్రారంభిస్తుంది.

రూ. 12 కోట్ల ఖర్చుతో ఎగువ సీలేరు పవర్ హౌస్ విస్తరణ పథకం చేపట్టబడుతున్నది. విశాఖపట్నం జిల్లాలో నెలకొల్పబడిన ప్రస్తుతపు ఎగువ సీలేరు పవరు హౌస్‌కు 60 మెగావాట్ల రెండు జలవిద్యుచ్ఛక్తి యూనిట్లు ఏర్పాటు చేస్తారు.

ఆంధ్రప్రదేశ్‌లో అచిరకాలంలోనే అణువిద్యుత్కేంద్రాలు ఏర్పాటుకావచ్చు. రాష్ట్రంలో ఒక అణువిద్యుత్కేంద్రం, రెండు సూపర్ థర్మల్ స్టేషనులను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని గూర్చి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నొక్కి చెప్పింది. రాష్ట్రంలో అణువిద్యుత్కేంద్రం, సూపర్ థర్మల్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన స్థలాల పరిశీలనకు కేంద్ర ప్రభుత్వం నియమించిన స్థల పరిశీలక సంఘం వివిధ ప్రదేశాలను పరిశీలించింది. మంగూరు సమీపంలో భద్రాచలం థర్మల్ పవర్ స్టేషన్ పేరుతో వ్యవహరించబడే కేంద్రం, రామగుండంలో గోదావరి థర్మల్ పవర్ పేరుతో వ్యవహరించబడే రెండు సూపర్ థర్మల్ (ప్రతీదీ 1050 మె. వా) కేంద్రాల ప్రాజెక్టు నివేదికలను తయారుచేసి ప్రపంచ బ్యాంకు రుణం నిమిత్తం కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు.

శ్రీశైలం ప్రాజెక్టు

కృష్ణానదిపై నిర్మింపబడుతున్న శ్రీశైలం జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టు రాష్ట్ర విద్యుచ్ఛక్తి ప్రాజక్టులలో అతి ప్రధానమైనది. ఈ బృహత్తర పథకం అమలు పని నిధులను దృష్టిలో ఉంచుకొని చురుకుగా కొనసాగుతున్నది. డామ్ నిర్మాణం త్వరితగతిని జరుగుతున్నది. నది మధ్యభాగంలోని లోతైన ప్రదేశంలో నీటిమళ్లింపు నిర్మాణం జరిగే క్లిష్టదశ పూర్తయింది. ఇదొక మహత్తరమైన సాంకేతిక ప్రజ్ఞ ప్రాభవంగా భావిస్తున్నారు. మన ఇంజనీర్ల ప్రతిభకు యిదొక తార్కాణం. 1975 జూన్ నాటికి పవర్ హౌస్‌కు సంబంధించిన త్రవ్వకాలు, 1975 సెప్టెంబరు నాటికి పవర్ టన్నెల్ నిర్మాణం పూర్తికావాలని లక్ష్యంగా నిర్ణయించారు.

జలవిద్యుచ్ఛక్తి ఉత్పాదనకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేయడానికి వీలుగా రాష్ట్రంలో భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టు కార్యక్రమాలను గూర్చిన వివరాలను కూడా రూపొందిస్తున్నారు. విద్యుచ్ఛక్తి మండలి యిప్పుడు యీ పనిని చేపట్టింది.

ఎనిమిది పథకాలకు సంబంధించిన క్షేత్ర పరిశీలన జరగడం గమనార్హమైన విషయం. 1. తుంగభద్ర ఎగువ కాలువ జలవిద్యుచ్ఛక్తి పథకం, అనంతపురం జిల్లా, 2. కుంతల జలవిద్యుచ్ఛక్తి పథకం, ఆదిలాబాదు 3. పోచంపాడు జలవిద్యుచ్ఛక్తి పథకం, నిజామాబాదు, 4. ఎగువ కృష్ణా జలవిద్యుచ్ఛక్తి పథకం, మహబూబునగర్, 5. ప్రాణహిత జలవిద్యుచ్ఛక్తి పథకం, ఆదిలాబాదు జిల్లా, 6. సంగారెడ్డి జలవిద్యుచ్ఛక్తి పథకం, ఖమ్మం జిల్లా 7. పులిచర్ల జలవిద్యుచ్ఛక్తి పథకం, కృష్ణాజిల్లా 8. కె. సి. కాలువ జలవిద్యుచ్ఛక్తి పథకం, కర్నూలు జిల్లా.

మన రాష్ట్రంలో విద్యుచ్ఛక్తి కొరత దాదాపు ఎప్పుడూ ఉంటూనే ఉంది. అయితే వచ్చే సంవత్సరాలలో అనుకున్న ప్రకారం రాష్ట్రంలో విద్యుచ్ఛక్తి యూనిట్లు పని ప్రారంభిస్తే యీ కొరత కొంతవరకు తీరవచ్చు. 1975–76లో 185 మె. వా. గా. ఉన్న కొరత 1976–77లో 81 మె. వా. కు తగ్గవచ్చు. 1977–78 నాటికి యీ కొరత 42 మె. వా. కు తగ్గవచ్చు. 1978–79 నాటికి స్థాపిత ఉత్పాదకశక్తి విషయంలోను ఆంధ్రప్రదేశ్ మొదటి సారిగా సంతృప్తికరమైన స్థితిలో ఉండవచ్చునని ఆశించబడుతున్నది.

మెట్టసాగు పథకాలు (9 వ పేజీ నుండి)

ఉత్పాదన శక్తిని పెంచడం, పంట దిగుబడిని స్థిరీకరించడం అనే ద్విముఖ లక్ష్యసాధనకు ప్రయోగ క్షేత్రాలలో పరీక్షించబడిన అనేక రకాల పద్ధతులను పెద్ద ఎత్తున రైతుల పొలాల్లో ఆచరణలో పెట్టి మెట్ట ప్రాంతాల్లో ఆహారోత్పత్తిని పెంచవలసివున్నది. 1973–74 లో హైదరాబాదు సమీపంలో 3,500 హెక్టేర్లలో ఈ నూతన పద్ధతులను ఆచరణలో పెట్టి సత్ఫలితాలను సాధించడంజరిగింది. దీనివలనఆముదాలదిగుబడి హెక్టేరుకు మూడు క్వింటాళ్ళకుపైగాను, సజ్జదిగుబడి హెక్టేరుకుదాదాపు 9 క్వింటాళ్ళు, వరి దిగుబడి హెక్టేరుకు దాదాపు 13 క్వింటాళ్ళు పెరిగింది.

ఏ రైతైనా తేలికగా అనుసరించదగిన సులభ పద్ధతులు కొన్ని వున్నాయి. మన రాష్ట్రంలో కొన్ని మాగాణీ ప్రాంతాల్లో మినుము వేసిన తర్వాత వరి ఊడ్చే ఆచారం వున్నది. ఈ పద్ధతి ఇతర ప్రాంతాల్లో అనుసరించకపోవడానికి ఎటువంటి కారణమూ కన్పించదు. అలాగే నలుచదరపు నాటువలన వరి దిగుబడి హెచ్చుతుందని అనుభవంలో తేలింది. ఖరీఫ్, రాబీ అని లేకుండా నల్లరేగడి భూముల్లో వీలైనంత ముందుగా విత్తడం లాభదాయకమని పరిశోధకుల సూచన. ఈ సూచనను 1972–73లో అనావృష్టి ఏర్పడినప్పుడు ఖమ్మం జిల్లాలో అమలు జరిపి చూశారు. అఖిల భారత వ్యవసాయ పరిశోధన మండలి తాలూకు మెట్ట వ్యవసాయం, కొన్ని పంటలకు సంబంధించిన పరిశోధనా సంస్థలు ఇందుకు సహాయపడ్డాయి. అధిక దిగుబడినిచ్చే కొన్ని విత్తనాల్ని వాడడం, ఎకరాకు మామూలుకంటె ఎక్కువ మొక్కలను పెంచడం మొదలైన సూచనల మేరకు సాగుచేయగా దిగుబడ 11½ క్వింటాళ్ళ నుంచి 27½ క్వింటాళ్ళకు పెరిగింది. పరిశోధన చేయడం ఒక ఎత్తు అయితే దాని ఫలితాలను రైతులకు అందించడం మరొక ఎత్తు. ఇవి రెండూ సక్రమంగా పనిచేయడంమీదనే మెట్టసాగులో అభివృద్ధి ఆధారపడివున్నది.

అంతర్జాతీయ సదస్సు

హైదరాబాదులో జరిగిన అంతర్జాతీయ సదస్సు ఈ విషయాన్ని గుర్తించి నూతన సాంకేతిక పద్ధతులను రైతులు అనుసరించేటట్లు చేయడానికి అవసరమైన పరిస్థితులు కల్పించాలనీ, ప్రయోగశాలలకు రైతులకు మధ్య మరింత సాన్నిహిత్యం ఏర్పడేటట్లు చూడాలనీ, సరఫరా విధానాలు మెరుగు పరచాలనీ సూచించింది. ముఖ్యంగా విత్తనాల సరఫరా, గ్రామాల్లోనే వాటిని నిల్వజేసి సకాలంలో రైతులకు అందజేయడం, సుశిక్షితులైన వ్యవసాయ సహాయకులను అధిక సంఖ్యలో పంపడం చాలా అవసరమని సలహా ఇచ్చింది. రైతుల అవసరాలేమిటో, కొత్త పద్ధతులను గురించి వారేమనుకొంటున్నారో, వారికున్న ఇబ్బందులేమిటో తరచుగా గుర్తించకపోవడం జరుగుతున్నది. దీనివలన పరిశోధక కేంద్రాలకు, ప్రచారకులకు, రైతులకు మధ్య ఒకరి విషయం మరొకరికి తెలియని ఎడం ఏర్పడుతున్నదనీ, ఈ ఎడాన్ని తొలగించనిదే నూతన ప్రయోగాలు విజయవంతం కావనీ హైదరాబాదు సదస్సు అభిప్రాయపడింది.

పాఠకుల లేఖలు

మహాశయా

"ఆంధ్ర ప్రదేశ్" పత్రికకు నేను ఒక అభిమానిని. అంతా బాగానేవుంది గాని మీ పత్రికలో పాఠకుల లేఖలు లేకపోవడం కష్టంగా వుంది. అసలు మీకు పాఠకులు లేఖలు రాయరా? లేక రాసినా మీరు వేయరా? ఎస్. రాజయ్య, నిజామాబాద్.

(కొంతకాలం క్రితం 'పాఠకుల లేఖలు' శీర్షిక వుండేది. ఇటీవల వేయకంలేదు. ఇటువంటి ఉత్తరాలే మరికొందరు రాశారు. పాఠకుల కోర్కెననుసరించి మళ్లీ నెలనెలా యీ శీర్షికను ప్రవేశ పెడుతున్నాం—సం.)

ఆర్యా

మే నెల "ఆంధ్ర ప్రదేశ్" పత్రికలో మధ్య పేజీలలో ప్రపంచ తెలుగు మహాసభ చిత్రాల శీర్షిక పత్రికకు అలంకారంగా వుంది అదికూడా రెండవ రంగులో వేసినందున చాలా ఆకర్షణీయంగావుంది. మామూలు వ్యాసాలతో పాటు చిత్ర శీర్షికలు కూడా ఎక్కువగా వుండాలని కోరుతున్నాను. కాని అన్యాయం ఏమిటంటే పత్రిక మే నెలాఖరు వరకు గుంటూరుకు రాలేదు.

ఎమ్. చంద్రమౌళీశ్వర ప్రసాద్, కొత్తపేట, గుంటూరు.

ఆర్యా

"ఆంధ్ర ప్రదేశ్" పత్రికలో సీరియల్‌గా మహా భారతం ఎందుకు వేస్తున్నారో! ప్రస్తుతం అచ్చవుతున్న అరణ్యపర్వం చాలా బోరెత్తున్నది. కథ నడవడం లేదు. మరొకవిషయం తమకు మనవిచేసేదేమంటే దీనిలో చెప్పబడుతున్న ధర్మాలు మొదలగునవి యీ కాలానికి పనికిరావు. ఈనాటి ప్రజాస్వామ్య, సోషలిస్టు సిద్ధాంతాలకు సరిపడని సంగతులు చాలా వున్నవి గమనించగోర్తాను.

బలిమెల రాఘవయ్య, విశాఖపట్టణం.

ఆర్యా

మే నెల "ఆంధ్రప్రదేశ్" ఎంతో బావుంది. రానురాను మన పత్రిక కొత్త అందాలను సంతరించుకుంటోంది. విషయ ప్రాధాన్యత, వైవిధ్యం కలిగిన వ్యాసాలు యీ మాసం సంచికలో ప్రత్యేకతలు. "విదేశాల్లో తెలుగువారు" "తెలుగుగడ్డ మీద తెలుగు చలనచిత్రపరిశ్రమ" "అఖిలభారత ఫొటోగ్రఫీ ప్రదర్శన"—యీమూడు వ్యాసాలు పత్రికకు మకుటాయమానంగా వున్నాయి. ప్రపంచ తెలుగు మహా సభదృశ్యాలు రంగుల్లో ముచ్చటగా వున్నాయి. దీనితోపాటు మీరు ప్రచురించిన ప్రత్యేక వ్యాసం మరింత సంగ్రహంగాను, వివరణాత్మకంగాను వుంటే బావుండేది. "మహాభారతం"తో పాటుగా ఒకటి, రెండు సాంఘిక సమస్యలను దృష్టిలో వుంచుకొని వ్రాసిన కథలను ప్రచురిస్తే బావుంటుందని మనవి. మీరు సాంఘిక నవలను ఎందుకు ప్రచురించటం లేదు?

కుమారి పి. మంజుల, తెనాలి.

(త్వరలోనే ఒక సాంఘిక నవలను సీరియల్‌గా ప్రచురించనున్నాం—సం.)

ఆర్యా

మార్చి నెలనుండి "ఆంధ్ర ప్రదేశ్" పత్రికను ప్రత్యేక శ్రద్ధతో చదువుతున్నాం. ప్రభుత్వం ప్రచురిస్తోన్న పత్రికలన్నిటిలోను యీపత్రిక సామాన్య పాఠకుడికోసం ఎక్కువ శ్రద్ధతీసుకొంటోందనిపిస్తోంది. అయితే మాస పత్రిక కావటంవల్లా, అందుకోను వెలువడి వెనువెంటనే మార్కెట్లోనికి రాకపోవడం వల్లా (యిందుకు కారణం ఏమిటో తెలియదు!) ఎక్కువమంది చదవటానికి వీల్లేకపోతోంది. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మీరు ప్రచురించిన ప్రత్యేక సంచిక యీమధ్య వచ్చిన తెలుగు పత్రికలన్నింటిలోను ఆణిముత్యవంటిందని చెప్పాలి. తెలుగు భాష, సాహిత్యం సంస్కృతి, లలిత కళలు మొదలగు విషయాలపై మీరు ప్రచురించిన వ్యాసాలన్నీ బైండుచేయించి భద్రంచేసుకోదగ్గవి. లోపలి పేజీల్లో రంగులబొమ్మలు, నవ్వించే కార్టూన్లు, కథలు ఎక్కువగా వేయమని మనవి.

ఆచంట పద్మజ, కె. సత్యనారాయణ శర్మ, విశాఖపట్నం.

ఆర్యా


1975 మే నెల ఆంధ్రప్రదేశ్ పత్రికలో 3వ కవరు పేజీలో శ్రీ బుజ్జాయిగారువేసిన "ప్రకాశం కథ" చిత్రాలలో ఒకటి రెండుపొరపాట్లు దొర్లినవి. వాటిని మీ దృష్టికి తెస్తున్నాను.

సైమన్ కమిషన్ బహిష్కరణ తీర్మానం 1927 డిసెంబరు ఆఖరులో మద్రాసులో డా. అన్సారీ అధ్యక్షతన జరిగిన కాంగ్రెసు మహాసభలో చేశారు. కాని మోతీలాల్ అధ్యక్షతన కలకత్తాలో జరిగిన సభలోకాదు. అలాగే ప్రకాశంగారు సభ్యత్వానికి రాజీనామాచేసి దండిసత్యాగ్రహంలో పాల్గొన్నారని వున్నది. కాని రాజీనామా చేసి, తరువాత తిరిగి పోటీచేసి ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఆ తరువాత వారు దండిసత్యాగ్రహంలో పాల్గొన్నారు.

డి. పట్టాభిరామయ్య, జర్నలిస్టు, బందరు.

(శ్రీ పట్టాభిరామయ్యగారు ఆంధ్రప్రదేశ్ పత్రిక యింతశ్రద్ధగా పరిశీలనాత్మకంగా చదువుతూ వుండడం ముదావహం. వారికి ధన్యవాదాలు—ప్ర.సం.)—






నగరంలో..!


ఎడమవైపు పైన, మధ్యన : మే 19న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ముఖ్యమంత్రి 'తరతరాల తెలుగు వెలుగు' ప్రదర్శన ముగిసిన సందర్భంగా ఏర్పాటైన సభలో వివిధ రంగాలలో ప్రముఖులకు వారి సేవలకు గుర్తింపుగా ప్రశంసా చిహ్నాలను అందజేశారు.


ఎడమవైపు క్రింద : ముఖ్యమంత్రి మే 27న నిజోని టూల్స్ పారిశ్రామిక యూనిటుకు ప్రారంభోత్సవం చేశారు.

కుడివైపు పైన : కార్మికశాఖ మంత్రి శ్రీ టి. అంజయ్య మే 28న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సిపాయిల, నావికుల, వైమానికుల 16వ సమావేశంలో ప్రసంగించారు.

కుడివైపు క్రింద : మునిసిపల్ వ్యవహారాల మంత్రి శ్రీ సి. సుబ్బారాయుడు మే 26న డాక్యుమెంటరీ చలనచిత్రోత్సవానికి ప్రారంభోత్సవం చేశారు.







రాజధాని విశేషాలు

—శ్రీ తిరుమల రామచంద్ర

ఆంధ్రపత్రిక సంపాదకులు శ్రీ శివలెంక రాధాకృష్ణ ఆంధ్ర పత్రికను మద్రాసునుంచి హైదరాబాదుకు తరలించగానే, ఒక మంచి పని చేశారు. అదేమిటంటే, దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు 108వ జయంతినాడు ఆయన సంస్మరణ చిహ్నంగా ఉపన్యాసం పెట్టించి ఒక విద్వాంసుని వేయిన్నూట పదహార్లతో సత్కరించడం. ఈ ఉపన్యాసం ఏటా యీ విధంగానే కొనసాగుతుంది. మొదటి ఉపన్యాసం మే 7వ తేదీన బషీర్‌బాగ్‌లోని ఆంధ్రపత్రిక కార్యాలయంలో జరిగింది. మాజీ న్యాయమూర్తి శ్రీ పల్లూరి పార్థసారధి అధ్యక్షత వహించారు. డాక్టర్ దివాకర్ల వేంకటావధాని తెలుగు సాహిత్యం సింహావలోకనం చేశారు. ముఖ్యమంత్రి శ్రీ జె. వెంగళరావు వేయిన్నూట పదహార్లను ఆంధ్రపత్రిక పక్షాన బహూకరించారు. ప్రారంభంలో శ్రీ శివలెంక రాధాకృష్ణ ఉపన్యాస పరంపర ఉద్దేశం వివరించారు.

మంత్రి శ్రీ రాజమల్లు సలహా

ఆరోగ్యశాఖామంత్రి శ్రీ కె. రాజమల్లు మే 2వ తేదీన గాంధీ హాస్పిటల్‌లో జరిగిన చర్మరోగ వైద్యుల వార్షికోత్సవంలో ప్రసంగిస్తూ, వైద్యులు, మత ప్రచారకులు పట్టుదలతో కుష్ఠురోగ నివారణకు ప్రయత్నించాలని ఉద్బోధించారు. ఆరోగ్య, కుటుంబ నియంత్రణ శాఖ డైరెక్టర్ డాక్టర్ రాఘవేంద్రరావు ప్రసంగిస్తూ, గాంధీ హాస్పిటల్‌కు అనుబంధంగా కుష్ఠుపరిశోధన విభాగం ఉండాలని సూచించారు. ప్రముఖ చర్మరోగ నిపుణుడు డాక్టర్ హేమచంద్ర ఒక పంచసూత్ర పథకాన్ని సమర్పిస్తూ, ఆంధ్ర ప్రదేశ్‌లో దాదాపు ఆరు లక్షలమంది కుష్టువ్యాధితో బాధపడుతున్నారనీ, వారి విషయంలో శ్రద్ధతీసుకోవడమేకాక చెంగల్పట్టులోవున్నట్టుగా పరిశోధన, శిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేయాలని సూచించారు.

'రంజని' 14వ వార్షికోత్సవం

ఎ.జి. ఆఫీసు తెలుగు సాహితీసమితి 'రంజని' 14వ వార్షికోత్సవం మే 2,3,4 తేదీలలో ఎ. జి. ఆఫీసు ఆడిటోరియంలో వైభవోపేతంగా జరిగింది. అక్కౌంటెంట్ జనరల్ శ్రీ జి. రామచంద్రన్ ప్రారంభోత్సవం జరిపారు; తెలుగు సాహిత్యం విస్తరణను గురించి. తమిళులపై తెలుగు భాష ప్రభావం గురించి ప్రసంగించారు. తొలినాటి సమావేశంలో 'తెలుగు సాహిత్యంలో విమర్శ' అనేవిషయమై జరిగిన సదస్సుకు శ్రీ దేవులపల్లి రామానుజరావు అధ్యక్షత వహించారు. శ్రీయుతులు తిరుమల రామచంద్ర, రాంభట్ల కృష్ణమూర్తి, డాక్టర్ ముకురాల రామిరెడ్డి, డి. ఆంజనేయులు ప్రసంగించారు. అక్కౌంటెంట్ జనరల్ కార్యాలయంలోని తెలుగు మాతృభాషకానివారు ఆరు నెలలలో తెలుగు నేర్చుకొనడమేకాక, 'నీళ్ల' అనే నాటికను ప్రదర్శించడం ఆనాటి కార్యక్రమం విశేషం. రెండవనాడు 'తెలుగు సాహిత్యానికి మహిళలసేవ' అనే విషయంపై జరిగిన గోష్ఠికి శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి అధ్యక్షతవహించారు. డాక్టర్ నాయని కృష్ణకుమారి, శ్రీమతి పరిమళా సోమేశ్వర్, శ్రీమతి చావలి మణిశాస్త్రి ప్రసంగించారు. మూడవనాడు డాక్టర్ దివాకర్ల వేంకటావధాని యక్షగానంలో నాట్యశాస్త్రం గురించి, అధికారభాషా కమీషన్ అధ్యక్షుడు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య అధికారభాషను గురించి ప్రసంగించారు. సీనియర్ డిప్యూటీ అక్కౌంటెంట్ జనరల్ శ్రీ నగరాజన్ ప్రత్యేకసంచికఆవిష్కరించారు. కుమారి హైమావతి కూచిపూడినృత్యం ప్రదర్శించగా, శ్రీమతి రాయప్రోలు జానకీదేవి గానంచేశారు ఆమె మధురకంఠం, పాడినతీరు శ్రోతలను ముగ్ధులనుచేశాయి. రంజని అధ్యక్షుడు, సుప్రసిద్ధ కథకుడు శ్రీ ఇసుకపల్లి దక్షిణామూర్తి ఉత్సవప్రారంభంలో స్వాగతంచెప్పారు.

జయంతి ఎక్స్‌ప్రెస్

దక్షిణమధ్యరైల్వేవారు మే 3వ తేదీన హైదరాబాద్ నుండి ఢిల్లీకి నరాసరి వెళ్లే కొత్త ఎక్స్‌ప్రెస్‌ను—జయంతి ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. దీనిలో ప్రస్తుతం రెండవతరగతి పెట్టెలు మాత్రమే ఉంటాయి. ఇది వారానికొకసారి వెళ్లుతుంది. దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌కన్న మూడు గంటలు ముందుగా చేరుకుంటుంది. ప్రయాణీకులు రెండు రాత్రులు బండిలో గడపనక్కరలేదు. జనరల్ మేనేజర్ శ్రీ కె.ఎస్. రాజన్ దీనిని ప్రారంభిస్తూ దక్షిణ మధ్యరైల్వే ఇటీవలే కృష్ణ, గోదావరి ఎక్స్‌ప్రెస్సులను ప్రారంభించిందనీ, జయంతి ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభిస్తున్నందుకు గర్విస్తున్నదనీ అన్నారు.

శ్రీ సంజీవయ్య స్మారకారామం

పాటిగడ్డలో 80 ఎకరాల ప్రాంతంలో నిర్మించబడే దామోదరం సంజీవయ్య స్మారకారామానికి ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు మే 7వ తేదీన ప్రారంభోత్సవం జరిపారు. శ్రీ సంజీవయ్య ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రిగా వున్నప్పుడు ఈ పాటిగడ్డలో సచివాలయం నిర్మించాలని సంకల్పించబడిందనీ, అదే ప్రాంతంలో సంజీవయ్య స్మారకారామం నిర్మించబడడం చాల బాగుందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ ఆరామంలో సంజీవయ్య స్మారక చిహ్నం, గ్రంథాలయం, దళితజాతుల పునరుద్ధరణ పథకాల చర్చలకు, పరిశోధనలకు తగిన భవనాలు నిర్మించబడుతాయి. ఈ ఆరామం త్వరలోనే పూర్తవుతుందని మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి శ్రీ నరేంద్ర లూథర్ తెలిపారు.

ఉస్మానియా మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్, డీన్, ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో వైద్యుడు డాక్టర్ బి. కె. నాయక్ లండన్‌లోని రాయల్ వైద్య కళాశాల ఫెలోగా ఇటీవల ఎన్నికయ్యారు. డాక్టర్ నాయక్ ప్రపంచారోగ్య సమితి ప్రతినిధిగాను, బ్రిటిష్ కౌన్సిల్ ఫెలోగాను ప్రపంచమంతటా పర్యటించారు. ఈయన గొప్ప హృదయరోగ నిపుణుడు, భారత హృదయరోగ నిపుణుల సంఘానికి అధ్యక్షుడుగా వున్నారు. ఈ గౌరవం పొందిన ఆంధ్రప్రదేశ్ వైద్యులలో ఈయనే ప్రథములు. ఈయన 'ఇండియన్ హార్ట్ జర్నల్' సంపాదక వర్గంలోను ఉన్నారు.

పద్మజానాయుడు విరాళం

షట్‌సూత్ర ప్రణాళిక క్రింద నెలకొల్పబడుతున్న కేంద్ర విశ్వ విద్యాలయానికి కీర్తిశేషులు కుమారి పద్మజానాయుడు హైదరాబాదులోని తన పిత్రీయమయినభవనం "గోల్డెన్ థ్రెషోల్డ్‌ను" విరాళమిచ్చారు. ఆమె మరణానికి ముందు వ్రాసిన వీలునామాలో ఈ విషయాన్ని వ్రాశారని ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు మే 8వ తేదీన శాసన సభలో పద్మజానాయుడు మరణానికి సంతాప తీర్మానం ప్రతిపాదించినప్పుడు తెలిపారు. ఆమె దాదాపు కోటి రూపాయలు విలువచేసే ఆస్తిపాస్తులను విరాళ మిచ్చారు గనుక కేంద్ర విశ్వవిద్యాలయానికి 'పద్మజానాయుడు విశ్వవిద్యాలయం' అని పేరు పెట్టడం ఉచితమని ప్రతిపక్షనాయకులు శ్రీ ఎన్. శ్రీనివాసులు రెడ్డి, శ్రీ కె. రంగదాస్ సూచించారు.

జవుళి అభివృద్ధి కార్పొరేషన్

రాష్ట్రంలో జవుళి అభివృద్ధికి కోటి రూపాయల నిధితో ఒక కార్పొరేషన్‌ను నెలకొల్పడానికి రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి శ్రీ కె. వి. కేశవులు మే 9వ తేదీన పత్రికా ప్రతినిధుల గోష్ఠిలో తెలిపారు. పరిశ్రమలశాఖ కార్యదర్శి శ్రీ ఎస్. ఆర్. రామమూర్తి దీనికి మొదటి చెయిర్మన్‌గా ఉంటారు. ఈయన దుస్తుల తయారీ కార్పొరేషన్‌కు కూడా చెయిర్మన్. ఈ కార్పొరేషన్ జవుళి ఎగుమతిని ఎక్కువ చేయడానికి, జవుళిపరిశ్రమలోని కార్యకర్తలకు, కార్మికులకు సాంకేతిక జ్ఞానాన్ని ఇతోధికంగా కలిగించడానికి ప్రయత్నిస్తుందని మంత్రి తెలిపారు.

బొంబాయి తెలుగువారి రాయబారం:

బొంబాయి ఆంధ్రసారస్వత పరిషత్తు ప్రతినిధులు శ్రీయుతులు దేవరశెట్టి వేంకటేశ్వర్లు, శేర్ల శాయన్న, ఎల్లారం నారాయణ, దాసరి వించాద్రి మే నెల 18 వ తేదీన ముఖ్యమంత్రిని, విద్యా మంత్రిని కలుసుకొని మహారాష్ట్రలోని తెలుగువారికోసం ప్రచురించే పాఠ్య పుస్తకాలకు ఆర్థిక సహాయం చేయాలని కోరారు. మహారాష్ట్రలో దాదాపు 15 లక్షల మంది తెలుగు మాతృభాషగల వారున్నారని, మహారాష్ట్ర ప్రభుత్వం పెక్కు పాఠశాలలలో తెలుగువారికి మాతృభాషలో విద్యాబోధనకు అవకాశం కలిగించినా, తగిన పాఠ్య పుస్తకాలు లేనందున ఇబ్బంది కలుగుతున్నదని వారు మంత్రులకు వివరించారు. మహారాష్ట్ర ప్రభుత్వం వాచకాలను అనువదించి ప్రచురించడానికి అనుమతించిందనీ, ఇంతవరకు తొమ్మిది వాచకాలు ప్రచురించబడ్డాయనీ, తక్కినవాటికి తగిన ధన సదుపాయం లేదనీ వారు తెలియజేశారు. ముఖ్యమంత్రి, విద్యామంత్రి తగు సహాయం చేస్తామనీ, ప్రపంచ తెలుగు మహాసభా లక్ష్యాలలో ఒకటి రాష్ట్రేతరాంధ్రులకు తోడ్పడడమని హామీయిచ్చారు.

తపాలా బిళ్లల మ్యూజియం

భారత దేశంలో 1854 నుండి తపాలా బిళ్ళలలో కలిగిన మార్పును తెలిపే తపాలాబిళ్ళల, తదితర వస్తువుల మ్యూజియంను అశోక్‌నగర్‌లోని నగర కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయాల డైరెక్టరు శ్రీ శామ్‌సన్ రామకృష్ణయ్య మే 16వ తేదీన ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి పోస్ట్‌మాస్టర్ జనరల్ శ్రీ పి.ఎస్. రాఘవాచారి అధ్యక్షత వహించారు. ఈ మ్యూజియం కేవలం ప్రారంభదశ వంటిదనీ, దీనిని తక్కిన గ్రంథాలయాలకు గూడ విస్తరింపజేస్తామనీ, అన్నారు. భారతదేశంలో జరిగిన వివిధ సంఘటనల సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక తపాలా బిళ్లలు వివరాలతో పాటు ఈ మ్యూజియంలో ఉంచబడ్డాయి. ఈ మ్యూజియం వల్ల పిన్నలు, పెద్దలు చరిత్ర జ్ఞానం సంపాదించుకోగలుగుతారు.

మరి రెండు విశ్వవిద్యాలయాలు

ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో వరంగల్, గుంటూరులలోని స్నాతకోత్తర విద్యా కేంద్రాలు యూనిటరీ విశ్వవిద్యాలయాలుగా, (అనుబంధ కళాశాలలు లేని విశ్వవిద్యాలయాలుగా) మార్చబడుతాయని విద్యాశాఖామంత్రి శ్రీ మండలి వేంకట కృష్ణారావు మే 24 న పత్రికా ప్రతినిధుల గోష్ఠిలో తెలిపారు. విశ్వవిద్యాలయాలకు ఆర్థిక సహాయ సంఘం ఈ రెండు విశ్వవిద్యాలయాల స్థాపనకు ఇదివరకే అంగీకరించిందని ఆయన అన్నారు. గుంటూరులో భవన నిర్మాణానికి కోటి రూపాయలు అవసరమనీ, వరంగల్లులో ఇదివరకే భవనాలు నిర్మించబడినవనీ తెలిపారు. ఈ విశ్వవిద్యాలయాల విషయంలో ఉస్మానియా, ఆంధ్రవిశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లతోను, విద్యాశాఖ డైరెక్టరుతోను ఇదివరకే చర్చలు జరిగాయని ఆయన తెలిపారు.

వేంకటాద్రి ఎక్స్‌ప్రెస్

సికిందరాబాద్ నుండి కర్నూలు, గుంతకల్లు, ధర్మవరం మీదుగా సరాసరి బెంగుళూరుకు, తిరుపతికి వెళ్లే వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌కు ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు మే 19 వ తేదీన ప్రారంభోత్సవం జరిపారు. ఇది చిన్నలైనులో తిరుపతికి యాత్ర చేసేవారికి అనుకూలమని ఆయన తెలిపారు. చిన్నలైనులో ఇది అన్నిటికన్నా వేగవంతమైన రైలు. *

మన దేశము-సోషలిస్టు తరహా సాంఘిక వ్యవస్థ

శ్రీ జె. వీరాస్వామి

కొన్ని శతాబ్దాలు విదేశీపాలనలో క్రుంగిపోయిన మన దేశానికి స్వాతంత్ర్యం రాగానే, మన నాయకులు సోషలిస్టు తరహా సాంఘిక వ్యవస్థను స్థాపించడము ద్వారానే ప్రజాబాహుళ్యం సుఖ సంతోషాలను సాధించుకోగలదనీ, సమాన ప్రతిపత్తితో దేశ సౌభాగ్యాన్ని పంచుకొని అనుభవించగలదనీ, భావించారు. మన రచయితలు, కవులు కూడా అలాంటి భావాలనే వ్యక్తంచేశారు. ఈ సందర్భంలో గురజాడ వారి గేయంలో భాగమైన

దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్!

అనే చరణం గుర్తుకు వస్తుంది.

ఆనాటి రత్నగర్భ

మన దేశాన్ని గురించి చెప్పుకోవలసివచ్చినప్పుడు, ఈ దేశంలో లభించే, అపార ఖనిజ, ద్రవ్యసంపదను, గురించే కాక అవి, ఈ దేశీయులకు ఎంతవరకు ఉపయోగపడ్డాయి? వాటి ఉపయోగం వల్ల, వీరి జీవనస్థాయిలో, ఎటువంటి గణనీయమైన మార్పు వచ్చింది, అని కూడ ఆలోచించవలసి ఉంటుంది. పరిమితమైన జనసంఖ్య గల, ఆనాటి భారతదేశానికి 'రత్నగర్భ' అని పేరుండేది. దానికి తార్కాణంగా, ఎందరో విదేశీయులు దండయాత్రలు జేసి, ఈ దేశాన్ని కొల్లగొట్టి, ఆ సంపదను తమదేశాలకు తరలించుకుపోయినట్లు, చరిత్ర చెబుతుంది. స్వాతంత్ర్యం రాకపూర్వం, మన దేశ పరిస్థితి ఎలా ఉండనేది కూడా పరిశీలిద్దాం. భారత దేశంపై, ఆంగ్లేయులు అధికారం సంపాదించిన తరువాత ఈ దేశ సాంఘిక ఆర్థిక, రాజకీయ రంగాలలో, అభ్యుదయకరమైన మార్పులేమీ రాలేదు. అందుకు కారణం బ్రిటీషువారు, స్వలాభ విధానాన్ని, నిరాటంకంగా, కొనసాగించడమే. వారు, ఈ దేశ ప్రజల శ్రేయస్సుకు, ప్రాధాన్యమివ్వక ఈ దేశ సంపదను, తమ దేశాభివృద్ధికి అనుగుణంగా వినియోగించుకొన్నారు. అందుకు, వారు పరిపాలనలో, 'విభజించి పాలించు' అనే విధానాన్ని అవలంబించారు. భారత దేశంలో మతపరమైన ద్వేషాలు రగుల్కొల్పారు. మతపరమైన విషయాలలో, ఆచార భూయిష్టమయిన సాంఘిక వ్యవహారములలో, ఐక్యము కలుగ చేసికోబోమనే కుంటిసాకుతో, కుల వ్యవస్థతో. మతముపేర కల్గిన విభేదాలతో ఐక్యమత్యాన్ని పోగొట్టుకున్న, భారతదేశములో కులాలవారిగా, మతాల ప్రాతిపదికతో, ఉద్యోగాలు వనరులు వారికి అనుకూలురైన వారికి పంచుతూ, కుల మత వైషమ్యాలను పోషిస్తూ బ్రిటీషువారి సామ్రాజ్యపాలనకు భంగము రాకుండా చూసుకుంటూ పోయారు.

ఇక పోతే, బ్రిటీషువారు ఈ దేశంలో ప్రవేశపెట్టిన నూతన ఆర్థిక వ్యవస్థకు, పునరుత్పాదక స్వభావం లేదు. అంటే బ్రిటీషువారు మన దేశంలోని వనరుల్ని, అభివృద్ధి పరచలేదు, ప్రాజెక్టులు నిర్మించలేదు. పరిశ్రమలు గూడా అభివృద్ధి చెందనీయలేదు. పునర్నిర్మాణ కార్యాన్ని చేపట్టలేదు. ఎగుమతులను ప్రోత్సహించకుండా బ్రిటీషు దేశమునుంచి దిగుమతులకు ప్రాధాన్యమిచ్చారు. చేతి పనులన్నీ, నాశనం అయ్యాయి. వ్యవసాయాభివృద్ధికి, ప్రభుత్వం పూనుకోక పోవడంవల్ల, పంట ఉత్పత్తి క్షీణిస్తూ వచ్చింది. ఒక్కమాటలో చెప్పాలంటే విదేశీ పరిపాలన భారత దేశంలో బ్రిటీషువారు నెలకొల్పిన పరిపాలన వ్యవస్థల కారణంగా ఈ దేశం ఆర్థికరంగంలో దరిద్ర స్థితికి దిగజారిపోయింది.

స్వాతంత్ర్యానంతరం

ఇట్టి స్థితిలో, భారత దేశానికి స్వాతంత్ర్యం లభించింది. మన దేశీయులతో, మనదనే ప్రభుత్వం, ఏర్పడింది. మనకు స్వాతంత్ర్యం లభించికూడా, ఇప్పటికే 27 సంవత్సరాలు గడిచిపోయాయి. అయినా ఆర్థికరంగంలో, యింకా మనం గణనీయమైన అభివృద్ధిని సాధించలేకపోయామనే చెప్పవలసి ఉంటుంది. బీదవారి సంఖ్య నానాటికి పెరుగుతునే ఉంది. సాధించిన అభివృద్ధి, కొన్ని కుటుంబాలకు, కొన్ని వర్గాల ప్రజలకు పరిమితమై ఉన్నది.

ఏ దేశమైనా సుసంపన్నం కావాలంటే, అది ఉపన్యాసాలతో జరిగే పనికాదు. అందుకు నిర్దిష్టమైన లక్ష్యం, అనువైన ప్రణాళికలు, రూపొందించుకోవాలి. అప్పుడే ఆ దేశం క్రమాభివృద్ధిని సాధించగలుగుతుంది. ఈ దృష్టితో చూసినప్పుడు దేశ సుసంపన్నతకు, మన ప్రభుత్వం చేపట్టిన మార్గం ఏమిటి? అసలు ఎన్ని మార్గాలున్నాయి? వాటిల్లో మన ప్రభుత్వం విధానం ఏ విధంగా అభ్యుదయయుతమైంది, అనే అంశాలను మనం పరిశీలించవలసి యుంటుంది.

ఈ నాడు ప్రపంచంలో ముఖ్యంగా రెండు రకాలైన వ్యవస్థలు ప్రముఖంగా కన్పిస్తున్నాయి. ఒకటి, పెట్టుబడిదారీ వ్యవస్థ. రెండవది సామ్యవాద వ్యవస్థ. అమెరికా, బ్రిటన్ ఫ్రాన్స్ మొదలైన దేశాలు పెట్టుబడిదారీ వ్యవస్థను అమలుజరుపుతుంటే, రష్యా, చైనా, పోలెండు, చెకోస్లవేకియా వగైరా దేశాలు సామ్యవాద వ్యవస్థను చేపట్టాయి. ఈ రెండింటి ఉద్దేశం 'ప్రజా శ్రేయస్సే'నని, ప్రకటించడం జరిగింది. ఈ ప్రజా శ్రేయస్సును సాధించడానికి, కొన్ని దేశాల్లో రాజరికాలు, మరికొన్ని దేశాల్లో ప్రజా స్వామ్యాలు ఇంకొన్ని దేశాల్లో, శ్రామికవర్గ నియంతృత్వాలు, ఇతరదేశాల్లో సైనిక ప్రభుత్వాలు, ప్రభుత్వాధికారాన్ని చేపట్టి, కృషిచేస్తున్నాయి. అయితే, ఆర్థికాభివృద్ధి, ప్రజలందరి జీవన ప్రమాణాభివృద్ధి, వాస్తవంగా సాధించబడటానికి పెట్టుబడిదారీ వ్యవస్థ మంచిదా లేక సామ్యవాద వ్యవస్థ మంచిదా? ఈ రెండింటిలో గల, సుగుణాలేమిటి? లోపాలేమిటి అనేది తెలిసికోవడంతోపాటు పైనపేర్కొన్న ప్రభుత్వ వ్యవస్థల్లో ఏది మనకు ఉపయుక్తమైందో కూడా గ్రహించాలి.

యజమానీ—కార్మికుడూ

పారిశ్రామిక విప్లవంతో, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన మార్పులెన్నో వచ్చాయి. అందు ముఖ్యమైంది; ఉత్పాదక యంత్రాలపై వ్యక్తి ఆధిపత్యం తీసివేయడం. తన మగ్గమూ, వగైరాలతో తనకు తానే, నాల్గు డబ్బులు సంపాదించుకొంటూ, స్వావలంబియైన శ్రామికుడు, తన జీవనోపార్జన కాధారభూతములైన పరికరాల నుండి, వేరు చేయబడ్డాడు. అతని స్థానాన్ని, ఎన్నో యంత్రాలపై అధిపత్యం కలిగి, ఎన్నో వేల మంది కార్మికుల్ని నియమించి పనిచేయించే పెట్టుబడిదారుడు, ఆక్రమించాడు. ఈ కార్మికులకు, పెట్టుబడి తమ చేతులు మాత్రమే అంతేగాక, ఆధునిక యాంత్రికాభివృద్ధి వల్ల, ఉత్పాదక యంత్రాలపై అధిపత్యం కల్గిన వారికి, శ్రమించి పనిచేసే కార్మికులకు, మధ్య అగాధం పెరిగింది. ఆధునిక యాంత్రికాభివృద్ధి కారణంగా, ఉత్పత్తికొరకు ఉత్పాదక యంత్రాలపై పెట్టవలసిన పెట్టుబడి పెరిగింది. బండ్లు తయారుచేసి, వాటికి కావలసిన ఎడ్లు కొనడానికి అవసరమైన డబ్బు కంటే, మోటార్లు, ఇంజన్లు తయారు చేయడానికి, ఎక్కువ ధనం పెట్టుబడి అవసరమైంది. ఒకపరిశ్రమాభివృద్ధికుపయోగించే పెట్టుబడి పెరగడంతోపాటు, ఆపెట్టుబడి దారుని అధికారం కూడా, ద్విగుణీకృతమైంది. దానితో, అతని సంపద పెరగడమే కాక, విస్తృతమైన అధికారంకూడ, సంక్రమించింది. అమెరికాలోని హెచ్చుసంపదంతా కొద్ది కుటుంబాల చేతుల్లో ఉండటం, అలానే భారతదేశంలో కూడ కొన్ని కుటుంబాల వారే దేశ ఆర్థిక వ్యవస్థపై పెత్తనం చలాయించడం, అందరికి తెలిసిన సంగతే. ఈ వ్యవస్థతో, విహితమైన పెట్టుబడి లాభం సూత్రాల కారణంగా, కొద్దిమంది అశేష భోగభాగ్యాల్ని అనుభవిస్తుండటం, కోటాను కోట్లమంది ఒక్క పూటకు కూడా చాలినంత తిండిలేక, అర్థాకలితో పస్తులుండటం, జరుగుతుంది. కనుక 'సర్వేజనా: సుఖినో భవన్తు' అనే సూక్తి, ఈ వ్యవస్థలో ఆచరణ యోగ్యంగా కన్పించడం లేదు.

అందరికీ తిండి, బట్ట, ఇళ్లు ఒక్క సామ్యవాద వ్యవస్థలో మాత్రమే సాధ్యమౌతుందని కమ్యూనిస్టు దేశాలంటున్నాయి. మొదట్లో, జారు చక్రవర్తిని కూలదోశాక, లెనిన్ నాయకత్వంలో రష్యా అనేక రంగాలలో గణనీయమైన ప్రగతిని సాధించింది.

సోషలిస్టు వ్యవస్థ

సామ్యవాద వ్యవస్థకు, రూపకల్పనచేసిన వ్యక్తి కార్ల్ మార్క్స్. 'సామ్యవాద సిద్ధాంతం' గతి, తార్కిక, చారిత్రిక, 'భౌతిక వాదం' అనే పేరుతో, ప్రత్యేక అస్తిత్వాన్ని ఏర్పరచుకొంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో, విహితమైన, అంతస్సంఘర్షణ కారణంగా అది సామ్యవాద వ్యవస్థలోనికి పరివర్తనం చెందటం, తప్పనిసరి అని మార్క్స్ అంటాడు. అందుకు కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం చేపట్టి, విప్లవమార్గంద్వారా, పెట్టుబడిదారీ వ్యవస్థను కూలద్రోసి, దాని స్థానంలో, శ్రామికవర్గం నియంతృత్వాన్ని స్థాపించాలి. అంతేగాక పెట్టుబడిదారీ అవశేషాలున్నంతకాలం, కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం వహించి, పని చెయ్యాలి అని మార్క్సిస్టు కమ్యూనిజం చెబుతుంది. ప్రతివ్యక్తీ, తన శక్తిసామర్థ్యాల ననుసరించి పనిచేస్తూ తన అవసరాలకు కావలసినంత ఆదాయాన్ని పొందే స్థితి కలిగినప్పుడు ప్రభుత్వం అవసరమేలేకుండా పోతుందని లెనిన్ అంటాడు. అంటే సామ్యవాద వ్యవస్థలో, ఏవ్యక్తీ పీడింపబడటం గానీ దోచుకోబడడంగానీ, ఉండదనీ అందరూ తమ శక్త్యానుసారం పనిచేస్తూ అవసరాలకు, తగ్గట్లు ఆదాయాన్ని పొందేటట్లు చేయడం జరుగుతుందని, చెప్పబడుతూంది. వాస్తవానికి సర్వమానవాళి సుఖశాంతులతో విలసిల్లే ఏ వ్యవస్థ అయినా వాంఛనీయమే.

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రథమ పర్యాయం సోవియట్ రష్యాను సందర్శించినప్పుడు, ఆ దేశంలో నెలకొన్న నూతన వ్యవస్థ కారణంగా జరిగిన అభివృద్ధినిచూచి మిక్కిలి ప్రభావితులయ్యారు. ఆ వ్యవస్థను ప్రశంసిస్తూ అనేక వ్యాసాలు కూడా వ్రాశారు. తర్వాతకాలంలో, భారత ప్రధానిగా ఆయన రష్యా, చైనా తదితర కమ్యూనిస్టు దేశాలలో పర్యటించి, ఆ వ్యవస్థను సన్నిహితంగా పరిశీలించారు కూడా. అందువల్లనే, శ్రీ నెహ్రూ సామ్యవాద వ్యవస్థను, హర్షిస్తూనే, అందులోని హింస అవాంఛనీయమైనదని అన్నారు. లక్ష్యం, మంచిదైనప్పుడు, మార్గం విషయంలో పట్టింపు కూడదు, అని కమ్యూనిజం భావన అయితే, గాంధీజీ నాయకత్వంలో, సత్యం, అహింసలే ప్రధాన సాధనాలుగా అనేక సత్యాగ్రహాలు నడిపిన నెహ్రూ 'మురికిని పోగొట్టాలంటే మురికి నీరు పనికిరాదు' అని అన్నారు. పెట్టుబడి దారీ వ్యవస్థలోని హింస వర్జనీయమైనట్లే, సామ్యవాదంలోని హింసకూడ వదలి వేయవలసిందే. కారణమేమంటే హింస ద్వేషాన్ని అశాంతినీ వృద్ధి చేస్తుంది. ద్వేషం, అశాంతులు ఒక అగ్ని పర్వతం లాంటివి. బద్ధలైన అగ్ని పర్వతం నుండి, ప్రసరించే లావా, సర్వనాశనాన్ని కల్గిస్తుందే కాని, సుభిక్షాన్ని, సుఖ శాంతులను కల్గించదు.

అందువల్ల ఇట్టి స్థితిలో, మనకు ఎట్టి ఆర్థిక వ్యవస్థ కావాలి అనే ప్రశ్న సహజంగానే ఉదయిస్తుంది. మన ప్రభుత్వం,

'సోషలిస్టు సాంఘిక వ్యవస్థ' స్థాపనే తనలక్ష్యం అని ప్రకటించింది. అయితే ముందుగా సోషలిస్టు వ్యవస్థ అంటే ఏమిటో గ్రహించి, తదుపరి సోషలిస్టు తరహాసామాజిక వ్యవస్థ స్వరూప స్వభావాల్ని గురించి పరిశీలించడం సమంజసంగా ఉంటుంది.

సోషలిస్టు లక్ష్యాలు

సోషలిజం అనేది అనేక విధాలుగా నిర్వచించబడింది. అయితే అందరూ స్థూలంగా అంగీకరించిన కొన్ని లక్షణాలివి. ఉత్పాదక, సాధనాలపై, ప్రభుత్వ యాజమాన్యం, ఉండాలి, భూములు, గనులు, ఫ్యాక్టరీలు మొదలైన ఉత్పాదక సాధనాలు, ణికి ఉపకరించే రైల్వేలు, బ్యాంకులు మొదలైనవి కూడా ప్రభుత్వ యాజమాన్యంలోనే ఉండాలి. అంతేగాక వ్యక్తులెవ్వరూ ఈ సంస్థల్ని, స్వలాభానికి వినియోగించు కోకుండా చూడాలి, అంటే ప్రతి వ్యక్తికీ, జీవితోపార్జనకు తగిన ఏర్పాటు ప్రభుత్వం చేయాలి, స్వలాభం కొరకు, కార్మికుల్ని దోచుకునే అవకాశం, ఏ రూపంలోనూ ఉండరాదు. ఉత్పాదన, సక్రమంగా పంపిణీ చేయ బడాలి, వ్యక్తిగత ఆస్తి వ్యవస్థను, అంతం చేయడం ద్వారా సమాజంలో, తరతరాలుగా నెలకొనియున్న, ధనిక-పేద వ్యత్యాసాలు శాశ్వతంగా మటుమాయం కావాలి. దీనివల్ల, ఆర్థిక అసమానతలు కారణంగా జనించే ఈర్ష్య అసూయలు, దొంగతనాలు, మోసాలు, లంచగొండితనం వగైరాలకు ఆస్కారముండదు. ఇక్కడే. ఒక విషయం గమనించవలసి ఉంది. ఈ నాడు పూర్తి సామ్యవాద వ్యవస్థ, ఏ దేశంలోనూ స్థాపించబడలేదు. కమ్యూనిస్టు రాజ్యాలుగా ప్రసిద్ధిచెందిన దేశాలలో కూడ, ఈ నాడు అమలులోయున్నది సోషలిస్టు వ్యవస్థ మాత్రమే. పూర్తి సామ్యవాద వ్యవస్థ స్థాపించ బడి నప్పుడు, ప్రభుత్వ అవసరమే యుండదు. కనుక అప్పుడు ఆస్తి అంతటి మీదా, ప్రజలందరకూ సమానమైన అధికారం ఉంటుంది, పరి పాలించేవారు, పరి పాలింపబడేవారు అంటూ ఉండరు. ప్రజలు, సుశిక్షితులైన సైనికుల వలె, తమ విధుల్ని, బాధ్యతల్ని, తమకు తాముగా సక్రమంగా నెరవేరుస్తుంటారు. అయితే ఈ వ్యవస్థ, ఈ నాటికి ఒక ఆశయం మాత్రమేనని గ్రహించాలి. అంతవరకు, ప్రభుత్వ ఉనికి, తప్పనిసరి. కనుక, పూర్తి సామ్య వాద వ్యవస్థ, స్థాపింపబడటానికి, పూర్వరూపం సోషలిస్టు వ్యవస్థ యని గ్రహించవలసియుంటుంది. పోతే, ఈ సోషలిస్టు వ్యవస్థ స్వభావాన్ని గురించి ఇలా పేర్కొనబడింది. ఒక సమాజంలోని, సాంఘిక ఆర్థిక, రాజకీయ మేధాశక్తులు, ఆ సంఘంలోని ఉత్పాదక, అవకాశాలు ద్వారా ప్రభావితమౌతూంటాయి. కనుక వాటిలోని, మార్పు, లేక, అభివృద్ధి, పూర్తి సమాజాన్నే, మార్చి వేస్తుంది. అంటే, సాంఘిక జీవితం వ్యక్తుల ఇష్టానిష్టాల్ని బట్టి కాక, ఉత్పాదక శక్తుల ప్రభావంతో, నడుస్తుందని, సిద్ధాంతీకరించడం జరిగింది. అంటే మతాలు వ్యక్తిని ఏదేవునికో, లేక అవ్యక్తశక్తికో బానిస చేస్తే, యీసిద్ధాంతం వ్యక్తిని భౌతిక శక్తులకు, బానిసగా చేసింది. కనుక మొదటి దానిలో, వ్యక్తికి స్వేచ్ఛ లేనట్లే. దీనిలోనూ వ్యక్తికి స్వేచ్ఛ లేదు. కాని, వాస్త విక జీవితంలో, స్వేచ్ఛా భావం, ప్రతివ్యక్తికీ స్వతస్సిద్ధంగా ఉంటుంది. ఈశ్వరుడు, కర్మ అనేవి, వ్యక్తి స్వేచ్ఛను సిద్ధాంత రీత్యా నిరాకరిస్తే, ఈ భౌతిక శక్తులు, వ్యక్తి స్వేచ్ఛను మరొ రూపంలో, త్రోసివేశాయి. అందువల్ల, ఈ వ్యవస్థలకు భిన్న మై ప్రత్యామ్నాయ మార్గాన్ని, అన్వేషించడం జరిగింది.

అన్ని రకాలైన ప్రభుత్వ వ్యవస్థలలోనూ, ప్రజాస్వామ్యం ఉత్తమ మైందని, సర్వత్రా అంగీకరించడం జరిగింది, కారణమే మంటే, వ్యక్తిగాని, లేక సంఘపు సమస్యగాని, కేవలం తిండి, బట్టలు గృహ వసతి లభించడం తోనే తీరిపోదు. భావప్రకటనకు, అవ కాశం కూడ అవసరం. అప్పుడే, వ్యక్తి యొక్క సర్వతోముఖ వికాసం, పూర్తి అవుతుంది. అందుకనే, ఫ్రాన్సిస్ విలియమ్స్ సోషలిజాన్ని గురించి ఒక చోట ఇలా అన్నారు. ''సోషలిజం అనేది తక్కిన అన్ని రాజకీయ వ్యవస్థలవలనే, ఒక సాధనం మాత్రమే. వ్యక్తియొక్క వ్యక్తిత్వాన్ని విలువను గుర్తించే, ప్రజాస్వామ్య వ్యవస్థలోనే, దాని లక్ష్యం. సిద్ధిస్తుంది.''

నెహ్రూజీ అభిప్రాయం

కనుక మనం, ఇప్పుడు సోషలిస్టు తరహా సాంఘిక వ్యవస్థని గురించి తెలిసికోవలసిన అవసరం ఉంది. సోషలిస్టు తరహా సాంఘిక వ్యవస్థా స్వరూపాన్ని గురించి నెహ్రూ ఒక పర్యాయం ఇలా అన్నారు.

''గారడీవాడు, మామిడి చెట్టును, పళ్లను, క్షణంలో పెంచి, చూపించినట్లుగా, అకస్మాత్తుగా ఏ సోషలిజాన్నో లేక ఏ కేపిట లిజాన్నో, స్వీకరించినంత మాత్రాన, పేదరికం క్షణంలో నిర్మూలింపబడదు. కఠిన పరిశ్రమ ద్వారా, జాతీయ సంపదను పెంచి, సక్రమంగా పంపిణీ జరిగేటట్లు, చూడడం ద్వారానే, దేశం బాగుపడుతుంది. ఇది ఒక్క క్షణంలో జరిగేది కాదు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో పెట్టుబడిదారీ వ్యవస్థ, ఎట్టి మార్గాంతరాన్నీ, సూచించదు. నిర్దిష్టమైన విధానాల్ని, రూపొందించుకొని, సోషలిస్టు విధానంలో ముందుకు సాగినప్పుడే, నిలకడ కల్గిన అభివృద్ధిని సాధించగలం. ఈ విధానం ముందుకు సాగిన కొద్దీ మన జీవితం, ఆలోచన, రెండూ మార్పుచెందుతాయి మనం సక్రమమైన ప్రణాళికల ద్వారానే, దేశాభివృద్ధిని సాధించగలం. ప్రస్తుత స్థితిలో భారతదేశంలో, ప్రయివేటు వ్యాపారాన్ని, అనేక రంగాల్లో ప్రోత్సహించాలి. అయితే, ఈ వ్యాపారం, మన జాతీయ ప్రణాళికల్లో, సరిగా ఇమిడేటట్లు చూడాలి. చాలా వాటివలెనే, మార్క్సిస్టు ఆర్థిక శాస్త్రానికి కూడ కాలదోషం పట్టింది. కనుక, మనం ఇతర దేశాల అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని, ఏది లాభమో, కాదో, స్వయంగా ఆలోచించుకోవాలి. మన దేశ పరిస్థితులకు అనుగుణమైన విధానాన్ని, మనం రూపొందించుకోవాలి. సోషలిస్టు తరహా సాంఘిక వ్యవస్థను గురించి స్థూలంగా నెహ్రూ అభిప్రాయాలివి.

ప్రణాళికా రంగంలో......

1955 లో ఆవడిలో జరిగిన అఖిలభారత కాంగ్రెసు సమావేశం "మన ప్రణాళికలు సోషలిస్టు తరహా సాంఘిక వ్యవస్థకు అనువుగా ఉండాలని" తీర్మానించింది. మన పంచవర్ష

(తరువాత 20వ పేజీలో)

నవ్యపథంలో నడుస్తూన్న

నల్లూరు పంచాయతీ

శ్రీమతి జయలక్ష్మి

ముదురు ఆకుపచ్చరంగు నేలకు వేసినట్లు ఎటు చూసినా సమతలంగా పెరిగిన వరి పొలాలతో నవ్యశోభతో విలసిల్లుతున్న నల్లూరు ఉత్తమంగా పనిచేసినందుకు రాష్ట్ర స్థాయిలో 1973-74 సంవత్సరంలో ఉత్తమ పంచాయతీగా ఎన్నికయి ప్రథమ బహుమతిని అందుకొన్న ఆదర్శ గ్రామపంచాయతీ. ఈ నల్లూరు తూర్పు గోదావరి జిల్లాయందు మహిళ నాయకత్వం వహించిన ఏకైక సమితి అయిన కపిలేశ్వరపురం సమితియందు 2605 మంది నివసించే ఒక చిన్న గ్రామం. కపిలేశ్వరపురం-మండపేట రహదారిపై మండపేటకు 10 కిలోమీటర్ల దూరంలోనూ, సమితి కేంద్రమైన కపిలేశ్వరపురానికి ఆరు కిలోమీటర్ల దూరంలోనూ ఉంది. ఉత్తమ పంచాయతీగా ఎన్నిక అయిన అనంతరం ఆ గ్రామానికి బయలుదేరి మండపేట వెళ్ళి కపిలేశ్వరపురం బస్సు ఎక్కి వెదురుమూడి వంతెన దగ్గర బస్సుదిగి కాలువ గట్టుమీద నడిచి వెడుతుంటే అందం ఉట్టిపడే ప్రకృతి హృదయోల్లాసం కలగజేసింది. గాలి కదలికకు వయ్యారంగా ఊగుతున్న వరిచేలు, బోదినుంచి పల్లానికిపోయే నీళ్ళ గలగలల శ్రావ్య సంగీతం విచిత్రానుభూతిని కలిగించాయి. సుందర ప్రకృతి మధ్య ఉన్న ఈ నల్లూరు పంచాయతీ సమాజ వికాసం కోసం సముత్సాహంతో పనిజేసిందనటానికి, ప్రజా సహకారం పూర్తిగా ఈ పంచాయతీకి లభించిందనటానికి ఈ పంచాయతీ అమలుపరచిన అభివృద్ధి కార్యక్రమాలే ప్రత్యక్ష నిదర్శనాలు.

నలూరు గ్రామం సందర్శించినప్పుడు ఆ గ్రామంలో ఉన్న సమితి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీ గొడవర్తి పట్టాభిరామయ్య గారిని కలిసినపుడు వారు విద్య విషయంలో నల్లూరు ప్రగతిని వివరిస్తూ ఇలా అన్నారు. "1894వ సంవత్సరంలో ప్రారంభించబడిన ప్రాథమిక పాఠశాల 1971 సంవత్సరంలో ప్రాథమికోన్నత పాఠశాలగా మార్చబడింది. 11 మంది అధ్యాపకులతో 304 గురు బాలబాలికలతో కలకలలాడుతున్న ఈ పాఠశాల నుంచి 1974 సంవత్సరంలో ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలకు హాజరయిన 13 మంది ఏడవతరగతి విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణులయ్యారు. 20 వేల రూపాయల ఖర్చుతో అందమైన శాశ్వత భవనం నిర్మించబడింది. ఇంకా ఇంకొక భవనం 12 వేల ఖర్చుతో నిర్మించే ప్రతిపాదన ఉంది. సర్పంచ్ శ్రీ జానకిరామయ్యగారు ఒక రేడియోను పాఠశాలకు బహూకరిస్తే, ప్రజలు రెండువేల రూపాయలు విలువ గల పాఠశాల సామగ్రి నిచ్చారు. 1974 సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ప్రజలు, పంచాయతీ, అధ్యాపకులను సన్మానించారు.

పంచాయతీ కల్పించిన పౌర సౌకర్యాలు

1932 సంవత్సరం మార్చి 22 వ తేదీన ఏర్పాటు చేయబడిన నల్లూరు గ్రామ పంచాయతీ సమకూర్చిన ప్రజాసౌకర్యాలను గురించి మాట్లాడుతూ పంచాయతీల విస్తరణాధికారి శ్రీ డి. రాములు గారు యిలా తెలియ జేశారు "1964 లో సర్పంచ్‌గా ఎన్నిక అయిన శ్రీ వేగుళ్ళ జానకి రామయ్యగారు 1965-66 సంవత్సరం నాటికి 40 వేల రూపాయలు ఖర్చుచేసి పరిరక్షిత మంచినీటి పథకాన్ని అమలు పరిస్తే కపిలేశ్వరపురం సమితి 30,000 రూపాయలు విరాళం అందజేసింది. పంచాయతీ 29 కుళాయిలను వీధులలో ఏర్పాటుచేస్తే ప్రజలు 37 కుళాయిలు వేసుకున్నారు. పంచాయతీ పరంగా రెండు గొట్టపుబావులు, 2 సాధారణ బావులు ఉన్నాయి.

నల్లూరు గ్రామ పంచాయతీ నిర్వహిస్తున్న 6 5 కిలోమీటర్ల రహదారులలో 4 కిలో మీటర్ల కంకర రహదారులు వున్నాయి. వాటి నిర్వహణకు 40 వేల రూపాయలు ఖర్చు చేసింది. గ్రామ పంచాయతీ. రెండు కిలోమీటర్ల సిమ్మెంటు మురుగు కాలువల నిర్వహణకు 16,402 రూపాయలు, మరుగుదొడ్లు నిర్మించడానికి 6000 రూపాయలు ఖర్చుచేసింది. ఈనాడు వీధులలో 20 ట్యూబ్ లైట్లు, 20 సాధారణ విద్యుద్దీపాలు 20 కిరసనాయిలు దీపాలు వెలుగుతున్నాయి. ప్రజల విజ్ఞానం కోసం ఒక గ్రంథాలయాన్ని కూడా 533 పుస్తకాలతో నిర్వహిస్తున్నది.

ఆదాయపు వనరుల పెంపుదల

నల్లూరు గ్రామ పంచాయతీ ఆదాయ వనరుల పెంపుదలకు తీసుకున్న కార్యక్రమాలను గురించి పంచాయతీల విస్తరణాధికారి శ్రీ రాములుగారిలా అన్నారు. 1963-64 సంవత్సరంలో సాధారణ ఆదాయం రూ 2,125-25 పైసలు అయితే 1973-74 సంవత్సరానికి రూ 31,709-33 పైసలకు పెరిగింది. రెండుసార్లు పన్నులను హెచ్చించేలా సర్పంచ్ శ్రీ జానకిరామయ్యగారు కృషి చేశారు. 1963-64 సంవత్సరంలో పన్నుల ద్వారా రూ 2174.18 పైసలు అయితే 1972-73 సంవత్సరానికి రూ 5861.41 పైసలు ఆదాయం వచ్చింది. పన్నుల హెచ్చింపు వల్ల ఆదాయం 268 శాతం పెరిగింది. పచ్చగడ్డి వేలం పాటల వల్ల ఈ గ్రామ పంచాయతీకి 1973-74 సంవత్సరంలో 3861 రూపాయలు, చేపల పాటలవల్ల 1808 రూపాయలుమార్కెట్టు నిర్వహణ వల్ల 828 రూపాయలు ఆదాయం లభించింది.

నవ్య పథంలో శరవేగంగా పయనిస్తున్న నల్లూరు పంచాయతీ ప్రత్యేక కృషి వివరించండి అని అడిగినపుడు కపిలేశ్వరపురం బి. డి. ఓ. డాక్టర్ చెలికాని వెంకట్రావు గారిలాఅన్నారు. "పంచాయతీ కృషి, సర్పంచ్ శ్రీ జానకి రామయ్యగారి కృషి వల్ల అర్హులైన దంపతులు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించుకున్నారు. కుటుంబ వ్యయాన్ని పరిమితం చేసుకొనే విషయంలో పంచాయతీ ప్రోత్సహించిన కారణంగా 525 కుటుంబాలు పొదుపు ఖాతాలను ప్రారంభించుకొన్నారు. 1971 సంవత్సరంలో పంచాయతీ సర్వే చేయించి 186 ఆక్రమణలపై పన్నులు విధించింది. దీనివల్ల సాలీనా పంచాయతీకి రెండువేల రూపాయల ఆదాయం లభిస్తున్నది."

ప్రజా విరాళాలు

పాఠశాల భవన నిర్మాణానికి ప్రజలు పదివేల రూపాయలు, కోరంగి కాలువపై వంతెన నిర్మాణానికి మొదట్లో 10,000 రూపాయలు విరాళం ఇచ్చారు. ఇంకా అదనంగా అయ్యే 50,000 రూపాయల ఖర్చును ప్రజలు భరిస్తున్నారు. హరిజనవాడలో నిర్మించిన నాలుగువేల రూపాయల రహదారికి 666 రూపాయలు విరాళం ఇచ్చారని బి. డి. ఓ శ్రీ వెంకట్రావుగారన్నారు.

ఈ గ్రామంలో చేనేత పారిశ్రామికులకు ఒక సహకార సంఘం, రైతులకు ఒక పరపతి సహకార సంఘం ఉన్నాయి.

293 మంది హరిజనులు ఉన్న ఈ గ్రామంలో హరిజనవాడలో వీధులను ఏర్పాటు చేయటంతోపాటు హరిజనులకు ప్రత్యేకంగా ఒక మరుగుదొడ్డి నిర్మించింది. ఒక మంచినీటి బావిని కూడా హరిజనులకు ప్రత్యేకంగా త్రవ్వించింది. మూడు ట్యూబ్ లైట్లు, రెండు కిరసనాయిలు దీపాలను పంచాయతీ నిర్వస్తున్నది యీ హరిజనవాడలో.

1576 ఎకరాల 57 సెంట్ల విస్తీర్ణం కలిగిన ఈ గ్రామంలో 1973–74 సంవత్సరం సారవా పంటకాలంలో 40 శాతం, దాళవా పంటకాలంలో నాటిన విస్తీర్ణంలో 95 శాతం మేలురకం వరి వంగడాలు వేసి రైతులు అధిక దిగుబడిని సాధించారని వ్యవసాయ విస్తరణాధికారి శ్రీ పోలవరపు కృష్ణమూర్తిగారన్నారు.

దశాబ్దం నుంచి సర్పంచ్‌గా పనిజేస్తున్న శ్రీ వేగుళ్ళ జానకి రామయ్యగారు నీతి నిజాయితీ ఉన్న పంచాయతీ కార్యకర్తే కాదు, కార్యక్రమాలను అమలుపరచడంలో పెట్టుబడులకు కూడా వెనుదీయని సాహసి. చైతన్య స్వరూపులైన శ్రీ జానకి రామయ్యగారు ప్రజాభిమానానికి పాత్రులై పంచాయతీ రాజ్య కార్యకర్తలకు మార్గదర్శకులయ్యారు. *

మనదేశము-సోషలిస్టు వ్యవస్థ

(18 వ పేజీ నుండి)

ప్రణాళికల్లో, ప్రభుత్వం ఈ లక్ష్యాన్ని చొప్పించింది. అంతేగాక 'సోషలిస్టు తరహా సాంఘిక వ్యవస్థ' అనడం ద్వారా భారతదేశం ఏ రకమైన శ్రేయోరాజ్యాన్ని వాంఛిస్తున్నదో కూడ స్పష్టీకరించింది. స్థూలంగా ఇలా పేర్కొంది. 'పరిమితమైన మోతాదులో, మార్క్సిజం, గణనీయమైన విధంగా గాంధీజం కలిపి, అహింసాయుతమైన విధానాలద్వారా, శాంతియుతమైన పరివర్తన, సాంఘిక, ఆర్థిక రంగంలో, సమానత్వ ప్రాతిపదికగా మార్పులు, రాజకీయంగా ప్రజాస్వామ్యం–సోషలిస్టు తరహా సామాజిక వ్యవస్థా లక్షణాలని భావించవచ్చు.


ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో ఈ వ్యవస్థ లక్షణం ఇలా పేర్కొనబడింది. దేశీయుల జీవన స్థాయిని పెంచడం, అందరికీ విస్తృతమైన అవకాశాలు లభించేటట్లు చూడడం, అవకాశాలు లేక, అణగారియున్న వర్గాలవారిలో, వ్యాపారాభివృద్ధికి అవకాశాలు కల్పించడం, సంఘంలోని సభ్యులందరిలోనూ, ఈ ప్రణాళికలో తామందరూ భాగస్వాములనే భావాన్ని కల్గించడం ఈ ప్రణాళిక లక్ష్యం అయియుంది.

తృతీయ ప్రణాళికలో 'సోషలిజం వైపుకు పయనం' అనే పేరులో ఇలా పేర్కొనబడింది. ప్రభుత్వాధిపత్యం గల సంస్థలు, సహకార సంస్థలు, విస్తారంగా ఏర్పరచాలి. సమానావకాశాలు కల్పించాలి. ప్రాథమిక అవసరాలు తీరేలా చూడాలి. జీవన స్థాయిలలో వ్యత్యాసాలుండరాదు. ఆదాయాలలో తేడా హస్తిమశకాంతరంగా ఉండకూడదు. ఆర్థికాధికారం ఏ కొద్దిమంది చేతుల్లోనో, కేంద్రీకృతం కాకుండా చూడాలి. సమాన గౌరవాలు, అవకాశాల ప్రాతిపదికపై సాంఘిక వ్యవస్థా నిర్మాణం జరగాలి.

మన ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ ఆగస్టు 1969 లో పార్లమెంటులో ప్రసంగిస్తూ 'సోషలిస్టు తరహా సాంఘిక వ్యవస్థని' గురించి ఇలా అన్నారు.

'సోషలిస్టు తరహా సామాజిక వ్యవస్థ అతికీలకమైన ఆర్థిక వనరులు ప్రభుత్వాధిపత్యంలోనే వుండాలనే బాధ్యత వేసింది. ఆర్థిక క్లిష్టతలవల్ల, మన ప్రజాస్వామిక రాజకీయ వ్యవస్థ చితికిపోకుండా అవసరమైన జాగ్రత్తలు తీసికోవాలని కూడ మనలను హెచ్చరిస్తూంది.'

పై అభిప్రాయాలన్నింటినీ జాగ్రత్తగా పరిశీలించిన మీదట, దేశానికి సోషలిస్టు సాంఘిక వ్యవస్థ తగినట్టిదని స్పష్టమౌతుంది. ఆ లక్ష్యసాధనకు, దేశ ప్రజలందరూ కలిసికట్టుగా కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. *



మన శాసనసభ పనిచేసే తీరు

శ్రీ వి. సుబ్బరామశర్మ

[గత సంచిక తరువాయి]

శాసన సభలకు శాసన పరిషత్తులకంటే ఎక్కువ అధికారాలున్నాయి. ద్రవ్యపు బిల్లుల బడ్జెటు ఆమోదంవంటి కొన్ని విషయాలు తప్పించి ఉభయ శాసన సభల కార్యక్రమ విధానం చాలా వరకు ఒకే తీర్శుగా ఉంటుంది. మన శాసన సభ సమావేశంలో సాధారణంగా జరిగే కార్యక్రమంలో వుండే ముఖ్యాంశాలు ఏ తీరుగా వుంటయ్యో చూదాం.

గవర్నరు ప్రసంగం

సాధారణ ఎన్నికల తరువాత శాసన సభ మొట్టమొదటి సమావేశారంభంలోను, ప్రతి సంవత్సరం మొదటి సమావేశం ఆరంభమయ్యేటప్పుడు గవర్నరు ఉభయ శాసన సభల సంయుక్త సమావేశంలో ప్రసంగిస్తారు. తన ప్రసంగంలో ఆయన సభలను సమావేశపరచటానికి గల కారణాలను, అంతవరకు పరిపాలనలో సాధించినవి, ఇకముందు నిర్వహించదలచిన కార్యక్రమాలు క్లుప్తంగా విశదీకరిస్తారు. గవర్నరు ప్రసంగం చేసిన రోజున తదితర కార్యక్రమం ఏదీ వుండదు. ఆ ప్రసంగం ప్రతిని ఉభయ సభల మేజాబల్లపైన ఉంచటం జరుగుతుంది. సభ్యులందరకూ ప్రసంగం ప్రతులు అందజేయబడుతవి. ఆ తరువాత గవర్నరు ప్రసంగానికి కృతజ్ఞతలు తెలుపాలని ఉభయ సభల్లోను ఆయా సభ్యుల్లో ఒకరు ప్రతిపాదన చేస్తారు; మరొక సభ్యుడు బలపరుస్తారు. అప్పుడు గవర్నరు ప్రసంగంలోని వివిధాంశాలపైన చర్చలు జరుగుతాయి. దానికి ముఖ్యమంత్రి గాని తదితర మంత్రులు గాని ఉభయ సభల్లో సమాధానాలిస్తారు. గవర్నరు చేసిన ప్రసంగానికి కృతజ్ఞతలు ఆయనకు అందజేయటం, తిరిగి ఆయన ఉభయ సభలకు తన కృతజ్ఞతలతో సమాధానం ఇయ్యటం జరుగుతుంది. ఆ ప్రత్యుత్తరాన్ని ఉభయ సభల అధ్యక్షులు సభలకు చదివి వినిపిస్తారు.

ప్రశ్నోత్తరాలు

సభ సమావేశమయ్యే ప్రతిరోజు సాధారణంగా సభ్యుల ప్రశ్నలు వాటికి మంత్రుల సమాధానాలతో మొదలవుతుంది. అది ఒక గంట కాలం జరుగుతుంది. కనుక దానిని ప్రశ్నల గంట అంటారు. అయితే గవర్నరు ప్రసంగమున్న రోజున ఇది వుండదు, మరే కార్యక్రమం కూడా వుండదు. కొన్ని సంతాప తీర్మానాలు గాని, కొత్తగా ఎన్నికైన సభ్యుల పదవీ స్వీకారంగాని వున్నప్పుడు ఆ కార్యక్రమం ముందు నిర్వహించి వెంటనే ప్రశ్నోత్తరాల అంశం తీసుకొనటం జరుగుతుంది.

సభా సమక్షంలో అడిగే ప్రశ్నలు నక్షత్రపు గుర్తుతో వుంటవి. వ్రాత పూర్వకంగా సమాధానాలకోసం అడిగే ప్రశ్నలకు ఆ గుర్తు వుండదు. ఇవికాక సమావేశాలు జరిగే కాలంలో అత్యవసరమైన విషయాల గురించి సభ్యులు అయిదు రోజుల కంటే తక్కువ నోటీసుతో సమాధానాల కొరకు అడిగే ప్రశ్నలుంటవి. వీటిని స్వల్పవ్యవధి ప్రశ్నలంటారు. సభ్యులు తమ నియోజక వర్గానికి రాష్ట్రానికి సంబంధించిన అనేక సమస్యలపైన ఫలానా శాఖామంత్రి సమాధానాలు కావాలని ప్రశ్నలకు నోటీసులిస్తారు. ఈ ప్రశ్నల ముఖ్యోద్దేశం వివిధ పరిపాలనా శాఖలు ప్రజలకోసం ఏవిధంగా పనిచేస్తున్నయ్యో తెలుసుకొనటమే. వాద ప్రతివాదాలు, ఊహలు, వ్యంగ్యోక్తులు, ఆరోపణలు, సాభిప్రాయశబ్దాలు, అపఖ్యాతి హేతువులయ్యే వాక్యాలు ప్రశ్నల్లో వుండరాదు. అతిదీర్ఘమైనవిగాను అపరిష్కృతంగా న్యాయస్థానాల ముందర వున్న విషయాలను గురించినవిగాను వున్న సమాచారాలకోసం వేసే ప్రశ్నలకు సాధారణంగా స్పీకరు అంగీకారం లభించదు.

ఆ విధంగా ప్రశ్నోత్తరాల సమయం సమాచార సేకరణకే కాక పరిపాలనలోని లోపాలను ప్రశ్నలద్వారా మంత్రుల దృష్టికి తీసుకురావటానికి సభ్యులకు మంచి అవకాశం కల్గిస్తుంది. సమావేశం ప్రతిరోజూ మంత్రులు పరిపాలనకు సంబంధించిన అనేక విషయాలపైన భోగట్టా ఈయవలసి వుండటంచేత తాము, తమ క్రింద పనిచేసే ఉద్యోగబృందం తమతమ విధుల నిర్వహణలలో జాగరూకతతో ప్రవర్తించవలసివుంటుంది. ఈ విధంగా మంత్రుల పరిపాలనపైన పర్యవేక్షణ జరిపేందుకు శాసన సభ్యులు ఉపయోగించే

సాధనాలలో అగ్రస్థానం ఈ ప్రశ్నల ప్రకరణానికి దక్కుతుంది. వాగ్వాదాలు, హాస్యోక్తులు, వ్యంగ్యోక్తులతో పరిపుష్టమయ్యే ప్రశ్నోత్తరాల గంట మంత్రులకు పరీక్షా సమయంగా వుంటుంది. సభా కార్యక్రమం మొత్తంమీద ఈ గంటకాలం ఎంతో ఆసక్తిదాయకంగా, ఉత్సాహభరితంగా వుంటుంది.

అర్ధగంట చర్చ

సభా సమక్షాన వేసే ప్రశ్నల్లో దేనికైనా మంత్రి యిచ్చే సమాధానం సంతృప్తికరంగా లేదని, దానిని గురించిన పూర్తి విశదీకరణ అవసరమని ప్రశ్న వేసిన సభ్యుడు కోరినప్పుడు, అటువంటి వివరణ అవసరమని స్పీకరు అంగీకరించినట్లయితే, సమావేశకాలంలో కొద్ది రోజుల లోపల ఆ విషయంపైన చర్చకు ఒక అరగంటను కేటాయించడం జరుగుతుంది. ఈ అరగంట చర్చ, దానికోసం నిర్ణయించిన రోజు అజెండాలోని కార్యక్రమం అన్ని అంశాల చివరి అంశంగా వుంటుంది. అట్లా జరిగే చర్చపైన ఓటింగు వుండదు.

వాయిదా ప్రతిపాదనలు

శాసనసభ సమావేశకాలంలో ప్రతిరోజూ జరగవలసిన కార్యక్రమమంతా ముందుగానే నిర్ణయించటం జరుగుతుంది. దానిలో లేనిదేదీ సాధారణంగా జరగటానికి వీలులేదు. అయితే ఆకస్మికంగా సంభవించినది, ప్రజాప్రాముఖ్యం కలది ఏదైనా సంఘటన విషయమై వెంటనే చర్చ జరపటం అవసరమని శాసనసభ్యుడు భావించినప్పుడు, నిర్ణయించిన కార్యక్రమాన్ని వాయిదావేసి ఆ రోజునే సభలో ఆ విషయంమీద చర్చ జరపవలెనని సభాపతికి సంబంధిత మంత్రికి శాసన మండలి కార్యదర్శికి సమావేశానికి పూర్వమే వ్రాత పూర్వకంగా వాయిదా ప్రతిపాదన నోటీసు యివ్వాలి. సభాపతి వాయిదా ప్రతిపాదన అంగీకార యోగ్యతను నిర్ణయించే ముందు అవసరమని ఆయన భావిస్తే ప్రశ్న గంట తరువాత ఎజండాలో వున్న కార్యక్రమాన్ని ప్రారంభించటానికి ముందు ఆ సభ్యుడు తన ప్రతిపాదను గురించి చెప్పదలచుకున్నది సభాపతి వినవచ్చు. దానిపైన మంత్రి చెప్పే వివరణనుగూడా ఆయన వినవచ్చు. అప్పుడు సభాపతి ఆ ప్రతిపాదనను ఆమోదించేది లేనిది నిర్ణయిస్తారు. ఈ సందర్భంగా విపులమైన నియమ నిబంధనలు ఉభయ సభల కార్యక్రమ నియమావళిలో వున్నాయి.

అయితే ఈ వాయిదా ప్రతిపాదనలు అంగీకరించిన సందర్భాలు లేవనే చెప్పవచ్చు. అందుకు ముఖ్యమైన కారణం అటువంటి ప్రతిపాదనల్లోని విషయాలు సభముందుకు తీసుకురావటానికి ఇతర సాధనాలు, అవకాశాలు వుండటమే. అందుచేతనే కొన్ని వాయిదా ప్రతిపాదనల రూపంలో సభ్యులిచ్చిన నోటీసులను సభాపతులు కాలటెన్షన్ నోటీసులుగా మార్చి సభ్యులు అత్యవసర చర్చనీయాంశంగా భావించిన వాటికి అనాలస్యమైన అవకాశం కల్గించటం జరగుతున్నది.

కాలటెన్షన్ నోటీసులు

ప్రశ్నోత్తరాల తర్వాత తీసుకునే అంశం కాలటెన్షన్ నోటీసులు. శాసన సభ్యుడు ఏదైనా అత్యవసర ప్రజా ప్రాముఖ్యం వున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకు వచ్చేందుకు ఇచ్చే నోటీసునే కాలింగటెన్షన్ నోటీసు అంటారు. నిజానికి ఈ ప్రక్రియ పార్లమెంటరీ వ్యవస్థకు మాతృస్థానమైన బ్రిటిష్ పార్లమెంటులో లేదు. మన దేశంలో పార్లమెంటు ఏర్పడిన తర్వాత సభ్యులు అత్యవసర ప్రజా ప్రాముఖ్యంగల విషయాన్ని దేనినైనా సభలో తీసుకురావాలంటే అది వాయిదా ప్రతిపాదన ద్వారానే తీసుకురావలసి వచ్చేది. వాయిదా ప్రతిపాదనలకు ప్రభుత్వాన్ని అభిశంసించే స్వభావం వున్నదనే భావం కూడా ప్రబలంగా వుండేది. ఈ యిబ్బందిని తొలగించటానికి లోక్‌సభ రూపొందించుకున్న కొత్త ప్రక్రియే ఈ కాలటెన్షన్ నోటీసు.

సభాపతుల ఆమోదం పొందిన ఈరకం నోటీసుల ప్రతులు ఆయావిషయాలకు సంబంధంవున్న మంత్రులకు శాఖలకు పంపబడుతవి. వాటికి తేదీలు నిర్ణయించి అజెండాల్లో ప్రశ్నల తరువాతి అంశంగా నమోదు చేస్తారు. ఇవి ఒకటిగాని అంతకు మించిగాని సభాపతి నిర్ణయించే ప్రాధాన్యతాక్రమం ప్రకారం అజెండాలలో పేర్కొంటారు. ప్రశ్నోత్తరాల సమయం తరువాత సభాపతి కాలటెన్షన్ నోటీసుల అంశం తీసుకున్నప్పుడు అది యిచ్చిన సభ్యుని పిలుస్తారు. ఆ సభ్యుడు తన నోటీసులోని విషయాన్ని క్లుప్తంగా చెప్పి మంత్రి దృష్టికి తీసుకు వస్తారు. దానిపైన మంత్రి ఆవిషయమై ప్రకటన చేస్తారు. ఈ సందర్భంగా ప్రసంగాలు గాని చర్చలుగాని జరగరాదు. సాధారణంగా ఆ విషయానికి మాత్రమే సంబంధంవున్న స్వల్పవివరాలు అడిగి తెలుసుకోవటం మాత్రమే జరుగుతున్నది. కాలటెన్షన్ నోటీసుల పద్ధతి ద్వారా శాసనసభ్యులు తమ నియోజక వర్గాలకు మొత్తం రాష్ట్రానికి సంబంధించిన ప్రజాహిత సమస్యల నెన్నింటినో ప్రభుత్వదృష్టికి తెచ్చి తద్వారా వాటి పరిష్కారం సుకర మయ్యేందుకు తోడ్పడటం సాధ్యమౌతున్నదనటంలో సందేహంలేదు.

శాసన నిర్మాణం

పరిపాలనా విధానం రెండు కార్యక్రమాలతో కూడుకుని వున్నది. ఒకటి పాలించబడే ప్రజలు ఏవిధంగా ప్రవర్తించాలో శాసించే కార్యక్రమం. దీనికి శాసన నిర్మాణం అని పేరు. అట్లా నిర్మితమైన శాసనాలకు బద్ధులై ప్రజలు ప్రవర్తించేట్లు చేయటం రెండవ కార్యక్రమం. దీనిని శాసన నిర్వహణ అంటారు.

శాసన సభల ప్రధాన కార్యక్రమం శాసన నిర్మాణం. ఏ విషయం పైననైనా శాసనం చేసేటప్పుడు దాని పూర్వాపరాలు న్యాయాన్యాయాలు సమగ్రంగా చర్చించి, సమాజం అంతటి సౌభాగ్యం దృష్టిలో వుంచుకుని తొందరపాటు లేకుండా శాసన నిర్మాణం చేయవలసి వున్నది. శాసనాలు చేసేటప్పుడు అనుసరించవలసిన నియమ నిబంధనలు పార్లమెంటులో మాదిరిగానే మన శాసన సభలకు కూడా వున్నాయి.

ఏదైనా బిల్లును అంటే చిత్తు శాసనాన్ని ప్రవేశ పెట్టదలచే సభ్యుడు (మంత్రిగాని ప్రైవేటు సభ్యుడుగాని) తన ఉద్దేశాన్ని

తెలియబరుస్తూ ఏడు రోజుల నోటీసు యివ్వాలి. ఆ నోటీసుతో బిల్లుప్రతి, దాని ఉద్దేశాలను, అవశ్యకతను తెలిపే ఒక సంక్షిప్త వివరణను జతపరచి శాసనసభ కార్యాలయానికి అందజేయాలి. నోటీసు గడువు పూర్తి అయిన తరువాత శాసన సభలో బిల్లును ప్రవేశ పెట్టటానికి సభ అనుమతిని కోరుతూ ఆసభ్యుడు ఒక ప్రతిపాదన చేస్తారు. అప్పుడా ప్రతిపాదన మీద ఎటువంటి చర్చ జరుగకుండా శాసనసభ దానిని ఆమోదించటంగాని, తిరస్కరించటం గాని ఓటు ద్వారా తెలియజేస్తుంది. అట్లా సభాప్రవేశానికి ఆమోదం లభించిన బిల్లు దశలవారీగా చర్చలోకి వస్తుంది, బిల్లు ప్రవేశానికి సభ అంగీకారం లభించక పోతే అది అంతటితో అంతరించి పోతుంది.

ఈ మొదటి దశదాటిన బిల్లు ప్రభుత్వ గెజెటులో దాని ఉద్దేశాలతోబాటు ప్రకటించ బడుతుంది. ఇట్లా చేయటం వలన ఏ ఏ బిల్లులు శాసన సభలో చర్చకు వస్తయ్యో ముందుగా ప్రజలకు తెలుస్తుంది. ఆ బిల్లులో ఉన్న అంశాలవల్ల లాభంగాని నష్టంగాని కలుగుతుందనుకునేవారు వార్తా పత్రికల ద్వారా, సమావేశాలద్వారా తదితరమార్గాలద్వారా తమ అభిప్రాయాలు, విమర్శలు శాసన సభ్యులకు తెలియబరచటానికి, ప్రభుత్వ దృష్టికి తీసుకురావటానికి వీలు కల్గుతుంది.

ప్రజాభిప్రాయ సేకరణ

ఆ విధంగా గెజెటులో ప్రకటించిన తర్వాత సభ్యుల ఉపయోగార్థం చిత్తు శాసనం ప్రతులు శాసనసభా సభ్యులందరికీ అందజేయబడుతాయి. దాని తరువాత ఆ బిల్లుకు సంబంధించిన ప్రతిపాదన అంశం ఒక సమావేశ దినం అజెండాలో చేర్చటం జరుగుతుంది. ఆ ప్రతిపాదనను సభ్యుడుగాని, మంత్రిగాని నాలుగు రకాలుగా చేయవచ్చు. బిల్లును పరిశీలనలోకి తీసుకొనాలనిగాని, సెలెక్టు కమిటీ పరిశీలనకు పంపాలనిగాని, శాసన పరిషత్తు అంగీకారంతో జాయింట్ సెలెక్టు కమిటీ పరిశీలనార్థం పంపాలనిగాని, ప్రజాభిప్రాయ సేకరణకు బిల్లును పంపాలనిగాని ప్రతిపాదన చేయవచ్చు. ఈ నాల్గింటిలో ఏదో ఒక ప్రతిపాదన చేసిన దశలో బిల్లు స్థూల స్వరూపాన్ని చర్చించటం మాత్రమే జరుగుతుంది. ఈ దశలో వివరాలపైన చర్చగాని, ఎట్టి సవరణల ప్రతిపాదనగాని వుండదు.

ఆ ప్రతిపాదనకు సభ ఆమోదం లభించిన తరువాత దశ బిల్లును ప్రవేశపెట్టిన రూపంలోగాని, సెలెక్టు కమిటీ లేక జాయింటు సెలెక్టు కమిటీ నివేదించిన రూపంలోగాని క్లాజువారీ చర్చకు సంబంధించినది. ఈ దశలో సభ్యులు బిల్లుకు సవరణలు ప్రతిపాదించటం, చర్చించటం, ప్రతి సవరణపైన ఓటింగు జరుగుతాయి. ఆ విధంగా బిల్లులోవున్న క్లాజులన్నింటిపైన వోటింగు జరగటంతో ఈ ఘట్టం పూర్తవుతుంది.

ఆ తరువాతది బిల్లు చేయవలసిన ప్రయాణంలో చివరి ఘట్టం. ఈ దశలో బిల్లును సభవారు ఆమోదించవలసిందిగా సభ్యుడు ప్రతిపాదనచేయటం జరుగుతుంది. ఈ ప్రతిపాదనపైన జరిగే చర్చ బిల్లును సమర్పించటానికిగాని, తోసిపుచ్చటానికిగాని చేసే వాదనలకు మాత్రమే పరిమితమై వుండాలి. దానిపైన ఓటింగు జరిగి బిల్లు ఆమోదించబడుతుంది.


అట్లా ఆమోదం పొందిన బిల్లు కాపీ చివర ఫలానా తేదీన ఆ చిత్తు చట్టం శాసనసభచేత ఆమోదించబడింది అని వ్రాసి స్పీకరు సంతకం చేస్తారు. ఆ బిల్లు ద్రవ్యపు బిల్లయితే ఆ విధంగా తాను నిర్ధారించినట్లు కూడా స్పీకరు వ్రాసి సంతకం చేయాలి. సంతకం చేసిన బిల్లు ప్రతిని శాసన పరిషత్తుకు మామూలు బిల్లయితే అంగీకారానికి, ద్రవ్యపు బిల్లయితే ఆ సభ సిఫార్సుల నిమిత్తం పంపాలి.

శాసన నిర్మాణం విషయంలో శాసన పరిషత్తుకంటె శాసన సభకు ఎక్కువ అధికారాలున్నాయి. ఆర్థిక సంబంధమైన ద్రవ్యపు బిల్లులకు శాసన సభలోనే ప్రవేశార్హత వుంది. తక్కిన బిల్లులు ఉభయ సభల్లోనూ ఆరంభం కావచ్చు. శాసన సభ ఆమోదం పొందిన బిల్లులను పరిషత్తు ఆమోదానికి పంపినప్పుడు పరిషత్తు వాటిని ఆమోదించవచ్చు, తిరస్కరించవచ్చు, సవరణలు చేయవచ్చు. శాసన సభ ఆమోదం పొందిన బిల్లులను శాసన పరిషత్తు ఆమోదించని సందర్భాలు మన రాష్ట్రంలో ఇంతవరకూ లేవు. ఒకవేళ అటువంటి పరిస్థితి యేర్పడినా ఆ బిల్లులను శాసన సభ మరొకసారి చర్చించి శాసన పరిషత్తుకు ఇంకో పర్యాయం పంపవచ్చు. రెండవసారి కూడా శాసన పరిషత్తు వాటిని ఆమోదించని పక్షంలో ఎగువ సభ ఆమోదంతో నిమిత్తం లేకుండానే శాసన పరిషత్తు చేసిన సవరణలతోగాని అవి లేకుండాగాని ఆ బిల్లులను శాసనాలుగా చేసే అధికారం శాసన సభకు వుంది. ద్రవ్యపు బిల్లుల విషయంలో శాసన పరిషత్తుకు చర్చించటం తప్ప ఏ యితర అధికారాలు లేవు. వాటిపైన పరిషత్తుచేసే సిఫార్సులను శాసన సభ అంగీకరించవచ్చు, తోసిపుచ్చవచ్చు; ఏ సందర్భంలోనైనా ఉభయ సభలూ ఆ బిల్లును ఆమోదించినట్లే పరిగణింపబడుతుంది. అంతే కాదు—ద్రవ్యపు బిల్లు శాసన సభయొక్క సెలెక్టు కమిటీకి మాత్రమే పరిశీలనార్థం పంపబడుతుంది; ఉభయ సభల సభ్యులలో కొందరితో ఏర్పాటయే జాయింటు కమిటీకి పంపటానికి వీలులేదు.

ఉభయ సభల ఆమోదం పొందిన బిల్లుపైన స్పీకరు, ఛైర్మను తమ సంతకాలు చేసి గవర్నరు సమ్మతికి పంపుతారు. బిల్లులు శాసనాలు కావటానికి గవర్నరు సమ్మతి అవసరం. రాష్ట్రపతి ఆమోదం పొందాల్సిన బిల్లులను రాష్ట్రపతికి పంపవచ్చు. రాష్ట్రపతి ఆమోదానికి పంపక, గవర్నరు స్వయంగా దానిని ఆమోదించక, అందులో కొన్ని సవరణలు అవసరమని శాసన సభకు తెలియపరచినప్పుడు శాసన సభ ఆయన సూచనలను గురించి ఆలోచించి వాటిని అంగీకరించవచ్చు; లేక వాటిని అంగీకరించకుండా తిరిగి బిల్లును గవర్నరుకు పంపవచ్చు. రెండో పర్యాయం ఈ విధంగా పంపబడిన బిల్లు గవర్నరు ఆమోదం పొందకపోయినా దానిని పొందినట్లే భావింపబడి శాసనాలవుతాయి. అయితే, ఈ సందర్భాలు చాలా అరుదుగా వుంటాయి.

(సశేషం)







జిల్లాల్లో వా


విశాఖ జిల్లాలో ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు మే 20న రాయవాడ నీటిపారుదల ప్రాజెక్టుకు(1)చోడవరం గ్రామ పంచాయతీలో మే 24న రెండవ రిజర్వాయర్_నీటిపారుదల పథకానికి (4); శంకుస్థాపన చేశారు. శ్రీకాకుళంలో మే 23న జంగరతి ఆనకట్ట పథకానికి శంకుస్థాపన చేశారు (2). మే 24న యీ జిల్లాలోనే చేనేత మిల్లులను సందర్శించారు (3) గుంటూరు జిల్లాలోని ఫిరంగిపురం మత్స్య పరిశ్రమ పనివారికి ముఖ్యమంత్రి వలలను పంచి

యిచ్చా
వెంకట
జరిపిన
చిత్రం
మే20న
సందర్శ
ఇదే
మూర్తి
చూడవ











ః చిత్రాలు

చిన్నతరహా నీటిపారుదల శాఖ మంత్రి ' శ్రీ ఆనం
15న నెలూరుజిల్లా ఉదయగిరిలో విస్తృతంగా పర్యటన
ప్పంలో బసినేనిపల్లి గ్రామప్రజలనుద్దేశించి ప్రసంగిస్తోన్న
తూర్పుగోదావరి జిల్లా కాకినాడ సూర్యకళా మందిరంలో
హన్ మహాపీర్ "కైవల్య జ్ఞానదివసం" ఉత్సవాలు జరిగిన
శ్రీ సామవేదం జానకిరామశర్మ ప్రసంగించారు (5).
లో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమీషనర్ శ్రీ వి. భాను
కళాప్రపూర్ణ" జ్ఞానానందకవి ప్రభృతులను కూడా





ప్రపంచ తెలుగు మహాసభలకు హాజరైన విదేశీ ప్రతినిధివర్గాల సంక్షిప్త పరిచయం

శ్రీ చావలి రామమూర్తి

ప్రపంచ తెలుగు మహాసభలకు మన దేశంలోని అన్ని రాష్ట్రాలనుండి ప్రతినిధి వర్గాలు, శ్రీ భవానీ శంకర్ నియోగి, శ్రీ బుజా వేంకటప్పయ్య, శ్రీ సోమంచి యజ్ఞన్న శాస్త్రి, శ్రీ జె. వి. సోమయాజులు న్యాయమూర్తి శ్రీ టి. వి. ఆర్. తాతాచారి వంటి ప్రవాసాంధ్ర ప్రముఖు లెందరో వచ్చారు. వారందరిని గూర్చి యిదివరకు విన్నాము కాని వారందరి మూర్తులను చూడలేదు. వారిని చూసే భాగ్యము ఈ మహాసభలు కలుగజేశాయి.

వీరేకాక విదేశములనుండి కూడా ప్రతినిధులు వచ్చారు. మన ప్రక్కదేశమైన బర్మా నుండి ఎవ్వరూ రాలేదు. మొత్తం 17 దేశాలు, అమెరికా, ఇంగ్లాండు, ఫ్రాన్సు, రష్యా, పశ్చిమ జర్మనీ, కెనడా, శ్రీ లంక, ఫిజీ, మారిషస్, దక్షిణాఫ్రికా, సింగపూరు ఇండోనీషియా, మలేసియా, జాంబియా, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లా దేశ్ లనుండి ప్రతినిధులు వచ్చారు.

రష్యానుండి వచ్చిన ప్రతి నిధులలో మనతెలుగు వారెవ్వరూ లేరు. తెలుగు వచ్చిన ముగ్గురు రష్యను ప్రముఖులు వచ్చారు.

అమెరికా నుండి వచ్చిన ప్రతినిధులలో మన తెలుగు వారే కాక మరో ముగ్గురు, ఆదేశీయులు ఉన్నారు.

మహాసభలలో అనేక కార్యక్రమములు ఉండటము చేత అందరినీ కలియ లేక పోయాను. మొత్తం పది దేశాల వారిని మాత్రమే కలిశాను.

దక్షిణాఫ్రికా ప్రతినిధులతో

దక్షిణాఫ్రికా నుండి వచ్చిన శ్రీ పి. బి. సన్యాసి, శ్రీ బి. వి. నాయిడు గార్లను కలిశాను. వీరు ఆంధ్ర సభ అధ్యక్ష కార్య దర్శులు. వీరితో పాటు వచ్చిన శ్రీ పి.బి. అప్పన్న రెడ్డిగారిని వారి సతీమణి శ్రీమతి సీతగారిని కలిశాను తెలుగులోనే సంభాషణ జరిగింది. దక్షిణాఫ్రికాలో మొత్తము 35 వేలమంది తెలుగు వారు న్నారు. అందరూ ఇండ్లలో తెలుగు మాట్లాడతారు, 'జూలూ' అనే ఆఫ్రికన్ భాష, ఇంగ్లీషు అందరికీ వస్తాయి. వివాహ సంబంధాలు అన్నీ తెలుగు వారిలో తెలుగు వారే చేసుకుంటారు. తెలుగు తనాన్ని నిలబెట్టడానికి ప్రయత్నము ఎన్నడూ మానలేదు అన్నారు. మాకు తెలుగు పత్రికలు లేవు. తెలుగు చదవలేము. మాకు ఆకాశవాణి విజయవాడ, హైదరాబాదు కేంద్రాల కార్యక్రమాలు వినిపించవు అన్నారు. మాకు తెలుగు సినిమాలు కావాలి అని ఎంతో ఆప్యాయముగా కోరారు ఈ సోదరులు. వీరు ఇంగ్లీషు భాషలో తెలుగు పాటలు ప్రార్థనలు వ్రాసుకున్నారు.

మారిషస్ ప్రతినిధివర్గంతో

మారిషస్ నుండి 9 మంది సభ్యులుగల ప్రతినిధి వర్గము శ్రీ యస్. ఆర్. పైడయ్యగారి అధ్యక్షత క్రింద వచ్చారు. వీరిలో శ్రీ గోరయ్య రెడ్డి (తెలుగుభాషోపన్యాసకులు) శ్రీ అప్పయ్య, శ్రీ బాపునాయి. (వీరిరువురూ చెరుకుతోటలో పనిచేస్తారు) గార్లతో సంభాషించాను. తెలుగులోనే సంభాషణ జరిగింది. మారిషస్ లో 50,000 పైబడి తెలుగు వారున్నారు. 75 ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు నేర్పబడుచున్నది. తెలుగు పత్రికలు వీరికిరావు. హైకమీషన్ కార్యాలయము ద్వారా అప్పుడప్పుడు "ఆంధ్రప్రదేశ్" వస్తుంది. తెలుగు వారు వారి యిండ్లలో తెలుగులోనే మాటలాడుతారు, వారిలో వారే సంబంధాలు చేసుకుంటారు, ఇంకతప్పని సరి అయితేనే యితర భాషావర్గాల వారితో సంబంధాలు చేసుకుంటారు. తెలుగు సినిమాలు ఎన్నడూ రాలేదు. ఒకసారి శ్రీపతి జమున యితర సినీకళాకారులు వచ్చారు అని ఎంతో ఆప్యాయంగా సినీ కళాకారుల రాకను గుర్తుచేసుకున్నారు. ఫ్రెంచి భాషయొక్క అంశమయిన 'క్రిమోలు' అనేభాష మారిషస్‌లో మాట్లాడతారు. ఇంగ్లీషు కూడా వస్తుంది.

తెలుగు బోధనచేసే ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో మాకు కావాలి అన్నారు ఈ మిత్రులు. ఇదివరకు శ్రీ వేటూరి ఆనందమూర్తి, శ్రీ బ్రహ్మానందం వచ్చారు. వారు తిరిగి వెనక్కి వచ్చేశారు, తెలుగు చెప్పేవారెవరూ లేరు అని వీరు వాపోయారు.

అంతేకాదు; మాకు తెలుగు తెలిసిన 'జోషి' (పురోహితుడు) కావాలి. మేము తెలుగు పంచాంగము, తమిళ పంచాంగము కూడా మద్రాసునుండి తెప్పిస్తాము అన్నారు. వీరికి తెలుగు ఉగాది, తమిళ సంవత్సరాది కూడా సెలవు దినాలే. హిందువుల పండుగలు అన్నీ వీరు జరుపుకుంటారు.

మారిషస్‌లో, తెలుగు అభివృద్ధి చెందటానికి చాలా అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వముకూడా సంపూర్ణ సహాయము చేస్తుంది. మన తెలుగువారైన శ్రీ వీరాస్వామిగారు ప్రభుత్వములో మంత్రిగా ఉన్నారు. ఆంధ్రమహాసభ చిరునామా. మారిషస్ ఆంధ్ర మహాసభ, డా. యూజీన్ లా సెంట్ స్ట్రీట్, పోర్ట్ లూయిస్, మారిషస్.

ఆఫ్ఘనిస్థాన్ ప్రతినిధితో

ఆఫ్ఘనిస్థాన్ నుండి డాక్టరు కొంతి కృష్ణమూర్తిగారు వచ్చారు. వీరు ఐక్యరాజ్య సమితికి చెందిన యు.యన్.డిపి.లో పనిచేయుచున్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లో మొత్తము 12 తెలుగు కుటుంబాలు ఉన్నాయి. భారతీయ పాఠశాలల్లో తెలుగు నేర్పరు. హిందీ నేర్పుతారు. తెలుగువారు వారి పిల్లలను ఈ పాఠశాలలకే పంపుతారు. తెలుగు వారికి ప్రత్యేకించి ఒక సంఘములేదు. తెలుగు పత్రికలు, పుస్తకాలులేవు. వీరి చిరునామా డా. కొంతి కృష్ణమూర్తి యస్.ఇ.సి.ఆర్.టి, యు.యన్.డి.పి, కాబూల్-5.

సింగపూర్ ప్రతినిధితో

సింగపూరునుండి శ్రీ బాని సింహాచలంగారు వచ్చారు. తెలుగు భాష, సంస్కృతి, ప్రజలు అంటే సర్వస్వము అర్పించగల తెలుగు బిడ్డడు శ్రీ సింహాచలముగారు. "సింగపూరులో మొత్తము 200 మంది తెలుగువారున్నారు. ఇక్కడ, ఇంగ్లీషు, చైనీసు' మలే, తమిళము అధికార భాషలు. తెలుగు వారికి ఒక సంఘములేదు. ఆ ఏర్పాటుకు కృషి జరుగుచున్నది. తెలుగు వారు యిండ్లలో తెలుగే మాటలాడతారు. వారిలోవారే సంబంధాలు చేసుకుంటారు. సింగపూరుకు హైదరాబాదు ఆకాశవాణి వినిపిస్తుంది. మాకు ఏ తెలుగు పత్రికలురావు. విశాఖపట్నం నుండి వచ్చే స్టీమర్లలో చాలామంది తెలుగుమిత్రులున్నారు. వారు పుస్తకాలు పత్రికలు పట్టుకువచ్చి యిస్తారు" అని అన్నారు శ్రీ సింహాచలము గారు. వీరు వీరి పిల్లలను విశాఖపట్టణములో ఉంచి విద్యగరిపించుచున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము సింగపూరు ప్రభుత్వముతో మంతనాలు జరిపి, తెలుగుభాషను అచ్చట ప్రవేశపెట్టుట చాలా అవసరము. సునాయాసము అని వీరు పేర్కొన్నారు. సింగపూరులో తెలుగువారికి తెలుగు భాషకు సముచిత స్థానాన్ని తీసుకొని రాగలను అని వీరు ఉత్సాహముగా పేర్కొన్నారు. వీరి చిరునామా. శ్రీ బి. యస్. చలం, ఎడ్యుకేషన్ ఆఫీసరు 174 కె. బ్లాకు, మెర్సీన్ సెర్రీన్, సింగపూరు-15.

ఫిజీ ప్రతినిధులతో

ఫిజి దీవిలో దక్షిణ ఇండియా ఆంధ్ర సంఘము నెలకొల్పబడినది. ఇక్కడ 18,000 మంది తెలుగు వారున్నారు. ఫిజీ నుండి వచ్చిన శ్రీ దేవానంద రావు గారిని, శ్రీ సోమరాజు గారిని, శ్రీ బాలగోవిందము గారిని కలిశాను. ఫిజీలో తెలుగు వారు వారి యిండ్లలో తెలుగునే వాడతారు. తెలుగు దనాన్ని నిలబెట్టుకొనదానికి ఎంత అయినా కృషి చేస్తున్నాము అన్నారు వారు. ఇక్కడ తెలుగు వారిని యితర దక్షిణాత్యులతో కలిపి, 'మద్రాసీలు' అంటారు. హైదరాబాదు ఆకాశవాణి కేంద్రము వారికి వినిపించదు. తెలుగు సినిమాలు ఎవ్వరూ చూడ లేదు. శ్రీ దేవానందరావు గారు వృత్తి రీత్యా అధ్యాపకులు. వీరు ఫిజీ రేడియోలో నెలకు ఒక సారి తెలుగు కార్యక్రమాలు నిర్వహిస్తారు.

'ఆంధ్రప్రదేశ్ పత్రిక వస్తూ ఉంటుంది. అదిచూస్తే కొంత సంతృప్తి కలుగు తుంది అన్నారు వీరు. ఫిజీ భాషకు లిపిలేదు. అందుచే వీరు రోమన్ లిపినే ఆ భాషకు వాడు తారు.

మాకు "విప్రనారాయణ" చిత్రము పంపించండి అన్నారు శ్రీ సోమరాజు గారు.

శ్రీ దేవానందరావుగారి చిరునామా, శ్రీ దేవానందరావు పి. ఒ. బాక్సు, నెం. 373 సామాబుల్వా సువా, ఫిజీ.

మలేసియా ప్రతినిధి వర్గంతో

మలేసియా నుండి 29 మంది సభ్యులు గలప్రతినిధి వర్గము డాక్టరు. సి. అప్పారావు. యం.ఏ. పిహెచ్.డి. గారి నాయకత్వము క్రింద వచ్చారు. వారే మలేసియా ఆంధ్ర సంఘానికి అధ్యక్షులు. డాక్టరు రావు అర్థశాస్త్రాచార్యుడు. వీరు అమెరికాలోని, 'ఓక్‌లామ్. విశ్వవిద్యాలయములో విద్యాభ్యాసము చేశారు. సంభాషణాచతురులైన డాక్టరు రావుగారు, వారి అర్థాంగి శ్రీమతి రాధారావు గారు, వారితో మాట్లాడినంత సేపు అప్యాయత, ఆదరణ బంధు ప్రీతిని వెల్లడించారు. శ్రీ రావు దంపతులు తెలుగులో మాట్లాడగలరు. శ్రీమతి రావు ఇంగ్లీషు బోధించే ఉపాధ్యాయిని.

తెలుగు తల్లి అనే పత్రిక మలేసియా నుండి వెలువడు చున్నది. దీని సంపాదకులు శ్రీ వి. కృష్ణమూర్తి గారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులైన శ్రీ కృష్ణమూర్తిగారు స్వచ్ఛముగా తెలుగు మాటలాడుతారు.

శ్రీ చీకెట్టి సూకయ్య, శ్రీ దాటి శ్రీరాములు, శ్రీ ఆర్. పి. రాములు గార్లను కూడా కలిశాను. వారు చాలా ఉత్సాహవంతులైన కార్యకర్తలు.

తరాలుగా వీరు భౌతికముగా మాతృ భూమికి దూరముగా ఉన్నా, మానసికముగా వీరు తల్లి ఒడిలోనే ఉన్నారు.

ఆకాశవాణి హైదరాబాదు బాగా వినిపిస్తుంది. హైకమీషను కార్యాలయము ద్వారా వారికి "ఆంధ్రప్రదేశ్" వస్తుంది.

1,60,000 మంది తెలుగువారున్న మలేసియాలో 25 తెలుగు పాఠశాలలు, 14 ఆంధ్ర సంఘము శాఖలు ఉన్నాయి.

మలే దేశభాష. రోమన్ లిపి వాడతారు. మాకు విరివిగా సినిమాలు వచ్చేటట్లు మీరందరు కృషిచేయాలి అన్నారు, మలేసియా

సోదరులు. ఆరు సంవత్సరాల క్రిందట "నమ్మినబంటు" సినిమా వస్తే చూచాము అన్నారు. Andhra Association Post Box No. 2 Bagan Datoh, Perak, Malasiya.

ఇండోనేషియా ప్రతినిధితో

ఇండోనేషియానుండి ఏకైకప్రతినిధి శ్రీ యం. శ్రీరాములు గారు వచ్చారు. వీరు రాణి ఇంగ్లీషు స్కూలుకు డైరెక్టరు. మరి అమ్మన్‌గుడి సంఘమునకు ప్రథమ అధ్యక్షులు. ఇండోనీషియాలో కేవలము 2,000 మంది మాత్రమే తెలుగువారు ఉన్నారు. ఒక్క సుమత్రాలోనే వీరు ఉన్నారు. జావా, బోర్నియాలలో చాల తక్కువ మంది ఉన్నారు. ఇక్కడ తెలుగు బోధించే పాఠశాలలు లేవు. తమిళ పాఠశాలలు ఉన్నాయి. తెలుగు పుస్తకాలు, సినిమాలు దృగ్యములు. ఇండోనేషియా దేశభాష. ఇంగ్లీషు విరివిగా వాడుతారు. శ్రీ శ్రీరాములుగారు కొన్ని తెలుగు — ఇంగ్లీషు, ఇంగ్లీషు—తెలుగు బోధిని పుస్తకాలు తమతో తీసుకు వెళ్ళగల మన్నారు. ఇండోనేషియాలోగల మన రాయబారి కార్యాలయానికి వచ్చేవారు అందరూ. ఉత్తర హిందూ స్థానమువారే అవటముచేత, ఎన్నడూ తెలుగు వినిపించదు అన్నారు.

ఇండోనేషియాలో, హిందువులు "ఇండియన్ హిందువులు, ఇండోనేషియాన్ హిందువులు" అని రెండు రకాలు. ఇండియన్ హిందువుల సంఖ్య 50 వేలు. వీరు వ్యాపారముకొరకు వచ్చేవారు. ఇండోనేషియన్ హిందువులు అనగా ఆ దేశములో ఉండి పౌరులైన హిందువులు. వీరు ఒక కోటి మంది. తెలుగు వారందరూ ప్రస్తుతము ఇండోనేషియన్ హిందువులుగానే ఉన్నారు. ద్వితీయ ప్రపంచ మహా సంగ్రామము తరువాత చాలమంది తెలుగు వారు స్వదేశమువచ్చి వేశారు. శ్రీ శ్రీరాములుగారి చిరునామా Sri M. Sree Ramulu. Director, Rani English School, Jin Brig Katamsa No. 60 B. Medam Indonesia.

శ్రీ లంక ప్రతినిధి వర్గంతో

శ్రీ లంక నుంచి వచ్చిన ప్రతినిధి వర్గానికి శ్రీ A. M. రాజా అధ్యక్షులు. శ్రీ చింతలపూడి వీర రాఘవరావుగారు కార్యదర్శి. మొత్తము 9 మంది సభ్యులు వచ్చారు. వీరందరిలో శ్రీమతి మీనాక్షి పొన్నుదొరై తెలుగు వారికి, శ్రీ లంక బ్రాడ్ కాస్టింగు కార్పొరేషన్ ద్వారా పరిచితులు. మనకు శ్రీ లంక నుండి తెలుగు పాటలు వినిపించే మీనాక్షి అక్కయ్యకు తెలుగు సోదరులు, సోదరీ మణులు అంటే అత్యంత ఆప్యాయత. వచ్చిన విదేశీ ప్రతినిదు లందరిలోకీ ఎక్కువ మందిని ఆకర్షించిన మీనాక్షి అక్కయ్య బళ్ళారి నివాసి. మద్రాసులో విద్యాభ్యాసముచేసి. భారత స్వతంత్ర సమరములో భాగస్వామిని అయి. శ్రీ లంక చేరినారు.

శ్రీ లంకలో మొత్తము మూడు లక్షల మంది తెలుగువారు ఉన్నారు. అంతా కొద్దిగానో గొప్పగానో తెలుగు మాట్లాడుతారు కాని, చాలామంది తెలుగు చదువలేరు. " శ్రీ లంక తెలుగు సాంస్కృతిక సభ " ద్వారా యిప్పుడు తెలుగు నేర్పుచున్నారు. మేము మాతృభూమికి దగ్గరగా ఉన్నా మాకు తెలుగు పుస్తకాలు పత్రికలు రావు అన్నారు. ఉత్తర ప్రత్యుత్తరాలు అన్నీ ఇంగ్లీషులోనే జరుగుచున్నాయి, గత 25 సంవత్సరములలోను "మల్లీశ్వరి" సినిమా శ్రీలంక వెళ్ళిందట ; తమిళులవలె, తెలుగువారు స్థానికులతో, భాషా విషయమై ఏవిధమైన అభిప్రాయ భేదములు పెంచుకోలేదు అన్నారు శ్రీలంక సోదరులు. శ్రీమతి మీనాక్షి పొన్నుదొరై చిరునామా శ్రీలంక తెలుగు సాంస్కృతికసభ నెం. 36 గ్రీనుపార్కు, కొలంబో-7.

లండన్‌నుండి వచ్చిన శ్రీమతి సూర్యకుమారి

లండన్‌లో స్థిరపడిన శ్రీమతి టంగుటూరి సూర్యకుమారి కంఠమాధుర్యము అత్యంత ప్రశంసనీయము. ఈమె శ్రీ ఎడ్విన్ అనే పాశ్చాత్యుని వివాహ మాడి లండన్‌లో స్థిరపడ్డారు. శ్రీ ఎడ్విన్ చిత్రకారుడు. లండన్‌లో శ్రీమతి సూర్యకుమారి భారతీయ సాంస్కృతిక విద్యలైన నాట్యాన్ని, పాటలను, నేర్పుచున్నారు. శ్రీమతి సూర్యకుమారి సంభాషించినప్పుడు, ఆమె విజయనగరంలో బంధువులనందరిని ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకొన్నారు. మీది విజయనగరమా? అని ప్రశ్నించి సాధారణ కుశల ప్రశ్నలు వేసి ఇంగ్లాండును గురించి మీకు ప్రత్యేకముగా చెప్పవలసింది ఏమీ లేదు. మీరు పేపర్లలో చదువుతున్నారుకదా అన్నారు. మన భారతీయ సంస్కృతి పట్ల ఇంగ్లీషువారికి చాలా అభిమానం అని ముగించేశారు.

అమెరికన్ ప్రతినిధితో

అమెరికా నుండి వచ్చిన ప్రముఖులలో, విస్కాన్‌సిన్ విశ్వవిద్యాలయములో చరిత్రశాఖలో ఆచార్య పీఠమును అలంకరించిన ఆచార్య రాబర్టు ఎరిక్ ఫెర్కిన్‌బర్గను మాత్రమే కలిశాను. "నేను మీలాగే తెలుగు మాతృభాషగా కలవాడను" అని కొంత గర్వముతో పలికారు. వారితో సంభాషణ చాలా వరకు తెలుగులోనే జరిగింది.

రాబర్టు తండ్రిగారైన ఎరిక్ భారత దేశములో తెలుగు ప్రజల మధ్య ఇరువదిఐదు సంవత్సరములు సికింద్రాబాదు-నెల్లూరు మధ్య

క్రైస్తవమత ప్రచారకుడుగా ఉన్నారు. 1930వ సంవత్సరము జూను నెల 8వ తేదీన రాబర్టు, ఊటీలో జన్మించారు. 1942లో ద్వితీయ ప్రపంచయుద్ధం వలన అమెరికా వెళ్ళు వరకు తన బాల్యమును, గుంటూరు, కర్నూలు, నల్గొండ, సూర్యాపేట, వినుకొండ నర్సారావుపేట, నెల్లూరు, సికింద్రాబాదులలో గడిపినారు. వీరు స్వీడన్ దేశస్థులు. అమెరికాలో వీరు ఎం ఏ. పట్టము పొంది, లండన్ విశ్వవిద్యాలయం నుండి పి. హెచ్.డి. పట్టా పొందారు. వీరి పరిశోధనకు "భారతీయులు-ఆంధ్రచరిత్ర" అభిమానవిషయముగా గైకొన్నారు. వీరు వీరి అభిమాన విషయమునే; కాలిఫోర్నియా, లండన్, చికాగో విశ్వవిద్యాలయములలో బోధించి 1962వ సంవత్సరము నుండి విస్కాన్సన్ విశ్వవిద్యాలయములో చరిత్రశాఖాచార్యులుగా ఉన్నారు.

వీరు భారతదేశాన్ని చాల పర్యాయములు సందర్శించారు. "గుంటూరు చరిత్ర 1788–1848" అనే గ్రంథాన్ని వ్రాసి ఆక్స్‌ఫర్డు విశ్వవిద్యాలయమువారిచే 1965 సంవత్సరమున ప్రకటింపచేశారు.

వర్తమానకాలమున తెలుగుదేశములో తెలుగుభాషా సాహిత్యాలలో లబ్ధ ప్రతిష్ఠులైన పలువురు ప్రముఖులతో తమకు కల పరిచయాన్ని శ్రీ రాబరు వివరించి చెప్పారు.

అమెరికాలో విస్కాను సన్ విశ్వ విద్యాలయములో మాత్రమే తెలుగు బోధిస్తారు. ఇక్కడైనా పట్ట పరీక్షకు (Graduation) కి 10 మంది కన్న ఎక్కువ మంది లేరు. ఎం.ఏ. (M.A.) లోతెలుగును స్వీకరించేవారు ఒకరో లేక యిద్దరో. అందుచేత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, తెలుగు యెడల ప్రీతి కలగటానికి తగు కృషి చేయాలి అన్నారు. ఆక్స్‌ఫర్డు, కేంబ్రిడ్జి, లండన్ విశ్వ విద్యాలయాల్లో తమిళము నేర్పుతారు, కాని తెలుగు లేదు అని అన్నారు శ్రీ రాబర్టు.

డాక్టరు ముజేనే రొగో హైరు అనే విద్వాంసుడు, "పల్నాటి సీమలో వ్యావహారిక భాష" అనే అంశము పై పరిశోధన చేసి, పి.హెచ్ డి. పొందారు, వీరు తమ పరిశోధన కొరకు 800 టేపులలో, జానపద గేయాలు, 'రికార్డు' చేశారు. వీరే విస్కాన్ సన్ విశ్వ విద్యాలయము నుండి మొదటగా తెలుగులో పి. హెచ్. డి. పొందినవారు.

"తెలుగులో నిత్యము మాట్లాడటానికి తగిన అవకాశము లేక నేను తెలుగులో మాట్లాడటానికి కష్టపడ వలసి వస్తోంది" అన్నారు శ్రీ రాబర్టు.

తెలుగు, స్వీడిష్ భాషలాగనే సంగీతానికి, గానానికీ అనువైన భాష అని తెలుగుని కొనియాడారు.

ఈ సంచికలో రచయితలు

శ్రీయుతులు

మిరియాల రామకృష్ణ, తెలుగుశాఖ, ప్రభుత్వ కళాశాల, రాజోలు, తూ. గో. జిల్లా

వి. సుబ్బారామశర్మ, సెక్షన్ఆఫీసర్, లెజిస్లేచర్ సెక్రటేరియట్, హైదరాబాద్

జె. వీరాస్వామి, సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్‌కమీషన్, గృహకల్ప, హైదరాబాద్

యస్. జయలక్ష్మి, నెగ్గిపూడి, (వయా) మారుటేరు, ప. గో. జిల్లా

తిరుమల రామచంద్ర, 69, ఆదర్శనగర్, హైదరాబాద్

చావలి రామమూర్తి, 5/3 ఆర్.టి, "కంఠేశ్వరి", నిజామాబాద్

వి. యల్.సుందరరావు, రైల్ పేట, బాపట్ల

కాళోజీ, నక్కలగుట్ట, హన్మకొండ, వరంగల్

ఎస్. వై. హుస్సేన్, బి. ఎ. పి. ఆర్. ఓ, రాయవరం, తూర్పుగోదావరి జిల్లా

రెంటాల గోపాలకృష్ణ, ఛీఫ్ సబ్ఎడిటర్, ఆంధ్రప్రభ, విజయవాడ

ముసునూరి శివరామకృష్ణారావు, బి 23, విజయనగర్ కాలనీ, హైదరాబాద్

మాదల వీరభద్రరావు, సబ్ఎడిటర్, ఆంధ్రప్రభ, క్వీన్స్‌రోడ్, బెంగుళూర్

కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, 69 ఆదర్శనగర్, హైదరాబాదు

వుప్పల లక్ష్మణరావు, C/o "వికాసం", హిల్‌పాట్నా, బరంపురం, ఒరిస్సా రాష్ట్రం

సినిమా పాటలలో సాహిత్యపు విలువలు

శ్రీ రెంటాల గోపాలకృష్ణ

తీగె కదిలిస్తే డొంకంతా కదులు తుందన్నట్లు, సినిమా పాటలు గురించి, వాటిల్లో సాహిత్యపు విలువలు గురించి కొంత చెప్పాలంటే, అసలు సినిమా తీరుతెన్నులు గురించి కొంచెమైనా ప్రస్తావించవలసి ఉంటుంది.

చలన చిత్రాలు ఈనాడు ప్రజాజీవితంలో ప్రధాన స్థానం ఆక్రమించుకున్నవి. సినిమాలు చూడని వారు, వాటిని గురించి ముచ్చటించు కొననివారు చాలా అరుదు.

దేశం మొత్తం మీద దాదాపు పన్నెండు వందలమందికి పైగా చలన చిత్ర నిర్మాతలున్నారు. ఆరువేలకు పైగా థియేటర్లు ఉన్నట్లు అంచనా. ఫిలిం స్టుడియోల సంఖ్య డెబ్బయికిపైగా ఉంది. అన్ని భాషలలోనూ కలిపి ఏడాదికి నాలుగు వందల యాభై మొదలు, అయిదు వందల వరకు కథా చిత్రాలు నిర్మాణం అవుతున్నాయి. సినిమాలవల్ల కోట్ల కొలది విదేశీమారకద్రవ్యం లభిస్తున్నది.

కాగా, ఆంధ్రప్రదేశ్‌లో రమారమి పన్నెండు వందల థియేటర్లున్నాయి. సగటున ఏడాదికి డెబ్బయి, ఎనభై తెలుగు సినిమాలు నిర్మిస్తున్నారు. వినోదపు పన్ను మూలంగా రాష్ట్ర ప్రభుత్వానికి నాలుగు కోట్ల రూపాయలు లభ్యమవుతున్నట్లు అంచనా.

ఉపాధి కల్పన

అసంఖ్యాకులైన కళాకారులకు, సాంకేతిక నిపుణులకు, ఇతరపనివారికి ఉపాధి కల్పిస్తున్న చలన చిత్రరంగం, ఈ నాడు ఒక ప్రధానమైన పెద్ద పరిశ్రమగా రూపొందింది. దినదినాభివృద్ధి చెందుతున్నది. గడచిన పాతిక సంవత్సరాలలోనూ సాంకేతికంగా నేమి, ఇతర ప్రయోగాలలో నేమి, చలన చిత్రాల నిర్మాణంలో ఎన్నెన్నో వినూత్నమైన మార్పులు వచ్చాయి. పరిశ్రమ అనేక విధాల అద్భుతమైన ప్రగతిని సాధించింది.

ఆధునికయుగంలో సంపూర్ణము సర్వ సమగ్రము అయిన దృశ్యరూపంగా సినిమా రూపొందడంవలన, ఈనాడు, ప్రజా బాహుళ్యానికి ఒక విషయం తెలియ జెప్పాలంటే, అందుకు సినిమా ప్రధాన సాధనమైంది. అలాంటప్పుడు సినిమాలలో మంచి ఉన్నా చెడు ఉన్నా వాటి ప్రభావం సమాజంపై బలీయంగా ఉండడం సహజం.

సామాజిక ప్రయోజనం

కేవలం వినోదమే కాక, విజ్ఞానం కూడా అందించడం చలన చిత్రాల లక్ష్యమైనా, సినిమా వ్యాపార దృష్టితోకూడిన ఒక కళ అని పలువురు అంటారు. పూర్తిగా విజ్ఞానాత్మకమైన చిత్రాలు తీస్తే, ప్రజాబాహుళ్యం ఆదరించే అవకాశం లేదని, డబ్బు రాదని వారి వాదం కొన్ని లక్షలు వెచ్చించి సినిమా తీస్తున్నప్పుడు, నష్టపోకుండా ఉండడానికి వ్యాపార దృష్టి ముఖ్యమని వారి అభిప్రాయం. కనుకనే సామాజిక ప్రయోజనం కోసంకాక, ప్రజల మానసిక ప్రవృత్తులను పెడ మార్గం పట్టించే అవాంఛనీయ ధోరణులతో ఈనాడు సినిమాలు అనేకం రావడం జరుగుతున్నది ఒకానొక ఉన్నత లక్ష్యంతో, ఉత్తమ అభిరుచులతో, సమాజాన్ని ప్రగతి ప్రధాన నడిపించే చిత్రాలు ఎప్పుడో కాని రావడంలేదు. వినోదంతోపాటు విజ్ఞానాన్నికూడా ప్రసాదించే చిత్రాలు చాలా తక్కువ.

నేటి సినిమాల పరిస్థితి ఇలా ఉన్నప్పుడు, వీటిలో సాహిత్యపు విలువలు ఎంతవరకు ఉండగలవన్నది విచారణీయం. అంతే కాదు. సాహిత్యం అనేటప్పటికి, శాశ్వతమైన కొన్ని నిర్వచనాలు, ప్రమాణాలు చెప్పుకోవలసి ఉంటుంది. సాహిత్యంప కోవకు చెందినది అయినా, ఆ నిర్వచనాలు, ప్రమాణాలు దానికి వర్తించవలసి ఉంటుంది. అయినా, సినిమా ఒక ప్రత్యేకమైన ప్రక్రియగా రూపొందడం వలన, సినిమా సాహిత్యం ఒక ప్రత్యేక పద్ధతిని సంతరించుకోవడం వలన, ఆ ప్రత్యేక పరిధిలోనే, సినిమాలలో సాహిత్యపు విలువలను గురించి పరిశీలించవలసి ఉంటుంది.

విద్యాధికులు, సాహిత్య పరిజ్ఞానం కలవారు, రసజ్ఞులు అయిన కొద్దిమందికి మాత్రమే పరిమితమైనదికాదు సినిమా. ఒకే సారి అనేక వేలమంది సామాన్య ప్రేక్షకులు చూచే దృశ్యరూపం ఇది. నిరక్షరాస్యుల సంఖ్యకూడా ఎక్కువైనపుడు, సినిమాలలో మాటలుగాని, పాటలుగాని సాధారణ ప్రజానీకానికి సులువుగా అర్థమయ్యేటట్టు ఉండాలన్నది నిర్వివాదాంశం. ఇతివృత్తం కొన్ని వందల పేజీల కార్యమైనా, పెద్ద గ్రంథమైనా, విస్తారమైన విషయమే అయినా, దాని సారాంశం సినిమాగా రెండున్నర గంటల లోనే చెప్పవలసిఉంటుంది. అందుచేతనే, సినిమాలలో మాటలు, పాటలు చాలా సంక్షిప్తంగా, సూటిగా, అవసరమైనంత వరకే సందర్భానికి తగినట్లు వ్రాసుకోవడం జరుగుతుంది. సరళమైన భాష, తేలిక అయిన పదాలు సినిమాలకు ఎంతో అవసరం. పౌరాణిక చిత్రాలలో, అదీ కొన్నికొన్ని సందర్భాలలో, కొన్ని ప్రత్యేకమైన పాత్రలకు మినహాయిస్తే, మామూలుగా సినిమాలలో పెద్ద పెద్ద సమాసాలు, కఠిన శబ్దాలు ప్రయోగించి పాండిత్య ప్రకర్షను ప్రదర్శించవలసిన అవసరంలేదు.

సినిమాలలో సంభాషణలు, పాటలు అందరికి అర్థమయ్యేలా ఉండాలని చెప్పినంత మాత్రాన, అవి పేలవంగాను, చవకబారుగాను ఉండాలని అర్థంకాదు చలనచిత్ర పరిశ్రమ ప్రారంభదశలో ఉన్నప్పుడు, పాతిక ముప్పయి సంవత్సరాల క్రితం సినిమాలు పౌరాణికాలయినా, జానపదాలైనా, సాంఘికాలైనా, సాహిత్యం కొంత ఉత్తమ స్థాయిలో ఉండేది. ఆనాడు సినిమాల నిర్మాణం తక్కువ. ఇంత ఎక్కువ సంఖ్యలో చిత్రాలు వెలువడేవికావు. ఒక చిత్ర నిర్మాణానికి ఎంతోకాలం పట్టేది. అప్పటి దర్శకులకు, నిర్మాతలకు కూడా కళ, సాహిత్యాల పట్ల అభిరుచి, వాటిల్లో కొంత అభినివేశం ఉండేవి. వారు అన్ని విషయాలు సాకల్యంగా పరిశీలించి, పరిశోధించి, దీక్ష, దక్షతలతో కృషిసాగించి, ఉత్తమ సాహిత్య ప్రమాణాలతో, అప్పటికి లభ్యమైన సాంకేతిక విలువలతో చిత్రాలు రూపొందించడానికి ప్రయత్నించారు. కాని రానురాను పరిస్థితులు మారాయి. పరిశ్రమలో అనేక మార్పులు వచ్చాయి. సాంకేతికంగా కొత్తకొత్త ప్రయోగాలకు అవకాశం ఏర్పడింది. సినిమాలు తీసేవారి సంఖ్య, సినిమాలు చూసేవారి సంఖ్య విపరీతంగా పెరిగింది. ఒకప్పుడు సంవత్సరాలలో తీసిన సినిమా ఈ నాడు కొలది మాసాలలోనే, ఇంకా చెప్పాలంటే కొన్ని రోజుల లోనే తీస్తున్నారు. ఒక దర్శకుడు ఏకకాలంలో అయిదారు చిత్రాలకు దర్శకత్వ బాధ్యత నిర్వహిస్తున్నాడు. ఒక సంగీత దర్శకుడు ఒకేసారి అనేక చిత్రాలకు సంగీతం సమకూరుస్తున్నాడు. అలాగే నటీనటులు, పాటల రచయితలు, సంభాషణల రచయితలు ఒకే మాటు పెక్కు చిత్రాలకు పని చేస్తున్నారు. అందుచేత ఈనాడు ఎవరికీ తగినంత తీరిక, ఓపిక ఉండడం లేదు. ఈ పరిస్థితి, కళాకారులకు, సాంకేతిక నిపుణులకు పుష్కలంగా జీవనోపాధి లభింప జేస్తూ, పరిశ్రమ అభివృద్ధికి ఎంతగానో దోహదకారి అయినప్పటికీ, చిత్రాలలో స్థాయి తగ్గి పోవడానికి కారణమైంది. ఒక చిత్రం ఉత్తమంగా రూపొందడానికి గాను ఏకాగ్రతతో సర్వవిధాల కృషి చేయడానికి అవకాశాలు సన్నగిల్లినవి. సాహిత్యపు విలువల్లోనేమి, సాంకేతిక ప్రమాణాలలో నేమి 'క్వాలిటీ' తగ్గిపోయింది. రాశి పెరిగింది కాని గుణం పెరగలేదు

ప్రజారంజకమైన బాణీలు

ఈ సందర్భంలో మరొక ముఖ్యవిషయం గమనించదగ్గది. సినిమా పాటలు చక్కని, చిక్కని సాహిత్యపు విలువల వల్ల కాక, వాటికి సమకూర్చే సంగీతపు బాణీల వల్లనే ఎక్కువగా ప్రజాదరణ పొందుతున్నవనడం సత్యదూరం కాదు. దర్శకులు, నిర్మాతలు ముందే 'ట్యూన్' ఇచ్చి దానికి అనుగుణంగా పాట వ్రాయమని రచయితను కోరడం పెక్కు సందర్భాలలో జరుగుతున్నది. అంతకు మునుపే ఒక భాషలో 'పాప్యులర్' అయిన ట్యూన్‌కు తగినట్లుగా పాట వ్రాసినప్పుడు, ఈ పరిధినే పాట రచించవలసి వచ్చినప్పుడు అందులో అంతగా సాహిత్య ప్రమాణాలు ఉంటాయని ఆశించలేము. ఉత్తమ సంగీత, సాహిత్యాలు సంతరించుకున్న సినిమాపాటలు మృగ్యమై, తాత్కాలిక ఉద్వేగాన్ని, ఉల్లాసాన్ని కలిగించే చౌకబారు పాటలు ఎక్కువైనాయి. సహజమైన మానసిక బలహీనతల వల్ల, సామాన్య ప్రేక్షకులు కూడా వీటిని ఆదరించి, అభిమానించడం జరుగుతున్నది. సందర్భశుద్ధి, ఔచిత్యము లేని పాటలతోపాటు, అశ్లీలమైన ద్వంద్వార్థాలు ధ్వనింప జేసే పాటలు కూడా నేటి తెలుగు సినిమాలలో వస్తూ ఉండడం మిక్కిలి శోచనీయం. పైగా వీటిని అసభ్యంగా చిత్రీకరించడం కూడా అప్పుడప్పుడు చూస్తున్నాము.

ఉత్తమ ప్రమాణాలు

ఇది కేవలం రచయితల తప్పు అని చెప్పలేము. ప్రముఖ కవులుగా పేరు పొందిన వారు సాహిత్యంలో ఒక స్థానం సంపాదించుకున్న వారు పలువురు ఈ నాడు సినిమాలకు పాటలు రచిస్తున్నారు. ఉత్తమ సాహిత్యాన్ని అందించగల ప్రతిభ, వ్యుత్పత్తులు వారికి ఉన్నవి. అయినా, 'బాక్సాఫీస్' దృష్టి ప్రధానం గల నిర్మాతల అభిరుచులనుబట్టి వారు రచన సాగించవలసి వస్తున్నది. సర్వత్రా లేదుకాని, ఎక్కువ సందర్భాలలో ఏర్పడుతున్న పరిస్థితి ఇది.

'ప్లేబాక్' విధానం తెలియని రోజుల్లో నటీనటులు అభినయిస్తూ స్వయంగా అప్పటికప్పుడే పాటలు పాడేవారు. ఇప్పుడు నటీనటులు స్వయంగా పాడేవారు కానక్కర్లేదు. ప్లేబాక్ గాయనీ గాయకులు పాడినపాట ముందే రికార్డు అవుతుంది, తరవాత ఆ పాటను కావలసిన సన్నివేశంలో నటీనటులపై చిత్రీకరించడం జరుగుతున్నది. ఎన్నెన్నో సదుపాయాలు, కొత్తకొత్త ప్రయోగాలు వచ్చినా, నేటి సినిమాలకు సమకూర్చే సంగీతంలో జాతీయత, తెలుగుతనం కొరవడుతున్నది. సంప్రదాయం సన్నగిలి, పాశ్చాత్య ధోరణిఎక్కువయింది. మాధుర్యం, హాయి తగ్గిపోయి, తాత్కాలికంగా హుషారెక్కించే రకరకాల వాద్యాల రణగొణధ్వనులు, ఘోష అధికమైనాయి.

వెనుకటి సినిమాలలో సంగీత, సాహిత్యాలు సమ్మిళితమైనట్టి, మనోరంజకమైనట్టి, చిత్తశాంతిని ప్రసాదించునట్టి, భక్తి ప్రపత్తులు పాదుకొలుపునట్టి త్యాగరాజకృతులు, జయదేవుని అష్టపదులు, కృష్ణలీలాతరంగాలు, భావ స్ఫోరకములైనట్టి జావళీలు –ఇలాంటి వాటికి అవకాశం ఉండేది.

నేటి సినిమాలలో ఇలాంటి పాటలు ఒకటి, రెండు ఎప్పుడో కాని వినిపించవు. కాగా, 'క్రైమ్' సెక్స్, న్యూవేవ్ పేరుతో రేప్ సీన్స్ మిక్కుటంగా ఉంటున్న ఈనాటి చిత్రాలలో పాటలకు సాహిత్యపు విలువలు, సంగీతపు విలువలు లేకపోగా జుగుప్సాకరంగా కూడా ఉంటున్నవి పార్కుల్లోనో, పడక గదుల్లోనో, కొండలప్రక్కనో, సముద్రతీరాల్లోనో, ఇష్టం వచ్చినట్లు గెంతుతూ, క్లబ్బుల్లో నగ్నంగా నాట్యం చేస్తూపాడే పాటల్లో ఉత్తమ సాహిత్యం ఉంటుందని ఆశించలేము. నాలుగున్నర దశాబ్దాలుగా తెలుగు చిత్రాలను చూస్తున్నవారికి క్రమక్రమంగా సినిమాపాటలలో సాహిత్య స్థాయి ఎలాదిగజారిపోతున్నదో స్పష్టంగా ద్యోతకం అవుతుంది. కనుకనే ఇప్పుడు సినిమాలలో పాటవచ్చినప్పుడల్లా ప్రేక్షకులు ధూమపానం చేయడానికో, మరొకదానికో థియేటర్ల నుండి బయటికి వెళ్ళడం సాధారణంగా చూస్తూఉంటాము.

సినిమా పాటల్లో అంతగా స్వారస్యం ఉండదని ప్రేక్షకులు కూడా గ్రహిస్తున్నారనడానికి ఇది ఒక తార్కాణం.

సాహిత్యపు విలువలు

చిత్రం సాంఘికమైనా, మరేదైనా అందరికీ సులువుగా అర్థమయ్యే సరళమైన భాషలోనే భావబంధురమైన కమ్మనిపాటలు వ్రాయవచ్చు. చక్కని సాహిత్య సౌగంధ్యాన్ని వెదజల్లే పాటలు నేటి సినిమాలలోకూడా అప్పుడప్పుడు వింటూఉంటాము. కాని, వీటి సంఖ్య తక్కువ అంతేకాదు సాహిత్యపరంగా కొన్ని పాటలు బాగున్నంతమాత్రాన ప్రయోజనంలేదు. ఉదాత్తమైన కథా వస్తువుతో పాటు, సంభాషణలు, పాటలు సాహిత్యపు విలువలను సంతరించుకోవాలి. హృద్యమైన సన్నివేశాలతో చిత్రం నిర్దుష్టంగా రూపొందాలి. ఇలా అన్ని విధాలా సాంకేతికస్థాయిని సమకూర్చుకున్నప్పుడే సినిమా ఒక ఉత్తమ కళాఖండంగా తయారవుతుంది.

సినిమాపాటలలో ముఖ్యంగా పొడిమాటలు తప్ప 'లిరికల్ ఎలిమెంట్' బాగా తగ్గిపోయింది 'లిరిసిజం' లేనందున పాటలు పేలవంగా, నిస్సారంగా ఉంటున్నవి. నాయికానాయకులు పాడే డ్యూయెట్‌లు చాలా సందర్భాలలో అసహజంగాను, ఎబ్బెట్టుగాను ఉంటున్నవి. ఒకపాత్రలో హర్షవిషాదాలనుకాని, ఒక పాత్ర మరొకపాత్రకు చెప్పదలచిన విషయంకాని, పాటరూపంలో వ్యక్తం చేయవలసివచ్చినప్పుడు ఆ పాట అలంకారయుక్తంగా, అన్యాపదేశంగా, ధ్వని పూర్వకంగా ఉంటే, అది ప్రేక్షక హృదయాలను ఆకట్టుకోవడమేకాక, సాహిత్యపరంగా దానికి విలువ ఉంటుంది. ఇలాంటి పాటలు కొన్ని సినిమాలలో అప్పుడప్పుడు మనం వింటూ ఉండడం కద్దు. ఎంతకాలమైనా ఈ పాటలను ప్రేక్షకులు మరిచిపోకపోవడానికి, రేడియోలోనో, మరెక్కడో వినిపించినప్పుడు వాటిని పదేపదే మననం చేసుకుంటూ ఉండడానికి వాటి సాహిత్యపు విలువలే ముఖ్యకారణం.

సినిమాపాటల్లో సాహిత్యం దిగజారిపోవడానికి, భావనా పటిమ, వైవిధ్యం సన్నగిల్లి సినిమా పాటలన్నీ ఒకే మూసలో పోసినట్లుండడానికి ప్రధానమైన కారణాలు రెండు. ఇంతకుముందు చెప్పినట్లు రచయితలకు తగినంత వ్యవధి, విరామం లేకపోవడం, దర్శకులకు, నిర్మాతలకు ఈ విషయంలో తగినంత అభిరుచి, శ్రద్ధాసక్తులు లోపించడమూను.

అసభ్య రచనలు

ప్రేమగీతమైనా, ప్రబోధగేయమైనా, విషాదగీతమైనా, విప్లవగేయమైనా చక్కని సాహిత్యం. ఉన్నప్పుడే సార్థకమవుతుంది. అలాకాక, సినిమా పాటలుకాని, మాటలుకాని చౌకబారు అభిరుచులను పెంపొందింప జేసేవిగా ఉంటే, వాటి ప్రభావం ప్రజాబాహుళ్యంపైన, ముఖ్యంగా పసిహృదయాలపైన, యువతీ యువకుల అపరిపక్వమనో ఫలకాలపైన ప్రబలంగా ప్రసరించి వారిని పెడమార్గాన మళ్ళించగలవని వేరే చెప్పవలసిన పనిలేదు. ప్రజలు చూస్తున్నారని అసభ్యకరమైన సినిమాలు తీయడం, ప్రేక్షకులు ఆదరిస్తున్నారని ఆనందిస్తున్నారని చౌకబారు మాటలు, పాటలు ప్రవేశపెట్టడం సమర్థనీయంకాదు. కుటుంబ సహితంగా సినిమాలకు వెడితే, కొన్ని సినిమాలలో సన్నివేశాలు, మిక్కిలి లజ్జాకరంగాను, అవమానకరంగాను ఉండడంచేత, తలలు వంచుకోవలసి వస్తున్నది. వయసువచ్చిన పిల్లలు ఎక్కడ చెడిపోతారో అని సభ్యత, సంస్కారంకలవారు బాధపడవలసి వస్తున్నది. సినిమాలలో పాటలుకొన్ని పిల్లలు పాడుతూఉంటే, 'ఆ పాడు పాటలు ఎక్కడ నేర్చుకున్నావని' మందలించడం కూడా జరుగుతున్నది.

ఈ పరిస్థితి మారవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. వర్తమాన సామాజిక పరిస్థితులకు, జీవిత సమస్యలకు సినిమాలు దర్పణంగా ఉండడానికి బదులు, సినిమాలలో ఉన్నట్లు సమాజం ఉంటే, సినిమాలలో వేషభాషలను, ప్రవర్తనా వైఖరులను సామాజికులు అనుకరించడం జరిగితే, అది అస్తవ్యస్త పరిస్థితి అని, అనర్థదాయకమని వేరే చెప్పనక్కర్లేదు.

ప్రజల అభిరుచినిబట్టి సినిమాలు తీస్తున్నామని చెప్పడం వాంఛనీయంకాదు. సినిమాలే ప్రజలను ఉత్తమ అభిరుచులవైపు మరలించవలసి ఉంది. అలాంటి సినిమాలు వచ్చినప్పుడే సమాజానికి శ్రేయస్సు చేకూరుతుంది. సినిమాలు మానవులలోని పాశవిక ప్రవృత్తులను ప్రకోపింపజేసేవి, వారిలో అవాంఛనీయ ధోరణులు తలఎత్తేటట్లు చేసేవికాక, వారిలో మానవతా ధర్మాన్ని పాదుకొలిపేవిగాను, అంతరంగాలను ప్రదీప్తంచేసి, సన్మార్గమువైపు పయనింపజేసేవిగాను సమాజ శ్రేయస్సాధనకు వారిని కార్యోన్ముఖులుగా చేసేవిగాను ఉండడం ఎంతైనా అవసరం.

ప్రజలలో సినిమాలపట్ల ఎక్కడలేని మోజు, వ్యామోహం ప్రబలి, సినిమాలు ఒక పెద్ద 'గ్లామర్'గా తయారైన ఈ రోజుల్లో సినమాకళను సక్రమంగా, సవ్యంగా వినియోగించుకోవలసిన బాధ్యత సినిమా పరిశ్రమపైన ఉంది. పరిశ్రమలోనివారు ఈ సత్యాన్ని దృష్టిలో పెట్టుకుని చిత్రాలు తీసినప్పుడు, సినిమా పాటలకుకాని, మాటలకుకాని, సినిమా సాహిత్యానికి కాని ఒక ఉత్తమ స్థానం లభించడంతోపాటు, ఈనాడు ప్రజాజీవితంలో అత్యంత కీలకమైన పాత్ర నిర్వహిస్తున్న చలనచిత్రాలు సమాజాభ్యున్నతికి విశేషంగా తోడ్పడగలవు.

బిక్కవోలు గ్రామం

గత చరిత్ర: ప్రస్తుతపు ప్రగతి

శ్రీ ఎస్. వై. హుస్సేన్

రాష్ట్రకూటులను, పశ్చిమగాంగులను ఓడించి యావద్దక్షిణ భారత భూమికి అధినాధుడనని ప్రకటించుకొన్న వేంగి ప్రభువు గుణగ విజయాదిత్యుడు తాను సలిపిన సమరములలో జరిగిన మారణ హోమము, మానవరక్తపాతముల పరిహారార్థము అచ్చట దేవాలయమును నిర్మించెనట—అందు ప్రతిష్ఠాపింపబడిన 'విజయేశ్వరుడు' వేంగి ప్రభువు విజయమును సూచించు చున్నాడట—సూర్య, చంద్ర గంగా, యమునా పాళీధ్వజాది సామ్రాజ్య చిహ్నములనే గాక పృథ్వీ వల్లభ, దక్షిణ పథాధిపతి బిరుదాలంకృతుడై ప్రతిష్ఠించిన ఆలయము గనుక ఆ ప్రదేశమునకు 'బిరుదాంకనవోలు' అను పేరు వచ్చి యుండవచ్చు. వేంగి దేశపు ప్రఖ్యాత పట్టణమైన రాజమహేంద్ర వరమునకు నాలుగామడల దూరముననున్న ఈ బిరుదాంకనవోలులో వేంగి చాళుక్యులకాలముననే పలుప్రసిద్ధ దేవాలయములు వెలసినవి. ఇవి ద్రాక్షారామ దేవాలయముల కన్న ఇంచుక ప్రాచీనములని చరిత్ర పరిశోధకుల భావన. ఇందలి విశిష్టమైన శిల్ప సంపద ఉత్తర, దక్షిణ సంప్రదాయముల సమ్మిళితము. గ్రామమునకు ఆవలనున్న ఆలయమందలి శిల్పము మహాబలిపుర శిల్ప సంప్రదాయమును స్మరణకు తెచ్చును. రాజులు, రారాజులు కాలగతిని కలసి పోయినారు. కాని ఈ నాటికి ఆ ప్రాచీన దేవాలయములు అందలి శిల్పసంపద పూర్వీకుల ఔన్నత్యమును చాటుచున్నవి—అయితే ఈ నాడు ఇచ్చటి ప్రజలు ఈ కట్టడములను చూచిమురిసి పోతూ మాతాతలు నేతులు త్రాగినారు, మా మూతులు వాసన చూడరండని, చేతులు ముడుచుకొని కూర్చుండలేదు. నవభారత నిర్మాణములో తమ పాత్రను విస్మరించ లేదు—వారీనాడు గ్రామ పునర్నిర్మాణమునకు పూనుకొని పలుపథకములు చేబట్టి విజయములను సాధించుచూ అలనాటి విజయాదిత్యుని విజయ పరంపరలను తలపించుచున్నారు.

నాటి "బిరుదాంకనవోలు" నేటి బిక్కవోలు

కాకతీయుల కాలము నాటి 'ఓరుగల్లు' కాలక్రమేణా వరంగల్లు అయినట్లే చాళుక్యుల కాలములో చరిత్ర కెక్కిన 'బిరుదాంకనవోలు' బ్రిటిషు వారు బలపడే నాటికి బిక్కవోలు అయినది. తెల్లదొరల కాలములో తెలుగు వెలుగు తెరమరగున పడినది. వ్యాపార దృష్టితో వ్యవహరించే వారి పద్ధతి పట్టణముల అభివృద్ధికి పనికి వచ్చినది, గ్రామాభ్యుదయము అడుగంటి పోయినది. బిక్కవోలు కూడా ఆ కాలంలో అట్టి అవస్థను అనుభవించినది. స్వరాజ్యం సిద్ధించిన పిదప పల్లెల పురోభివృద్ధికి పలు పథకములు వేసినవి. ప్రజా ప్రభుత్వము—అట్టి పథకములలో కాకినాడ—పెద్దాపురం కమ్యూనిటీ ప్రాజెక్టు ఒకటి— ఆ ప్రాజెక్టు ప్రాంతములో ఒక పెద్దగ్రామము ఈ బిక్కవోలు. కమ్యూనిటీ ప్రాజెక్టులు అభివృద్ధి మండలములై కడకు ప్రజాస్వామ్య పాలనలో పంచాయితీ సమితులుగ స్థిర పడినవి. కమ్యూనిటీ ప్రాజెక్టుల కాలము నాటి నుండి నేటి వరకు అనేక అభివృద్ధి పథకములను అమలు పర్చుచూ బిక్కవోలు బహుముఖముగా అభివృద్ధి చెందుచున్నది.

బిక్కవోలు తూము

'ఖండవల్లి మడుగు' వలె బిక్కవోలు తూము కూడా ఈ ప్రాంతమందు వాడుకలోనున్న పదము. ఒకప్పుడు ఈ ప్రాంతము అతివృష్టికి ఆటపట్టయి పొలాలన్ని జల మయమై ఉండేవట. అప్పుడు ఈ ప్రాంతమునకు ప్రభువులైన పెద్దాపురం సంస్థానాధీశులు రాజావత్సవాయి వారు ఆనీరు బయటకు పోయే మార్గముగా ఒక పెద్దతూమును నిర్మించిరట— మరో తరములో అనావృష్టికి ఆలవాలమైనప్పుడు అప్పటి రాజావారు తమ పట్టపు ఏనుగుపై అంబారీలో కూర్చుని ఇచ్చటకు వచ్చి ఆవలి ప్రాంతమునకు ఈ తూము గుండా వెళ్లినారని— అప్పుడు ఈ తూముపై భాగము రాజావారి ఏనుగు అంబారీకి కూడా తగలలేదని ప్రజలు పెద్దవింత కథగా చెప్పుకుంటారు. ఇప్పుడైతే తూము లేదుగాని 'బిక్కవోలు తూము' అనేమాట ఒక వాడుక పదముగా మిగిలినది.

ఈ తూమును చూచిన ఒక ఆంగ్లేయుడు అచ్చెరబోయి 'బిగ్‌హోల్' అని అరచెనట— అదే 'బిక్కవోలు' అయినదనేది ఒక కథనం. ఇదికేవలం ఒక కట్టుకథ— నిరాధారమైన నిందా

రోపణ. తూము నిర్మాణమునకు ముందే ఈ ఊరు ఉన్నట్లు చరిత్రాధారములుండగ దీనికిటువంటి అపఖ్యాతిని ఆపాదించుట కట్టుకథ కాక మరేమిటి ?

ప్రకృతితో పోరాటం

గోదావరి నదికి ధవళేశ్వరము వద్దకట్టిన ఆనకట్ట ఫలితంగా ఏర్పడిన కాలువ వల్లసాగు అగుచున్న 4,000 ఎకరముల పల్లపు భూమి గాక బిక్కవోలు యందును దాని పరిసరములలో గల మరి ఐదారు గ్రామముల యందును వందలాది ఎకరముల మెట్టభూమి గలదు. వరుణ దేవుని కరుణ వల్ల చెరువులు నిండితే ఆ పొలాలు పండేవి. ఆ పంటవల్ల వచ్చేది కూడా నామమాత్రపు ఆదాయమే. ఆ మధ్య ఏర్పడిన అనావృష్టి వల్ల ఆనామ మాత్రపు పంట కూడా పండక అది గ్రామస్థులకు ఒక సమస్యగా పరిణమించినది. ప్రజలే ప్రభువులైన నేటి ప్రజాస్వామ్యములో ఈ సమస్యకు పరిష్కారము కూడా ప్రజలే తెలుసుకొన గలిగినారు. తత్ఫలితముగ ప్రాంతీయ అభివృద్ధి పథకము క్రింద 1968 లో బిక్కవోలు గ్రామమందు శ్రీ రామచంద్రా ట్యూబ్‌వెల్ లిఫ్ట్ ఇరిగేషన్ కోపరేటివ్ సొసైటీ ఉద్భవించినది. 153 మంది సభ్యులు గల ఈ సంఘము రూ 6,88,750 లతో ఒక బృహత్పథకమును రూపొందించినది. భూగర్భమున 375 అడుగుల లోతున దాగి ఉన్న జల సంపదను వెతికి తీయుటకు భగీరథ ప్రయత్నమును చేసినది సంఘము. అగ్రో ఇండస్ట్రీస్ సంస్థ నుండి అద్దెకు తెచ్చిన ' రిగ్గు ' సహాయముతో 26 గొట్టపు బావులను త్రవ్వించి వాటికి విద్యుత్పరికరములను అమర్చినది—కృషి ఫలించినది—పాతాళములో ఉన్న నీరు పైకివచ్చి కాలువలలో ప్రవహించసాగినది. ఆ నీటి వల్ల నేడు దాదాపు (17) పదిహేడు వందల ఎకరముల భూమిలో సాలీనా రెండు పంటలు పండే పరిస్థితి ఏర్పడినది. ఇంతటి మహత్కార్యాన్ని సాధించిన సంఘము ప్రభుత్వము నుండి ధన సహాయము ఏమి కోరలేదు. కాని ఆలమూరు, రామచంద్రపురం తాలూకాల భూమి తనఖా బ్యాంకులు ఈ సంఘ సభ్యులకు వ్యక్తిగత ఋణముల క్రింద రూ 3.35 లక్షలు ఇవ్వగా ఆ సొమ్మును ఈ సంఘములో మదుపు పెట్టినారు సభ్యులు. ఇదిగాక పథకము పూర్తి చేయుటకు కావలసిన రమారమీ రూ 2.50 లక్షల వరకు తమ సొంత సొమ్మును సభ్యులే సమకూర్చినారు. ప్రకృతితో హోరా హోరీ పోరాడి సత్ఫలితములను సాధించిన ఈ సంఘము దాని తొలి అధ్యక్షులును నాటి రాయవరం పంచాయతీ సమితి బ్లాక్ డెవలప్‌మెంటు ఆఫీసరు శ్రీ వెంకటేశ్వరరావు గారికి వారి అవిరళ కృషికి ఎంతగనో ఋణపడి ఉన్నది.

ఇంతకు ముందొకసారి ఇటువంటి సమస్యయే ఎదురైనపుడు లింగాల చెరువు లిఫ్టు ఇరిగేషన్ కోఆపరేటివ్ సొసైటీ స్థాపించబడినది. బిక్కవోలులో—భూగర్భజలములను పైకి తీయుటకు గొట్టములను దింపి విద్యుత్ సహాయముతో పాతాళగంగ పైకి తీయుటవల్ల 500 ఎకరముల భూమికి ఖరారైన నీటి సరఫరా యేర్పడినది. తత్ఫలితంగ 350 మంది సన్నకారు రైతులకు జీవనభృతికి అవకాశం కలిగింది.

బిక్కవోలులో అనావృష్టివల్ల ఏర్పడిన మరొక అవాంతరము మంచినీటి కొరత. వేసవియందు కాలువలు కట్టిన కాలములో ఈ కొరత కరువే అగును. నీటి కరువు నివారణకు బిక్కవోలులో బహుప్రయోజన కరమైన పథకమొకటి ప్రవేశపెట్టబడినది. అదే చిన్నతరహా మంచినీటి సరఫరా పథకము.

ఏదేశ చరిత్ర చూసినా అనాదిగ ప్రకృతితో పోరాడి విజయముసాధించిననాడే మానవుడు మనగలిగినట్లు ఋజువగుచున్నది. అట్లే బిక్కవోలులో కూడా ప్రజలు ప్రకృతితో పోరాడి తమ ఉనికిని నిరూపించుకున్నారనుటకు పై సంఘటనలే ప్రబల నిదర్శనములు.

సహకారముపై మమకారముగల ఈ గ్రామములో సాగు నీటి సహకార సంఘములే గాక ఇంకనూ మరెన్నో సహకార సంఘములు సేవచేయుచున్నవి. అందు మార్కెటింగ్ సొసైటీ, పరపతి సంఘములు పేర్కొనదగినవి.

విద్యా నిలయములు

చాళుక్యుల చరిత్రలోగాని పెద్దాపురం రాజుల రోజులలోగాని ఇచ్చట విద్యా నిలయములు ఎన్ని వెలసినవో ఎటుల పని చేసినవో ఇదమిత్థముగా తెలియుటలేదు. కాని ఈ నాడు ఇచ్చట అయిదు ప్రాథమిక పాఠశాలలు 20 మంది అధ్యాపకులతో భావి పౌరులను తీర్చి దిద్దే యజ్ఞములో నిమగ్నమై యున్నవి. ఈ అయిదు విద్యా నిలయములలో రెండు హరిజనవాడలలో ఉండుట ఒక విశేషము. అంతేగాదు ఇచ్చట ఒక ఉన్నత పాఠశాల కూడా ప్రారంభింపబడి చక్కటి భవనములలో ఆధునిక బోధనా పరికరములతో పూర్తి ప్రతిపత్తిగలిగి పనిచేయుచున్నది.

పౌర సౌకర్యములు

గ్రామములో పౌరులకు కావలసిన కనీస సౌకర్యములు క్రమముగా కల్పింపబడుచున్నవి. అందుకు నిదర్శనములు అచ్చట అడుగడుగునా అగుపడును.

విశాలమైన ఆవరణయందు పూలమొక్కల మధ్యన కనులకింపుగా కనిపించే పంచాయతీ కార్యాలయ భవనములు గ్రామ పంచాయతీ సాధించిన ప్రగతికి ప్రతిబింబములు – పంచాయతీ అధీనమున గ్రామము నడిబొడ్డునందుగల తటాకము ఒడ్డున చిన్న ఉద్యానవనము–ఆ వనములో ఒక మూల ప్రాచీన ఆధునిక సాహిత్య సముదాయముతో నిండిన పుస్తక భాండాగారము–దానికి అనుబంధముగా నిత్యము పత్రికలతో నిండిన పఠన మందిరము — పంచాయతీ సల్పుచున్న సాహిత్య సేవకు ప్రత్యక్ష నిదర్శనము. సాయం సమయములందు, ఉద్యానవనమందు ఆకాశవాణి సామాజిక శ్రవణ కేంద్రమునుండి వినిపించు సంగీతము వీనులకు విందు. ప్రధాన వీధులలోనేగాక హరిజన పేటలలో సైతము వెలుగుచున్న వీధి విద్యుద్దీపములు పంచాయతీ పక్షపాతరహిత పద్ధతికి ప్రబల తార్కాణము. తుపాను బాధితుల సంక్షేమ నిధినుండి నిర్మింపబడిన పక్కా-

(తరువాయి 38వ పేజీలో)

పెద్ద కథ

మరో పెపంచం

—శ్రీ పుప్పల లక్ష్మణరావు

మాయయ్య గుడ్డోడు. గుడ్డోడంటే—పుట్టుగుడ్డోడు కాదుమీ. ముష్టిగుడ్డోడు. ఐదుగంటల కల్లా, సుక్కలింకా యెలిసిపోక ముంగలే మాం నెగిసిపోతాం. నెగిసిపోయి, దయమాను సెరువు నేదా, ఆ సెర్ల తానఁవాడతాం. సెర్లో నీళ్ళు యెచ్చగున్నా, వొళ్లు జివ్వుమని సాలొత్తది. సచ్చిపోనాఁవనే అనుకుంతం. మరి రెండో పాలి మునుక్కి సచ్చి మళ్లీ పుటక బుట్టినట్టుగే అయిగుంటది. దయమాను సెరువుకీ ఆయేలకి వొవ్వరు రారులే. నగండాగా తానఁ వాడినా సూసేవోల్లెవ్వరుండరు—గట్టుకాడ రావి సెట్టు మీద కూకున్న మాలకాకులు తప్పితే. మారు గుడ్డ నేకుంతే మరేఁవి సేత్తం? సెప్పుమీ! మావిద్దరం నెక్కముంగలే మాయమ్మ తానఁ వాడి యెల్లిపోద్ది పనిలోటకి. మాం తానవాడి ఆమాసిన పాతలే—మాయన్నీమాసినాయే యనుకో, మరి మల్లి పువ్వునాటి నిక్కరూ, యెన్నెల్ని యెక్కిరింసేటి సొక్కా యేసుకుని బిచ్చం అడిగితే డబ్బులు రాలుత్తారా? నాయాలు? నువ్వరాబ్బుతావా సెప్పుమీ? ఊఁహూఁ. మాం అసియ్యం గుండాల. మాం యేసుకున్న పీలికలు సినిగి సివికిపోయి, అలుగుడ్డల్నా గుండాల. అనగుంతనే ఆల్ల రాతిగుండెలు కసిన్ని నీటి బొట్లు కారుత్తయ్—తానాలు సేసుకొని మావిద్దరం మెల్లంగెల్తాం. యెక్కడికంతావా? రాఁవలింగం సెరుగట్టు మీద సిమ్మెంటు బెంచీలు నేవూ? దరఁవాత్తుఁవులు శాసితొంగ కట్టించి పారేసిర్రు. అదుగో ఆ బెంచీలకాడకి—అయ్య పావుల డబ్బులిత్తాడు. డబ్బులుచ్చుకొని యెంకటేసురి గుడి కాడ నాఁవాల బేపనయ్య ఇడ్డన్లు అమ్ముతంతాడు నువ్వు సూసుంతావు. ఆ నాఁవాల పంతులు కాడ ఐదిడ్డీన్లూ, యింత వొగ్రగుండా కొనుకోని అయ్యకాడకి పారొత్తా. అయ్య అప్పటికే అవురావురంతూ పాఁవులాడి నాగుబాఁవునా బుసలు కొడుతుంతాడు నానింక రానేదని. అయ్యయి మూడు, నాయి రొండు—వొగ్రపొడుఁవూ అంతే, అయ్యది రొండొంతు లైతే నాదోవొంతు. అయ్యకాడ సిలేవరు గిలాసుందిలే. దాన్ల నాను నీల్లుతెచ్చి, సేతులు కడుక్కుంతం. అయ్య మరో పావల కాసిత్తడు. పక్కనే టీబడ్డీవుంది గందా. అక్కడికెల్లి మాఁవిద్దరం సెరి టీకప్పు గొంతుక లోసుకుంతం. ముంగల మాఅయ్య యేం జేసిండనుకున్నవ్? ఆడి సిలేవరు గిలాసులోరెండు కప్పులీ నానుయేసించుకు సిమ్మెంటు బెంచికాడకీ నాను తెత్తే ఆడు నాల్గు పెద్దపెద్ద గుటకలుమింగి, నాకు ఓ అరకప్పె మిగిల్చేడు. మాయయ్య తోకసుక్క అనుకో, మరినానో, నాను పగటిసుక్క. అదిగంతేమరి. అయ్య అన్యాయం సూసినా, సూసినా, సూసినా, యేటీ గోరం అని నాను మారాంసేసినా, నానొట్టుకు రాను పవ టీ కొట్టుకని అయ్య పేనంమీదే పేద్ద వొట్టేసినా. మాయయ్య మా సెడ్డకానోడు. మాయయ్య మాయయ్య

అంతన్నసుగాని నాకు అయ్యకాడనుకో. నాయయ్య యెవుడో నిక్కచ్చిగ మాయమ్మకే తెల్దంటని మాయమ్మే సెప్పిందంటో పాలి కోఁయిటి సీతమ్మతోన—మెళ్లబంగారం కంటెట్టుకోని వొడియాలు యెండబెట్టి అమ్ముద్ది—అదిగా మడిసి, మంగళారప్పేటలోట ఓ తెల్ల గొల్లకుర్రాడి మీద మాయమ్మకి అనుమానం తగిలి యీదిలేని సి అడిగిందంట జగడఁవే స్తేసీ— మరి ఆకిల్లాడివోడి మగసిరే అయుండాల-నిచ్చేపంగ కడుపు సేసినోడూ, మాపిటికి యింటిల సెప్పాసెయ్య కంట, రిక్సా వొగ్గేసి, డబ్బులొట్టుకోవి కటకపురి పారిపోనాడంట; బొత్తు పాపణ్ణినన్ను వొళ్లో యేసుకునీ బుజమ్మీద మోసుకోనీ—మా సెడ్డ కౌకులడిందంట మాయమ్మ నాతోట. పాపం తిన్నపూటతినీ, లేనిపూట పస్తుండీ—మాయమ్మ పేనం మాసాలు కొచ్చిందంట. నానుపుట్టిన పున్నఁవికి మాయమ్మ నన్ను ఓల్లేసుకోనీ పెందల కాడే బేపనీధిల ముష్టికి బయలెల్లిందంట ఓయింటి గుమ్మంల గొల్లోడు పాలావు యెనక్కాలుకట్టి పాలు పిండు తుందంట. పాలావు శాఁట పెయ్యని నాకుతుందంట. నెలపురటాలు బేపనమ్మ గడప్పట్టుకు నించోని "బేగితియ్యిపాలు సంటోడు పాలకోసం గుక్కెట్టేచ్చి పేనం తీస్తుండు, బేగితియ్య పాలు" అని గొల్లోణ్ణి సతాయిస్తూందంట, మాయమ్మ కేటి మెరిసిందో బుర్రల వూపునెల్లి తానఁవాడి సాకింటికెళ్లి సాకిదాయి కాల్లాయేల్లాపడి పావలా కాసు సేతిలెట్టి అక్కడికక్కడే పడుపు సీరి తెల్లంది కట్టి సాకి దాయిని బెతిఁవలాడి మోగాన పసుపు రాసుకోని పైసంత బొట్టెట్టుకోని రయిక లేకుంటానె నన్నోబొంత లేసి బాపనమ్మింటికి లగెత్తిందంట అల్లింట్లె పాలుదాదిగా కుదురుకుందంట. ఇప్పుడేటి – మామాటమ్మ సెప్పిందిలే—సంటి గుంటడికి నెలాకి రొండబ్బాలు పోత పాలంతేపి రొండు పాతికలు గందా-సాపులోట సావుకారుచ్చుకుంతడు, అట్టాంటిది ఆల్ల సంటోడికి మాయమ్మ రెండు పూటలు యెడా పెడా పాలుకడుపు నింప కుడిపిత్తే నెలకి పది రోపియలు సేతిలెడితే దరమం సేసినట్టే అనుకు నోర్మంట-పాలు పడని మగాతల్లులు. యెంత సీఁవజాతి పాలావేగానీ యేడాదీ పాలిస్తదా వొట్టిపోదా? అనాగే మరి గొల్లడేటి సేత్తాడు? వొట్టి పోకముంగలే పసువునమ్మేత్తాడు. అదేయవ్వారం. సంటోడు మాయమ్మ పాలు మరిగోడు ఆపంతులు మాయమ్మ రుసి మరిగోడు మాయమ్మొట్టి పోంగానే ఆ బేపనమ్మ పెనిఁవిటి తో జగడఁవేసుకోని ఆఁవాసపూటే సంటిగుంటణ్ణెత్తుకుని యిజానారం పుట్టింటికెళ్లిపోనాదంట. మరిక సూసుకో. ఇంజినికి పచ్చదీపం సూపించినట్టుగే, పంతులికి పచ్చదీపఁవే అనుకున్నారంట—యీవోల్లందరూ. అట్టా మాయమ్మ ఆ బేపన పంతుల్ని పగలూ రేతిరీ సేవ సేసిందట—రెండేళ్లు. మెళ్లో కుత్తిగంటూ, నానూ, సెవికి బంగారం నాగులూ.

కొప్పులె బంగారం సేఁవంతి పువ్వూ—సేతికి సన్నటియ్యే అనుకో, రొండు జతలు బంగారంగాజులూ, యేలికి బంగారం సుట్టూ—సూత్తే మా యిలాసంగుందంట మాయమ్మ. మాయమ్మనిజూసి బేపనమ్మలు బుగ్గలు నొక్కుకున్నారంట. బేపన పంతుల్తో మాయమ్మకి యిసు గేసిందో, మరి ఆ పంతులు మాఁవగోరు కూతుర్నీ మనవణ్ణీ సయాం తీసుకొచ్చి అల్లుడి మొగాన పేస్నీల్లు గొట్టినాడో-మాయమ్మ ఆ యింటి శాకిరీ, ఆ పంతులు శాకిరీ ఒగ్గేసి, గాంధీనగరంల, ఆ యీదిల యీ యీదిల వొంటి మడిసి కాపరాల యిల్లలో పాసి పనికీ పడక పనికీ ఎగబడి పగలూ రేతిరీ కాయకష్టం జేసుకొని నన్నెట్టుకునే నాల్గొందలు సేసుకుందట — అబద్దో నిబద్దో యారి కెరుక ? నాకు నాల్గేల్లంటప్పుడు. అంతే—ఆరేల్లయిందీయేటికి. నాకు సక్కగ గురుతుందిలే. దీపాలమాస్య రేపనంగా, మరే టయిందోయేటో - వూరిల కానేజీ సదువుడు సదువుతుంతన్న కుర్రోల్లందరూ బెజ్జిపరం సెరుగట్టుని పిట్రోలు బంకునేదూ - బస్సుల కంపినీది-దాల్లోట పిట్రోలు డబ్బాలుచ్చుకుని చర్చీలన్ని తగలెట్టేసిన్రు. నాల్రోజులు బోగిమంట కాలింది. పోట్టాపీసు యెనక చర్చినేదా ? దాన్ని యిరగ్గొట్టి బంగారబొమ్మలన్నీ గుండపిండిసేసి గుడి తగులబెట్టి నేలమట్టంసేసి అగ్గిబుగ్గి పోగుసేసి బగ్గంపాడు సేసిన్రు. ఆ యేడుక సూసిందుకు యిటు గోపాలపరఁవూ, అటు ఇంజిలిగాటూ, యిటు పురస్తం పరవూ, అటు యిచ్చాపారఁవూనుండి జనం యిరగబడ్డారంటగందా. పది అమ్మోర్ల సంబరాల్ల తొడితొక్కిడయి నాది గదిడుపేనంట- యింతలాటి పెజ ముంగల. మాయమ్మకేటి తోసిందోమరి - అది గప్పటికే, వొయిసినోడు మరెవడిమీద కన్నేసిందో — పేఁవనగర్ల నాయుడు కుర్రోడు గాఁవల — ఆడికి ముంగలే నా జేబుల రెండు రోపిఁయ్ల నోటు యెట్టింది. ఆ జన్నంలదూరి, యేడాది యెల్లని సంటి గుంట నెత్తుకుంది. ఓ ముష్టిదాయినిసూసి, "నాకుర్రోణ్ణి సూత్తాండు అమ్మీ నా కడుపుబ్బ తీర్చుకి దిగిప్పుడే పారొత్తాను." అని సెప్పి అగ్గదే ఉడాయింపు ఉడాయింసేసిందంట. ముష్టి మడిసి గడుసుద్ది-దారాకోట బంగనాకెదురుగ్గనేదా, దీపాలెల్లదండలుగట్టి, బాత్తెల్లల యెలిగించి, రేడియోరంకెలేసే గడ్డిసెడ్డులోట-వొళ్లల్ల సూపించి, గుండెల్లల కదిలించి, నడుఁవెల్ల ఆడించి డబ్బులు దొబ్బుద్దిగుంట- అదిగలా, యీ ముష్టిమడిసి, వో సింకిగుడ్డ మోకాటిమీదికి కట్టుకొని, సింకిపాత వొంటిమీదేసుకొని, వో సంకని సంటిగుంతనెత్తుకొని, సంటిగుంటనోట్లో వొ రొమ్ముకుక్కి, నన్ను ముంగల నిలబెట్టి నా ముడ్డి గిల్లి నన్నేడిపించి "తల్లీ బిడ్డకి పాల్నేవు తల్లీ, దరమం సేయండి, తల్లీ ! బిడకి గెంజినేదు, బాబియ్యో, దరమం సేయండి. బాబియ్యా !" అని పెద్ద బజార్ల అడుక్కునేది. ఆఁడోల్లు పెడ మొగంయెట్టేసి, పైసో, రెండు పైసలో యెట్టేసి పోతంతే, మొగోల్లు అంటగే నిల్సుండిపోయి, ఆఁడదాయి గుడ్డల్లోట సింకుల కేసీ, సంటిగుంటకేసీ యెగాదిగా సూసొక్కని, ఓరు పది పైసల కాసూ, ఓరు పావలా కాసూ, ఓరు దరమాత్తుఁవుడు అర్ద రోపిఁయ్ కాసూ దాన సేతిలి యెత్తెత్తి ఒడేసి, యెల్లనేక యెల్లనేక మెల్లం గెల్లిపొయ్యేవోరు. నాను నోట్లో యేలెట్టుకు అదంత సూత్తూ ముడ్డి తడుఁవుకుంతా యేడుపులంకించుకుండోణ్ణి, గాని ఆ నాటకం యేటో యిప్పుడు తెలిసొత్తంది కొద్దిగె. గిల్లులు గిల్లించుకొని నా పిర్రలు పుళ్లడిపోనాయి. యేడ్సి యేడ్సి గుండ్లెండిపోయి కల్లు కాయలుకాసిపోనాయి. యేమాటకామాట సెప్పాలిగంద. నాకు రెండు పూట్లా యింత గెంజి తాగబోసి, కడుపునిండా మెతుకు లెట్టేది. మరేటయిందనుకున్నావ్ ? అమ్మోరి సంబరంలా వో నాడు గుడ్డోడికి నన్ను పది రోపిఁయ్లకి అమ్మేసింది. నానేం జేసేది ? యయ్య మంచోడే. జరిగిందేదో జరిగిపోనాది తప్పుకు తలకెత్తుకుంతే యేట్నాబం ? తలనొస్తాది తప్ప . . . మాయయ్య నేనూ తానఁవాడి టీ గుటకేస్తాఁవో నేదో - యింత లోటికి సత్తిన్నా రాయణ గుళ్ళోటుంది రేడియో రొదబయల్దేరుద్ది. అది సెవిని యినుకోంగానే అయ్య కల్లు మూతలడిపోతాయ్ యయ్య వో కొస ఒట్టుకుంతే, నాను రెండో కొస ఒట్టుకుని ఆణ్ణి నడిపించుకొని ముష్టెత్తుకుంతా గుడి ముంగల కూకుంతాం. టవుని స్కూల్ల పది గంటల గంట మోగేయేలకి, గుడిలోకెల్లే జనఁవూ—వచ్చె జనవూ—బెజ్జపురం గొల్లదాయి సల్లనాగ పలసనయిపోతాది. సూరీడు నడ్నెత్తి మీద నాట్యెం సేసే యేలకల్లా మాం గుడికాడ్నించి డేరా యెత్తేసి, రాఁవ లింగం సెరువుకాడ కోయిల్నేదు — అక్కడేస్తాం మకాం. అక్కడ డబ్బులు రాలవుగానీ, పర్నేదు—పైస పైస రాలపోదు. సింతసెట్టుకింద ఆకులు రాలినట్టుగే, ఐదుపైసల కాసుగూడ రాల్తదిలే. పోలీసు టేశన్ల రెండు గంటలు కొట్టంగానే, మాం యిద్దరం జెండా దింసేసి, గట్టుకింద రెండు సిన్నతులసి కోటల్నేవా, ఆటి మరుగున మాంకసింత సుబ్బరఁవైన గుడ్డలు యేసోక్కని సెర్లోట కాల్లు సేతులు మొగాఁవు కడుక్కోంగానే యయ్యకి కల్లొత్తాయి. ఆడు మారు గుడ్డ లేసోక్కని సింతనిప్పులకల్లు తెరిసినాడంతే యేరంగున్ సియ్యోయిడి ఆడ్ని పోల్సుకోనేదు. అదిగంతేమరి. ఆడి కల్లల్ల బీడీ పీకయెలుగే. యీడేనా గుడ్డి గంగయ్యా ? అని ఓరు పోల్సనేరు. అంత కిల్లాడీవోడు ఆడు. ఆడు కల్లుమూసొక్కనె అమ్మోరు సంబరం లోట రద్దిగుంటద్ది గందా-ఆడు కర్ర వోకొసపట్టుగుంతే నాను రెండో కొసొట్టుకు రెండడుగులు ముంగల నడుత్తుంటను కానేజీ కుర్రోల్లు గొట్టాం పేంట్లు పిర్రమీద జేబీల్లోట పర్సులెట్టుకుంతారు గందా. ఆల్లు కన్నెగుంటల్ని సూసికన్ను కొట్టే సఁవయాం యెట్ట జూత్తాడో కల్లుమూసుకున్నట్టే వున్న మాయయ్య, ఆల్ల పర్సుకొట్టేసినోడన్న మాటే. కొట్టేసి సువ్వకన్నుమూసి తిరిసేలోట ఆపర్సు ఆడి గోసిలోటకి యెల్లిపోయుంటద్ది. అంత కేటుగోడు మాయయ్య. అయితే అదిరోజుకొక్కపాలే అదిగేనా అమ్మోరు సంబరంలోటే.

అదిగప్పటికే మాయమ్మ సెర్లోతానఁవాడి గట్టుమీద మర్రి సెట్టుకాడ మాకోసం సిద్దంగ కూకుంటది. మాయమ్మ బేపనోల్లు నాలుగిల్లల్ల పాసిజేత్తందికదా ఆల్లెడతారు—పొడివొన్నఁవూ, పాసిన పచ్చడి, బూఁజొట్టినమాగాయీ, సలోసనేసిన ఆవకాయీ—యియన్నీ. ఇయిగాక, మా యయ్య కోసఁవని కిలోబియ్యం పొంగించీ యేడి మెతుగులూ, మాయయ్య మారాం సెయ్యకంట రొయ్యిపొడి పులుసు యేదేడిదీ—కాసి పెడద్ది. కడుపు నిండ తింతంలే. పాపం—మాం తింతున్నంతలెక్క, మాయేపే కన్నార్పకుంత కూకుంతరు—నానా టోల్లే, ముష్టికుర్రోల్లు ఇద్దరు ముగ్గురు. ఆల్లని సూత్తం బెనానెంతోటి అదరుష్టం సేసుకొన్నానోగందా అనుకుంతాను. మాయయ్య ఆల్లని కర్రతో బెదరగొట్టేత్తాడనుకో. మాయమ్మమాత్రం ఆల్లకింత యేడి

మెతుకులు పులుసూ యెడతది. "అదేటీ" యని మాయయ్య అమ్మ మీదిరుసుకు పడితే— "ముష్టిలో యీరముష్టి, దొప్ప కింద దొప్ప, నువ్వు వల్లకోసుండుమీ" అని యయ్యని కసిరేత్తుంది. నిజింగ సెప్పకుంటె మాయమ్మనే సెప్పకోవాల. మాయమ్మ మా కొండిపెడ తందిగానీ మాతోతిందూ, నాసూ నీసూ ముట్టదూ. బేపనోల్లింట ఒక్కొక్కపూట ఒక్కొక్కరింట తింటది. ఆల్లేటి బడేస్తే అదే. రేతిరికి తిన్దు. మజ్జిగసుక్క పచ్చిమిర్చిసిదిఁవి ఉప్పుగడ్డేసి—ఆనీల్లే తాగుద్ది. మరిమాయమ్మది అదేటివరతాఁవో నాకేటితెల్దు. మాయయ్యకి కడుపల మెతుగు దిగుతాదోనేదో వొల్లమానిన నిద్దర. రోజుల్లు కల్లు మూసుగోనే వుంతడు గందా. ఆడికెట్ట కల్లు మూతలడి నిద్దర కెరటా లెట్టకొట్టు కొచ్చినిద్దరల్లో ముంచేత్తాయో మాసెడ్డ సిత్రం గుంటది. సూపున్న గుడ్డోడు నీకేదీపం సూపిత్తాడు. ఆదీపం వొల్ల కొట్ల మంట నాటి దనుకో—యేడుండదు యెలుగుండదు. మాయయ్య తొంగుడగానే మాయమ్మ నానూ బజార్లకెల్లి పోతాం నానప్పటప్పట అనుకుంతానేవుంతా; గుడ్డోడు నాకు అయ్యకాడుగందా ఆణ్ణి 'అయ్య అయ్య' అనెందుకంతాను అనుకుంతా,యీయమ్మ కడుపుననాను పుట్టనేదు గందా 'అమ్మ అమ్మ' అ నెందుకు పిలుసుకుంతాను—అనుకుంతా. నన్ను సేరదీసివోడు బతుకు తెరువు సూపించినోడు—ఓడైనా, ఆడు అయ్యేగందామరి. అయ్యనే సేరదీసి అయ్య పక్కల తొంగుండే ఆడదాఁయి అమ్మేగందా. అమ్మపక్కల తొంగుండే మొగోడు అమ్మ మొగుడైతే నాకయ్య కాడా మరి. నానుసూ స్తన్ననుగానా నోకంల నీతి, నోకంల సెల్లుతున్న నాయం, ఐతే—నాను గుంటణ్ణి, నాకేటి తెలుద్ది—యేది నాయఁవో యేది అన్నాయఁవో ? ... ...

పొద్దు దిగిపోతాదీ—అయ్యా నానూ యాత్తరకి మల్లీ బయలెల్తాం. ఆడు గుడ్డోడు, ఆణ్ణికర్రొట్టుకు నడి పింసినోణ్ణినాను. ఐతే ఓ నాడు సిన్నబజారు మసీదు యీదీ, గోలీల సందు, మినిస్ట్రీ నైన్నూ సూసుకుంతాం. ఓనాడుపంచదేవుళం యీదీ, ఆతంకూరోళ్ల సందూ, గాదోళ్ల యీదీ యియన్నీ సూసుకుంతాం. యేయే దుకానోలు సాపులూ యిల్లూ తాలాలు పడుంత్తయ్యో అయ్యన్నీ మాయిల్లే. ఆ రేతిరికి తొంగుందుకి యేరుపాటు సేసుకుంతం. ఆ యరుగు మీద మాయయ్య కల్లు మూసుకునే అడుక్కుంతడు. నానో కాలీయిల్లు సూడంగనే, మడుసులు నేకండ జూసి, కర్రజాడితే అయ్యకల్లు తెరిసి ఆపేఁట ఆ యీది, ఆయిల్లు అన్నీ గుర్తుంచుకుంతడు. ఇంక గురుతు సాలనట్టు గుమ్మంమీద ఓరాయెడతడు. రాయి అట్టగేవుంటే యింటోల్లు మర్రానట్టుగే మాఅయ్య మాయలమల్లిగోడని నాను సెప్పినాగానా, రేతిరి తొంగుందుకు యెక్కడైతేటి అన్ని అరుగులు మెత్తగుంతై అన్ని గచ్చులూ యెచ్చగుంతై. మాం యిల్లు సూసుకోని బారకాసు కాస్తం అడుక్కుంతూనే. బస్టాండుల పైసలు యేటంత పడవు, సినీఁవా మొదలెట్టేయేలకల్లా జోతి ఆల్డిగ్గిర కిర్లీబడ్డికాడయేస్తాం. మకాం మాయయ్య నేలమీద సతికిలబడతోడు. ముంగల సిన్నపాత గుడ్డ పరుసుకుంతాడు. ఆడి పక్కనే నాను కూకుంతాను. నాలుక్కాసులు గుడ్డమీద సేరంగానే, గుడ్డమీద వొక్కగా నొక్క కాసుంచి, కడాఁవి తీసి అయ్యసేతికిచ్చేత్తా. అయ్యగడుసు పిండాం అని సెప్పినాగానా, ఆడన్ని సినీమాల కెల్తాడు. ఏసినీమా బొమ్మలు జూసి ఆఁడోల్లు ముక్కులు సీదు కోని కల్లంట నీళ్ళెట్టుకుంతారో, కన్నెరికం తీసిన ఆఁడపిల్లలు, వోలమ్మ అని యేడిసిన పసిపాపలు ఉంతారో, ఆసినీమా ఆట ముంగలే మర్నాడు మకాం. అప్పుడు సూడాల సినీమా ఒగ్గేయిగానే—ఇకసూస్కోమ్మీ ఉగాది పండగ ముంగల రాలిన మాఁమిడి పిందెల్లా—టపాటపా రాల్తాయి, పది పైసల కాసులూ ఇర్వై పైసల కాసులూ—మాగొప్పగ రాల్తాయిలే! మరిగంతే సంపూర్ణ రామాయినం, యెంకటేశ్వరమగత్యం యేసినారంతే —మరిసెప్పక! ముత్తేస్సరుడి కోయిల్ల నూరొరాల సెట్టు కింద పువ్వులు రాల్నట్టుగేలే. మరి అమ్మమాట, బుల్లెమ్మ—బుల్లోడు, పగబట్టినపడుసు వొచ్చియ్యంతే, వర్సంల వొడగల్లు గల్లుఁవన్నట్టే నా నేరుకోవాల, అంతే. సినీమా కతలన్నీ, సినీమా గుంటల కతలన్నీ మాయయ్యకి తెలుసుననుకో. అదిగందుకనే యియ్యాల జోతీకాడ, మాపటికి ఉత్కళకాడా, రేపిటికి యిజయముంగలా, మాన్నాటికి బుచ్చయ్యసెట్టి ఆటకాడా జెండా పాత్తాడన్నమాట. మాయయ్య రాలు గాయల్ల కడుగా యని నాను ముంగలే సెప్పినా. సినిమా యెట్టగున్నా ఆఁట ముంగలేటి—ఎండా కాలంల సినుకునాగ ఒకటీ రొండు ఒకొటి రొండు కాసులు సినుకుతాయి. అది గందుకే మొదటాట నుండి ఒగ్గేసిన జనాం యెల్లిపోయిన యేలకి మాయమ్మ అక్కడికొచ్చి మాకు రేతిరి కూడు ఎడద్ది—యేడేడి వొణ్ణం, యింత బిర్యానీ, కసిన్ని సల్లసుక్కలు, మాయమ్మ ఆకూడు యేలేసిముట్టదు. వొక్క మెతుకు నోట్లేసుకోదు. సల్లసుక్క తాగుద్ది అంతే. మాయమ్మదంత బేపనకూడు, మాటంత బాపన యేస, నాకొక్కపాలి అరతంకాక యేటంతున్నావమ్మా అనడిగితే, సల్లంగనవ్వి, నాఁతల్ల యేళ్ళ దూర్చి నన్ను వొల్లోకి తీసుకోని రొండుసేతుల్త రొండు బుగ్గలు నిఁవిరి ఆమాటల మరమాం సెప్పద్ది. ముగ్గురు తల్లుల్ల సేతిల మారినాగాని యీయమ్మ నాటి తల్లిని మరేజలముల సూడనంతే సూడనే—మాకు కూడెట్టిసి, రేతిరికి యేయింటి అరుగుమీద తొంగుంతఁవోమాం సెప్పినకబురు యినుకుని యెల్లిపోయేది అమ్మ. ఆకరాట సూస్కోని, మాంయెంపిక సేసుకున్న కాలీయింటి అరుగు సేరుకుంతం. అప్పుడు యయ్యడబ్బులు లెక్కజూసు కొంతడు మంచి యేడుపు సినీమాఏసినారంటే—పాపం పసోడు నాటిది—సిల్లర సింవాల చ్చేయనుకో, నాలుగు రోపాయిలకి దమ్మిడీ తక్కువ గాదను కొమ్మీ. మరి అమ్మోరి సంబరాఁవూరతాయాత్తరితే వొరాలసెట్టువొరాలు వొళ్లోవొంపి నట్టుగే ఐదూ, ఆర్రూపాయిలు కూడ జఁవ సేసుకున్న రోజులుంటయ్యంతనమ్మ! ఓపాలి—యేద్రోపాయిలుగూడ కల్లంట సూసిండు గుడ్డయ్య. ఐతే—ఆరోజు సంబరాలింక మొదలెట్టనేదన్నమాటే. తంబం యెత్తినుదేశచేరాయింటలన్నారు పూర్లు. మాం లగెత్తినాం. అమ్మోరు కొప్పు మీదె పువ్వొదేశబెరా కోడలి తలమీద గటంలోటకి యెగిరి పడిందట జనాం తిరగబడి పోర్రు గందా. అది సూసిన వోయమ్మ మాయయ్య సేతిల రోవయినోటడేసింది సిత్తు కాగితాఁవను కొందో కుంకాం పొట్లాం అనుకుందో యేటో యయ్య సటిక్కని నోటు గోసేసి దోపినాడుకో. ఆ రోజు మా గొప్పరోజులె మా యింటి కెల్లి డబ్బు లెక్కెట్టుకుని తొంగునేయేలకి మాయమ్మ అప్పిటికే తొంగు నుంతే తొంగు నుంతది నేకుంతే నేదు. అమ్మగనకుంతే అయ్యకాడ రోపియ్యన్న రొసూజ్జేస్తది. అమ్మబొడ్డుకోట దోపిన కొంగు ముడిప్పి

రోపిడేనోటు, ఏ బైపైసల కాసూ అక్కడ యెడద్ది. ఆమూడ్రు పిడేలెట్టి అయ్యకీనాకు రొండు పూట్ల బువ్వ బిర్యానీ సేఁప్పులుసు, మాముగ్గురికి గొల్లమజ్జిగ మరేమైందిఃఅయ్యదీ అమ్మది సెరిసంగోరు కానేదా? ఆలెక్కని అయ్యని అమ్ముంచుకుందో, అమ్మనే అయ్యుంచుకుందోనాకేఁటి అరతం కాకుంతుంది. యీ నాటిగూడ. నానకుంతనూ ఆల్లిద్దర్ని నానే వో కాడ సేర దీసిన్నేఁవో అని. ఐతే ఒక్క మాట సెప్పాలి. అమ్మ లేకుంతే నాకీ పెపంచం నేదనుకో. అది గొక్కటే మాట. కూడు కరుజు ఉమ్మడి యవ్వారం. మరి ఆరి కరుజులు ఆరియే. మా యయ్య గుడ్డ గుడుసులు టిపిసీ, బీడీ కట్టలు కారాకిల్లీ, సినీమా, గొంతుల సుక్కా జలసాకరుజులు అయ్యవే. మాయమ్మ కోకరైక—మాయమ్మ కరుజులు మాయమ్మయే. నాకు పక్కా, టిపినీ—మాయయ్యే యెట్టాల. అందుకియయ్య నా సేతిల పావలెట్టోనేదంతే—ముంగల సెప్పిన. గానా యిద్దరంకల్సి పకాలుచ్చుకుంతాం. మాయమ్మ అయ్యకి తెలియకంట నానిక్కరు జేబిల మరోపావల యెలుది "యేటేన కొనుక్కు తిన్రా నాయనా" అని—రోజు మద్దినేల్లకీ మాపిటికీ నానోరు ఓసన జూస్తది. బీడీకంపూ సిగరొట్టోసన యేత్తుందేఁవో అని అనుమానం యేసిందంతే అమర్నాటికి నాజేబిల పావలకాసు యెట్టదు. మాయమ్మ దొట్టి సత్తిగేలఁవే. నాన్నవ్వుకుంతను. రెంనెల్ల కోపాలి ఓనిక్కరు, ఓసొక్కాకొని యెదద్ది అయ్యేసుకోని సినీమా కెల్తాను.

(సశేషం)

బిక్కవోలు గ్రామం

(34 వ పేజీ నుండి)

ఇండ్లు. హరిజన నిర్వాసితులకొరకు నిర్మింపబడిన గృహ సముదాయము బిక్కవోలులో బలహీనవర్గముల సంక్షేమముకొరకు జరుగుచున్న కృషికి దర్పణము. హరిజన వాడలలో తీర్చిదిద్దిన వీధులు, వాటికి పెట్టిన పెద్దల పేర్లు గ్రామములో అడుగిడు ఆగంతకులకు ఒక ఆకర్షణ - అట్లే ఆగంతకులకు ఆశ్రయమిచ్చుటకు గ్రామమునందుగల ధర్మశాల మంచికి మరో నిదర్శనము. రాచవీధికి సిమ్మెంటు రోడ్డు, ప్రక్క వీధులకు పక్కా రోడ్లు, గ్రామాంతరము పోవుటకు పలు రహదార్లు ఇచ్చట పేర్కొన దగిన రహదారి సౌకర్యములు. జిల్లా ప్రధాన కేంద్రమైన కాకినాడకు వాణిజ్య కేంద్రమైన రాజమండ్రికి బిక్కవోలు నుండి బహుళ సంఖ్యలో బస్సులే కాదు, రైలు బండ్లు కూడా పోవుచుండును. రేయింబవళ్లు - కేవలం చలన చిత్రముల ప్రదర్శనకే గాక నృత్య నాటక ప్రదర్శనములకు కూడా వేదికగా ఉపయోగ పడుచున్న ఇచ్చటి చలనచిత్రప్రదర్శనశాల వినోద విజ్ఞాన కాలక్షేపములకు ఒక సాంస్కృతిక కేంద్రము. వాణిజ్య రంగములోకూడ వెనుకబడని బిక్కవోలులో వందలాది జనులకు జీవనోపాధి కల్పించుచున్న దొరపొగాకు శుద్ధి కర్మాగారము, సిగరెట్లు ఉత్పత్తి కర్మాగారము మూగజీవుల మనుగడకు నిరంతరం జరుగుచున్న సేవా కార్యక్రమములకు కేంద్రముగా నిలచినవి. గ్రామములో వెలసిన పశు వైద్య నిలయము — ప్రజారోగ్య రక్షణకు పంచాయతీ పాటుపడుచుండ, వ్యాధి నివారణకు, రోగ చికిత్సకు సమితి స్థానిక వైద్యాలయమందు జరుగుచున్న కృషి ప్రశంసనీయము. శాంతి భద్రతల పరిరక్షణకు గ్రామములోగల పోలీసు స్టేషను, క్రయవిక్రయములను, క్రమబద్ధముచేయుటకు ఏర్పడిన సబ్‌రిజిష్ట్రార్ ఆఫీసు, శాస్త్రీయ పద్ధతులలో ధాన్యం నిల్వచేయుటకు కేంద్ర ప్రభుత్వము ఇచ్చట కట్టించిన గిడ్డంగులు సామాన్యముగ పల్లె ప్రాంతములు నోచుకోని అదనపు సౌకర్యములు.

అలనాటి వేంగి ప్రభువుల ప్రభావము వల్లను, పిమ్మట పెద్దాపురం సంస్థానాధీశుల సుహృద్భావము వల్లను సముజ్వలముగ వెలుగొంది, నేడు ప్రజాస్వామ్యములో బహుముఖముగ అభివృద్ధి చెందుతున్నది బిక్కవోలు గ్రామము.

కలియుగ భీమ

కోడి రామమూర్తి

—— శ్రీ వి. యల్. సుందరరావు ——

ఒకనాడు ఆంధ్రదేశంలో ఉన్న వ్యాయామక్రీడలు, ఆటల పోటీలు పహిల్వానులు, వారి తాలింఖానాలు మరెచ్చటను ఉండేవి కావు. ఇవన్నీ స్థానిక ప్రజల ఆదరణతో పోషింపబడేవి. అనేక మంది యువకులు ఎంతో అభిలాషతో శరీరసంపదను పోషించుకొంటూ వృద్ధిపరచుకొంటూ ఉండేవారు. ఈనాడు స్వరాజ్యం వచ్చాక ప్రభుత్వ ప్రోత్సాహంతో ధనసహాయంతో క్రీడారంగాన్ని ప్రోత్సహించి, హెచ్చుమంది విద్యార్థులకు అవకాశం కల్పించుచున్నారు. కాని ఈనాటి యువతరానికి శరీరవ్యాయామంపై శ్రద్ధ సన్నగిల్లినమాట యదార్థం.

మన వ్యాయామం, మన తాలింఖానాలు మనమే మరచిపోయాం. మన పహిల్వానులు మనకు జ్ఞప్తి లేరు. తన బల ప్రదర్శనలద్వారా – మల్ల యుద్ధపునేర్పుద్వారా, యావత్ప్రపంచాన్ని దద్దరిల్లజేసిన "కలియుగ భీమ" కోడిరామమూర్తి నాయుడిగారి జీవితవిశేషాలు నేటి యువకులకు ఎవరు చెప్పారు ? ఎంతమందికి తెలుసు ? తన విలువిద్య నైపుణిలో యావద్భారతావనిలో సెభాష్ అనిపించుకొన్న "కలియుగ అర్జున" గుండవరపు వెంకట అప్పారావుగారి పేరు ఎంతమందికి తెలుసు? ఎక్కడ గ్రంథస్థం చేశారు ? తమ బలప్రదర్శనలో, విద్యలో సాటిలేని ప్రతిభావంతులేకాక, ఆంధ్ర మాతకన్న మేటి దేశభక్తులని, త్యాగులని, విప్లవ వీరులని ఆంధ్ర మాత కీర్తిని ప్రపంచ పటంపై ఎక్కించిన మహా ప్రతిభాశాలురని ఎంత మందికి తెలుసు ? ఏకలవ్యునిమాదిరి యిరువురూ స్వయం ప్రభావంగల విద్యనభ్యసించారు.

మన చరిత్రను మనం చెప్పుకోవటం న్యూనతగా లెక్కించుకొనరాదు మన తెలుగుజాతి. ఈ కారణంగా తీరని అపకారం జరుగుతుంది. మన పూర్వీకులు వారు సాధించిన ఘనకార్యాలు ఉగ్గుపాలతో పిల్లలకు చెప్పనిదే వారిలో ఉత్సాహము, కౌతుకం జనించవు. రక్తనాళాలలో జీర్ణించుకొన్న స్వజాతి చరిత్ర కలిగించే చైతన్యంతో సాటి మరొకటి లేదు వంగ రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో చిన్న చిన్న పాఠాలు పద్యరూపంలో వారి పెద్దల చరిత్ర బాలబాలికలకు నూరిపోస్తారు.

ప్రపంచంలో గొప్ప కవి ఎవరు ? విశ్వకవి రవీంద్రుడు
ప్రపంచంలో గొప్ప శాస్త్రజ్ఞుడెవరు ? జె. సి. బోస్.
ప్రపంచంలో గొప్ప విద్యావేత్త ఎవరు ? అశుతోష్‌ముఖర్జీ.
ప్రపంచంలో గొప్ప సంఘసంస్కర్త ఎవరు ?
బిపిన్ చంద్రపాల్.

ఈ విధంగా వీరికి ప్రాథమిక పాఠాలు ఉంటవి.

శ్రీ కోడిరామమూర్తి నాయుడుగారి గురించి, బాల్యంలో అనేకమంది పెద్దలు చెబుతుంటే విన్నాం. వారు సర్కసులో పని చేసినవారు. వ్యక్తిగతంగా వారిని ఎఱిగిన అనేకుల ముఖతః విన్నాను. వారు 1930 కి ముందే సర్కసును విరమించిన కారణంగా వారి బలప్రదర్శన నేరుగా దర్శించే అవకాశం లేకపోయింది. 1925 లో బాపట్లలో వారు ప్రదర్శన ఇచ్చినపుడు ఏడు సం॥ల బాలుడిగా చూశాను. విచక్షణా జ్ఞానం లేకపోయినా ఒక దఫా దర్శించగల్గాననే సంతృప్తి మాత్రం ఉంది.

కాని "కలియుగార్జున" అప్పారావుగారితో స్వయంగా పరిచయం వారితో అనేక విషయాలు ముచ్చటించడం, 1936, 1937 సం॥ లలో మా హైస్కూలుకు స్వయంగా ఆహ్వానించి వారి ప్రదర్శన ఏర్పాటుచేశాను. వారి గ్రామం ఒకటి రెండు సార్లు వెళ్ళి వచ్చాను.

శ్రీ కోడిరామమూర్తి నాయుడుగారు 1885 సం. లో శ్రీకాకుళం జిల్లాలోని వీరఘట్టంలో జన్మించారు. తండ్రి వెంకన్నగారు. వీరి సోదరుడు కోడి నారాయణస్వామి విజయనగరంలో పోలీసు ఇన్‌స్పెక్టరుగా పనిచేస్తుంటే చదువుకై అక్కడ చేరారు.

మరి ఏగాలి వీచిందో – విప్లవ వీరుడు అల్లూరి సీతారామ రాజుకు బాల్యంలో పాఠాలు నేర్పిన తునిగడ్డకు చేరాడు. తనకు వ్యాయామంలోగల శ్రద్ధ అభ్యాసం విద్యార్థి దశలోనే ఎందరినో ఆకర్షించింది. విద్యార్థులలో ప్రత్యేక విద్యగలవారు నాలుగు

స్కూళ్ళకు వెళ్ళి వారి విద్యను ప్రదర్శించటం ఆకాలంలో హెచ్చు ఆచారంగా ఉండేది విద్యార్థులు చందాలు వసూలుచేసి వారికి సహాయము చేస్తూఉండేవారు. 1903 లో తుని రాజాగారు వీరికి ఒక టెంటు, సర్కసు సామాన్లు అన్ని హంగులు ఏర్పాటు చేసినారు అప్పటినుండి తన సర్కసు పేరు ప్రతిష్ఠలు సంపాదించుటకు ఆర్థిక స్తోమత ఏర్పడినది కసరత్తులో సాటిలేని మేటిగా తాను క్రమక్రమంగా పేరుగాంచుతూ వచ్చారు ఆంధ్ర దేశమేగాక ఇతర రాష్ట్రములకుకూడ వెళ్ళి ఎన్నో ప్రదర్శనలు ఇవ్వసాగారు.

1905 లో పూనాలో జరిగిన ప్రదర్శనకు బాలగంగాధర తిలక్ అధ్యక్షత వహించారు. మహారాష్ట్ర పీష్వాల కోటలో ఈ ప్రదర్శన జరిగినది. "లోగడ పీశ్వాలు సంవత్సరమునకొక పర్యాయము ఇటువంటి మల్లయోధుల మధ్య పోటీలు నడిపించి ఇచ్చటనే ఘనంగా సన్మానించేవారు అటువంటి పీష్వాలు, ఈనాడు శ్రీ కోడి రామమూర్తి నాయుడిగారి సర్కసులో శాండో ఫీట్సు తిలకించిన ఎంత ఆనందపడి ఉండేవారో ? ఎంత ఘనమైన సత్కారము చేసి ఉండేవారు ? "నా బోటి సామాన్యుడేమి చేయ గలడు" అని ఆనాడు తిలక్ మహాశయుడు ఆయన గొప్పతనాన్ని ముచ్చటించారు. "మల్ల మార్తాండ" అను బిరుదు నిచ్చారు. రామమూర్తి నాయుడుగారు హిందీలో మంచి వక్త. వ్యాయామముచేసి దేహబలము సంపాదించుట ప్రతివాని కర్తవ్యమని బోధించెడివారు. ఈయన ఉపన్యాసములను మహారాష్ట్రములో అనేకచోట్ల తిలక్ మహాశయుడు ఏర్పాటు చేయించాడు

1907 లో సూరత్ లో జరిగిన అఖిలభారత కాంగ్రెసు మహాసభలకు రామమూర్తి నాయుడుగారు రూ 1116 లు ఇచ్చి ప్రథమ వరుసలో కూర్చొని యుండిరి. పెద్ద రుసుము చెల్లించిన వారిని అపుడు కాంగ్రెసుసభలలో అట్లే సత్కరించుచుండిరి ఇట్లు అనేక సభలకు ఈయన హాజరయ్యెడివాడు. సూరత్ మహాసభలో చూసి నాయుడుగారిని సాయంత్రం రావలదని తిలక్ గారు ఆయనను వారించిరి. "ఇచట రాజకీయకార్యక్రమములు శృతి మించనున్నాయి. మీరు ఉన్నయెడల నన్నెవరైనను విమర్శించిన మీరు సహించలేరు. చివరకు పరిస్థితులు విషమించగలవని" చెప్పిరి ఆయనమానుకొనిరి

నాయుడుగారి సర్కసు ఆ తదనంతరం చాలానష్టములకు గురిఅయింది. వర్షములు ఆరంభమైనవి. పరివారకులు, జంతువుల పోషణము ఇబ్బంది యయ్యెను అప్పుడు తిలక్ తన కార్యదర్శిని ఆయనసర్కస్ మేనేజరుగా నియమించి పెత్తనము చేయించిరి. కొంతకాలములో తిరిగి యథాస్థితికి చేరగలిగెను

శాండో ఫీట్సు

నాయుడుగారు ఏనుగును ఛాతీపై ఎక్కించుకొని మాట్లాడెదరు 2 మోటారు బండ్లను తాళ్ళతో తనరెండు జబ్బలకు కట్టించుకొని ఆబండ్లనసాగనిచ్చి వాటివేగమును స్థంభింపజేసెడివారు. పెద్దరాతిబండను ఛాతీపై నిడుకొని సమ్మెటలచేకొట్టించు కొనెడివారు 5 పౌన్ల ఇనపగొలుసును ఛాతికి చుట్టి ప్రాణాయామము చేసి రొమ్మునుబిగించి త్రెంపెడి వారు. కోడిగుడ్డును వ్రేళ్ళమధ్య నిడి పగులగొట్టెడివారు గడపలుగులు వంచుట ఇటువంటి వెన్నో నాయుడుగారు స్వయముగా చేసెడివారు ఈయనచేసిన శాండో ఫీట్సు మరెవ్వరును చేసి ఉండలేదు ఆయనను మల్లయుద్ధములో ప్రపంచములో ఎవ్వరునుపోటీ చేయ లేకుండిరి

ప్రపంచమల్లయుద్ధ పహిల్వాన్ రూపొందిన గామా ఆయన సోదరుడు ఇమామ్ బక్ష్, అర్జునసింగ్ మొ॥ వారు ఆయన సర్కసులో పహిల్వాన్లుగా నుండి ఆయనదగ్గర విద్యనేర్చినవారే; ఆయన సర్కసులో అనేక విద్యలలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వారిని పోషించెడివాడు ఆయన సర్కస్ ఎక్కడకు బయలుదేరినా ప్రత్యేక రైలులోనే ప్రయాణము గావించుచుండెను

ఆయన దానములు చేసినంత ధారాళంగా మరెవ్వరునుచేసి ఉండలేదు ఎక్కడున్నా వ్యాయామానంతరము ఉచితముగా అందరికీ దర్శన మిచ్చెడివారు స్థానిక సంస్థలకు బీదవిద్యార్థులకు తాలింఖానాల వారికి పరివిగా విరాళములు ఇచ్చెడివారు రాత్రి సర్కసులో వచ్చిన ఆదాయంలో హెచ్చుభాగము ఉదయం విరాళములుగా ఆపట్టణము లోనే పంచి పెట్టెడివారు.

అయన జీవితంలో యీ విధంగా విరాళములుగా యిచ్చిన మొత్తము ఒక కోటి రూపాయలు ఉండ వచ్చునని ఆయన సర్కసులో తిరిగిన పెద్దలు చెప్పెడి వారు ఆయన సర్కసులో తిరిగి ఆయనకు చాలా సన్నిహితులుగా ఉండిన స్వర్గీయ భట్టిప్రోలు సూర్యప్రకాశరావుగారు శ్రీశిష్టా సాక్షి సోమయాజులుగారు మాకు అనేక విషయాలు చెబుతూ ఉండే వారు.

శ్రీనాయుడుగారికి "వీరకంఠీరవ", "కలియుగభీమ" అనే బిరుదులు ఉండెడివి. హైదరాబాదులో శ్రీకృష్ణదేవరాయా ఆంధ్ర భాషా నిలయపు అధికారులు "జగదేకవీర"అను బిరుదు, వంగ రాష్ట్రములో "మల్లరాజ తిలక" అను బిరుదము ఇచ్చిరి.

1912 వ సంవత్సరమున అయన సర్కసుతో ఇంగ్లండు వెళ్ళిరి మద్రాసులోని బెంజిమన్ అను ఆంగ్లేయుడు ఈయనకు సహాయము చేసినారు వరుసగా అన్ని దేశములలో ప్రదర్శనలు ఇచ్చుకుంటూ మన్ననలు, సత్కారములు, బాగడ్తలు అందుకుంటూ లండన్ చేరిరి. బానిస దేశస్తుడైన కోడి రామమూర్తినాయుడు గారికి ఇంతటి ప్రపంచ ప్రఖ్యాత వీరునిగా ఈ పిన్నవయస్సులో వచ్చిన ఖ్యాతి ప్రతిభలనుచూసి ఆంగ్లేయులు, యూరప్ దేశస్థులు ఎంతగానో నామోషీబడుచుండిరి.

ప్రతిచోటా మల్లయుద్ధమునకు సవాలుచేయుచుండిరి తన సర్కసులో ఉన్న సబ్బురు పహిల్వానులకు సాటి ఎవరూ లేకుండిరి. నాయుడుగారిని పంతానికి లండన్ లో, పారిస్ లో సవాలు చేసిరి. తన ఒక గుద్దుకు మాకు కుస్తి వద్దని అచటి మల్లయోధులు తాలింఖానా వదలి పరుగిడజొచ్చిరి.

ఈయనను తీసికొని వెళ్ళిన బెంజిమన్ దొరగారు పైకం కాజేసి మధ్యలో మోసగించిరి. ఈయన పాడియావుగనుక ఆ లోపము సర్దుబాటు చేసికొని 1914 లో భారత దేశము చేరగలిగినారు.

లండనులో ఐదవజార్జి గొప్ప సన్మానముచేసి ఒక బంగారు పతకమును బహూకరించినారు "నేను సామ్రాజ్యానికి ప్రభువునైతే నీవు బలప్రదర్శనకు ప్రభువు" వని ఆయనను పొగిడినారు. ఇటువంటి రాజసత్కారానికి బానిస పౌరుడు అర్హుడా? అని మాట్లాడి తదనంతరం లండన్ పార్లమెంటు లోని సభ్యులు వారి కొంచెబుద్ధిని ఈర్ష్యను ప్రకటించినారు.


లండనునుండి 1914లో నేరుగా విజయనగరం వచ్చి మహారాజావారి సహాయంతో తన సర్కసును సర్వసుందరంగా తిరిగి అమర్చుకొన్నారు. పది సంవత్సరముల పాటు భారత దేశంలోని నలు మూలలా విజయయాత్రలు చేశారు. ఆయన ప్రదర్శనమే మహాభాగ్యంగా భారత ప్రజలు ఎదురుచూశారు. ఆయన తర్ఫీదు ఇచ్చిన గామా, ఇమాంబక్ష్ సోదరులు ప్రపంచ ప్రఖ్యాత మల్లయోధులుగా రూపొందారు. నాయుడుగారి దేశభక్తిపూరిత ఉపన్యాసాలు, వ్యాయామ పద్ధతులపై ఆసక్తి కలిగించే ఆ వాక్కులు, లేదనకుండా దానంచేసే ఆ హృదయం ఆబాలగోపాలాన్ని స్పందింపజేసినవి.

యావత్ప్రపంచాన్ని జయించిన "కలియుగభీమ" ప్రొఫెసర్ కోడిరామమూర్తి నాయుడుగారి లాంటి భారతీయుడు ఇంతలో జన్మించడు అనుకొన్నారు. ఇంతకు ముందుగాని తరువాత గాని లేదు అనిపించారు. ఆంధ్రులు సర్వకాలాలు చెప్పుకొని గర్వపడుటకు కారకులయ్యారు.

తెలుగుతల్లికి నా అంజలి

భక్తవత్సలుండగు శ్రీరామ భద్రుమహిమను
బంగారు తెలుగులో త్యాగయ్య భజనజేసె.
మలెపువ్వు చిందు దివ్య పరిమళంబు వోలె,
మొల్ల అల్లెను మహిమాన్విత రామకథను.
వేద వేదాంతములు ఘోషించు పద్యముల
వేయి విధంబుగ నుడివె యోగి వేమన్న.
కమనీయ తెలుగులో కళ్యాణ గీతికల
కవి కోకిలంబులు కలిసిపాడు.
రమణీయ తెలుగులో రంగారు కవితలు
కమల భావురాణి పాదంబుల కౌగిలించు.
మహనీయ తెలుగులో మహోన్నతముగ విరియు
మంజుల మనోజ్ఞ భావ సుమమాలలు.
శోభనీయమగు సౌభాగ్యనగరంబున
శృంగార మందహాసముచేయు తెలుగుమాత,
తెలుగువారిమాటలు రతనాలమూటలు
తెలుగువారి పాటలు తేనెలూరు ఊటలు
తెలుగువారి సంస్కృతి తేజరిల్లు దివ్యజ్యోతి
తెలుగువారి హృదయము ప్రేమసుధాకలశము

శ్రీమతి మీనాక్షి పొన్నుదొరై.



కొత్త సీరియల్
శ్రీమతి సి. ఆనందారామం గారి
సాంఘిక నవల
ఆగస్టు 1975 సంచిక నుండి

మహాభారతము

శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

87

ఆ మాటలు విని సూర్యుడిట్లనెను :—

"కర్ణా ! నీకు, నీ మిత్రులకు, నీ పుత్రులకు, నీ పత్నులకు, తల్లిదండ్రులకు అహితమైన కార్యమును నీవు చేయకుము. నాయనా ! తమ శరీర రక్షణమును చేసికొనుచునే, ప్రాణులు ఈ లోకమునందు యశస్సును సంపాదించి స్వర్గలోకమునందు స్థిరమైన కీర్తిని సంపాదించవలెను. నీవు ప్రాణములను నశింపజేసికొని, శాశ్వతమైన కీర్తిని సంపాదింపదలచినచో, అట్టి కీర్తి నీ ప్రాణములను హరించి తీసికొనిపోవును. ఇందులో సంశయములేదు పురుషరత్నమా ! తల్లిదండ్రులు, పుత్రులు, బంధువులు, సోదరులు, వీరందరుగూడ, జీవించియున్న పురుషుల వలననే ఈ లోకమునందు తమ ప్రయోజనసిద్ధిని బడసెదరు. రాజులుగూడ, జీవించియుండియే తమ పురుషార్థము ద్వారా కీర్తిని సంపాదించెదరు. జీవించియున్న పురుషుని కొరకే కీర్తి సంపాదనము అవసరమని నీవు బాగుగా తెలిసికొనుము.

"మరణించినవానికిని, చితాగ్నియందు బూడిదయైన శరీరము గలవానికిని కీర్తితో నేమి ప్రయోజనము కలుగును ? మరణించిన వానికి కీర్తి విషయమై యేమియు తెలియదు జీవించిన పురుషుడే కీర్తివలన కలిగిన సుఖమును పొందగలడు. మరణించినవాని కీర్తి, మృతుని కంఠమునందు అలంకరించబడిన పుష్పమాలిక వంటిది. నీవు నాకు భక్తుడవు. నా భక్తులను రక్షించుట నా కర్తవ్యమయినందుచేత నీకు హితమును బోధించుచున్నాను. 'ఇతడు నా భక్తుడు, పరమ భక్తిభావముతో నన్ను సేవించుచున్నాడు' అని తలచియే, నా మనస్సునందు నీయెడల స్నేహభావము కలిగినది. నీవు నా యాజ్ఞను పాలించుము.

"ఈ విషయమునందు దేవనిర్మితమైన యొక ఆధ్యాత్మిక రహస్యము కలదు ఈ కారణముచేతనే, 'నేను నీకు సూచించిన కార్యమును నిస్సంకోచముగా చేయుము' అని నీకు చెప్పుచున్నాను. పురుషశ్రేష్ఠా ! దేవరహస్యమును తెలిసికొనుటకు నీకు సాధ్యము కాదు. అందుచేత ఆ రహస్యమును నీకు చెప్పను. సమయము వచ్చినపుడు నీవే తెలిసికొనగలవు. రాధాకుమారా ! నీకు మరల చెప్పుచున్నాను వినుము ఇంద్రుడువచ్చి నీ కుండలములను యాచించినప్పుడు అతనికి ఈయకుము. ప్రకాశించుచున్న ఈ కుండలములచేత నీవు స్వచ్ఛమైన యాకాశమునందు రెండు విశాఖా నక్షత్రముల నడుమ ప్రకాశించుచున్న చంద్రునివలె, శోభిల్లుచున్నావు. 'జీవించియున్న పురుషునకే కీర్తి శోభించును' అని నీవు తెలిసికొనుము కనుక నాయనా ! కుండలార్థియై వచ్చిన యింద్రుని నిరాకరించుము ఇంద్రుని యొక్క కుండలాపహరణేచ్ఛను నీవు అనేక విధములైన యుక్తియుక్త వచనములచేత నష్టము చేయుము సకారణములు, ఉపపత్తి సహితములు, మాధుర్యరసభూషితములునైన మాటలచేత నీవు ఇంద్రుని యొక్క కుండల గ్రహణ బుద్ధిని మాన్పింపుము

"పురుష శ్రేష్ఠా ! నీవు సర్వదా అర్జునునితో స్పర్థపడుచుందువు, కనుక శూరుడైన అర్జునునితో నీకు ఎప్పుడైనను ఎదుర్కొన వలసి వచ్చును. అర్జునునకు ఇంద్రునంతటి వాడు హితుడుగా నున్నప్పటికిని, అతడు, కుండలములతో గూడియున్న నిన్ను యుద్ధమునందు జయించజాలడు. కర్ణా ! యుద్ధమునందు అర్జునుని నీవు జయించగోరినయెడల, ఈ నీ కుండలములను ఇంద్రునకు ఈయ గూడదు" ఆ మాటలను విని కర్ణుడిట్లనెను .—

"సూర్యదేవా ! నీకు నేను భక్తుడనని యెరుగుదువు నేను ఈయదగనిదేదియు లేదని కూడ నీకు తెలియును నాకు, దార-పుత్ర-మిత్ర-శరీరాదులేవియు నీకంటే ప్రియములుకావు నీకు నేను అనన్యభక్తుడను మహాత్ములు తమ భక్తుల యెడల పరిపూర్ణ ప్రేమగలవారని నీవెరుగుదువు. 'నాకు కర్ణుడు ఇష్టుడు, భక్తుడు, అతడు నన్ను వినా యితర దేవతల నెవరిని ఆరాధించడు' అనియే నీవు నాకు హితమును ఉపదేశించుచున్నావు. నీకు ప్రణామము చేయుచు నన్ను క్షమించుమని మాటిమాటికి ప్రార్థించుచున్నాను అసత్యము వలన నేను భయపడినంతగా మృత్యువువలన గూడ భయపడను, సత్పురుషులైన బ్రాహ్మణులందరికిని, వారు కోరినప్పుడు నా జీవితమును ఇచ్చుటకు సయితము నేనెప్పుడును విచారపడను.

" దేవా ! అర్జునుని వలన నాకు భయము కలుగవచ్చునని నీ వంటివి. ఆ విషయమునందు నీవు ఏ మాత్రము దుఃఖపడకుము కార్తవీర్యార్జునునితో సమానబలపరాక్రమములు కలిగిన యర్జునుని యుద్ధమునందు తప్పక నేను జయించగలను, పరశురాముని నుండి, ద్రోణాచార్యుల నుండి సంపాదించిన నాయస్త్రబలమును గూడ నీ వెరిగి యున్నావు సురశ్రేష్ఠా ! నన్ను యాచించిన ఇంద్రునకు నా జీవితమునైనను ఇచ్చుటకు నాకు అనుజ్ఞ నిమ్ము." ఆ మాటలు విని సూర్యుడు కర్ణునితో నిట్లనెను :—

" నాయనా ! ఒకవేళ నీ వీ కుండలములను ఇంద్రునకు ఇచ్చినప్పటికిని, నీవుగూడ నీ విజయార్థమై యింద్రుని నేదైన అస్త్రమును అడిగి తీసికొనుము 'దేవరాజా ! ఒక ఒడంబడికపైన ఈ కుండలములను నీకు ఇవ్వగలను' అని నీవు అతనికి స్పష్టముగా చెప్పవలెను కుండలములతో గూడిన నీవు ప్రాణుల కందరికి అవధ్యుడవుగా నుందువు. వత్సా ! నీవు అర్జునునిచేత నశించవలెనని కోరుచు నీ కుండలములను అపహరించుటకు నీ వద్దకు వచ్చుచున్నాడు కనుక నీవు మంచిమాటలతో నింద్రుని ఆరాధించి ఒక యమోఘమైన అస్త్రమును కోరుకొనుము. " దేవరాజా ! శత్రుసంహారకమై, అమోఘమైన 'శక్తి 'ఆయుధమును నాకు ఇమ్ము. నీకు నేను కవచకుండలములను ఇచ్చెదను. అని ఒడంబడిక చేసుకొనియే నీవు ఇంద్రునకు కవచకుండలములను ఇమ్ము. ఆ 'శక్తి' చేత నీవు యుద్ధమునందు శత్రువులను సంహరించగలవు దేవేంద్రుని 'శక్తి' యాయుధము యుద్ధమునందు నూర్ల కొలది, వేల కొలది శత్రువులను చంపక తిరిగి నీ చేతికి రాదు. అంతటి ప్రబలమైన యాయుధమది.

జనమేజయ మహారాజా! సూర్యుడు ఈ విధముగా కర్ణునకు బోధించి అంతర్ధానము చెందెను స్వప్నాంతమునందు కర్ణుడు ఆమాటలనే పలుకుచు మేల్కొనెను. మేల్కొనిన తరువాత కర్ణుడు స్వప్న వృత్తాంతమును చింతించుచు 'ఇంద్రుడు కుండలములను యాచించుటకై నా వద్దకు వచ్చినప్పుడు నేను గూడ అతనిని 'శక్తి' యాయుధమును కోరెదను, అని నిశ్చయించు కొనెను ప్రాతఃకాలమునందు కర్ణుడు ఆహ్నికకృత్యములను నెరవేర్చి సూర్య జపమును చేసెను జపాంతమునందు సూర్య భగవానుని మనస్సునందు సన్నిహితుని చేసికొని స్వప్నమున జరిగిన వృత్తాంతము నంతయు నాదేవునకు నివేదించెను అది విని సూర్యుడు నవ్వుచు నీవు స్వప్నమునందు కనుగొన్నదంతయు సత్యమే యని చెప్పెను అప్పుడు కర్ణుడు 'తన స్వప్నకథ సత్యమే యని నిశ్చయించుకొని, 'శక్తి'ని కోరుటకుగాను, ఇంద్రునకై యెదిరి చూచుచుండెను

ఇట్లు వైశంపాయన మహాముని చెప్పగా విని జనమేజయుడిట్లు ఆ మునిని అడిగెను:—

కుంతి దుర్వాసుని సేవించుట

"వైశంపాయన మహామునీ! సూర్యభగవానుడు కర్ణునకు చెప్పదగినట్టి యా రహస్యమేమి? కర్ణుని కవచకుండలములెటు వంటివి? అవి యతనికెక్కడినుండి వచ్చెను? దయయుంచి చెప్పుము" అని యడిగిన జనమేజయునకు వైశంపాయనుడిట్లు చెప్పెను:—

"రాజా! పూర్వము ఒకనాడు కుంతి భోజమహారాజు సభాస్థానమునకు, ఆజానుబాహు విగ్రహము, ప్రచండ తేజస్సు, గలిగి గడ్డము, మీసములు, జటలు, ధరించి యొక బ్రాహ్మణుడు వచ్చెను అతడు మిగులఉదారమైన ఆకృతి గలిగి దర్శనీయుడుగ నుండెను నిర్దోషములైన అవయములు, జ్వలించుచున్న తేజస్సు, తేనె వర్ణముగల శరీరకాంతి, తపస్సు, స్వాధ్యాయము మొదలైన సద్గుణములు గలిగి మధురముగా మాట్లాడుచుండెను. మహాతపస్సంపన్నుడైన బ్రాహ్మణుడు కుంతిభోజునితో నిట్లనెను:—

"రాజా! భోజనము చేయుటకు మీయింటిలో భిక్షార్థినై వచ్చినాను కొన్నాళ్లు మీ యింటనే వుండగోరుచున్నాను. కాని, ఒక నిబంధన ఉన్నది—మీ యింట నున్నప్పుడు నా మనస్సునకు ప్రతికూలముగా నీవుగాని, నీ యనుచరులుగాని ఆచరించ గూడదు. ఇది నీకు ఇష్టమైనచో నేను మీ యింటియందు ఉండెదను. ఇంతయే కాక, నా యిష్టం వచ్చినప్పుడు పోవుచుందును వచ్చుచుందును. నాశయ్యపైన గాని ఆసనమునందు గాని యెవరు గూడ కూర్చొనగూడదు " ఆ మాటలువిని కుంతి భోజుడు మిగుల సంప్రీతితో 'అట్లే యగు గాక, యని చెప్పి యాబ్రాహ్మణునితో మరల ఇట్లనెను.

"మహాత్మా ! మిగుల యశస్సంపన్నురాలు, మంచిస్వభావము—నడవడిక గలదియు, నియమనిష్ఠలు గలదియునగు 'పృథ' యను నా కూతురు ఉన్నది మీసేవా పూజలకై యామె మీ సన్నిధిలో నుండ గలదు ఆమె వలన మీకు ఎప్పుడు గూడ ఏలాటి యిబ్బంది కలుగదు ఆమె ప్రవర్తన మీకు సంతుష్టి కలిగించ గలదు."

ఇట్లుచెప్పి కుంతి భోజుడు ఆ బ్రాహ్మణుని యథావిధిగా పూజించి తన కూతురు పృథ వద్దకు పోయి ఆమెతో నిట్లనెను.

"బిడ్డా ! ఈ బ్రాహ్మణుడు మనయింటి యందు నివసింప గోరుచున్నాడు, నేను దానికి, నీయందు విశ్వాసముంచి యంగీకరించితిని, కనుక నీవీ బ్రాహ్మణుని ఆరాధించు చుండవలెను. ఈయన, మహాతపశ్శాలి, నైష్ఠికుడు. ఈవిప్రుడు నిన్ను ఏమి అడిగినను. విసుగులేకుండ ఇచ్చుచుండ వలెను. ఎందుకనగా, లోకమునందు బ్రాహ్మణుడే ఉత్తమ తేజస్స్వరూపుడు పరమతస్వరూపుడు ప్రతి దినము బ్రాహ్మణులు చేయు నమస్కారముల చేతనే సూర్యుడు ఆకాశమునందు విరాజిల్లుచున్నాడు. మాననీయులైన బ్రాహ్మణులను సన్మానించ నందువలన పూర్వము వాతాపి దానవుడు మరియు 'తాళజంఘు' డను వాడు 'బ్రహ్మదండము' (బ్రాహ్మణుల శాపరూపమైన దండము(శిక్ష) చేత చంపబడిరి. బిడ్డా ! నీపైన ఈ పెద్ద బరువు మోపబడినది కనుక నీవు సర్వదాయేమరపాటు లేక యీ బ్రాహ్మణుని నియమ పూర్వకముగా నారాధించుము

"పుత్రీ! నీకు బాల్యము నుండియే యేకాగ్ర చిత్తముకలదు. సమస్త బ్రాహ్మణులు, గురుజనులు, బంధువులు సేవకులు, మిత్రులు, తల్లులు, నేను ఈ యందరియెడల నీవు సర్వదావారి వారికి తగిన రీతిగా మెలగుచు వచ్చినావు నీవు నీ సద్భావముచేత అందరిని ప్రభావితులను జేసినావు. మన పురమునందు గాని, అంతఃపురము నందుగాని నీయెడల అసంతుష్టులుగా ఎవరూను లేరు అయినప్పటి కిని నీవు బాలికవని, నాకుమాత్రేవని, అత్యంత కోపశీలుడైన యీ బ్రాహ్మణుని యెడల నీ ప్రవర్తన విషయమై నీకు ఉపదేశించ వలసిన ఆవశ్యకత కలిగినది.

"పుత్రీ! వృష్ణి వంశమునందు నీవు శూరసేనునకు ప్రియ పుత్రివిగా జన్మించితివి పూర్వము నీ తండ్రి మిక్కిలిసంతోషముతో నాకు పుత్రిగా నిన్ను సమర్పించినాడు నీవు వసుదేవునకు సోదరివి. నా సంతానమునందు నీవు జేష్ఠురాలవు నీ తండ్రి శూరసేనుడు, తన ప్రథమ సంతానమును నాకు ఇచ్చెదనని ప్రతిజ్ఞ చేసియుండెను. ఆ ప్రకారమే యతడు, నీవు పుట్టగనే నా యొడియందు ఇచ్చెను. అందుచేత నీవు నా దత్తపుత్రివి అట్టి ప్రశస్తమైన కులమునందు పుట్టి అటువంటి కులమునకే వచ్చితివి ఒక సుఖమునుండి మరి యొక సుఖమునకు, జలధార ఒక కొలనునుండి మరియొక కొలనుకు ప్రవహించునట్లుగా, వచ్చితివి దుష్కులమునందు పుట్టిన స్త్రీలు, ఏదో యొక ఆగ్రహమునకు లోనై అవివేకముతో తరచుగా చెడిపోవుచుందురు నీవు అటువంటి దానవుకావు కనుక చెప్పుచున్నాను నీవు అత్యంత రూపవతివి రాజకుమారివి సత్స్వభావము, సదాచారము గల దానవు కనుక గర్వము, దర్పము, అభిమానము, అహంకారము, ఇవన్నియు విడిచి వరదాయకుడైన బ్రాహ్మణుని ఆరాధించి సకల శ్రేయస్సులను పొందుము. ఈ విధముగా నీవు మెలగినచో సకల కల్యాణములను పొందగలవు ఈ బ్రాహ్మణోత్తముడు కోపించిన యెడల నా కులమంతయు దహించిపోవును." ఇట్లు కుంతి భోజుడు చెప్పిన మాటలు విని, కుంతి యిట్లనెను:—

"తండ్రీ! నేను సకల నియమములను పాటించుచు ఈ బ్రాహ్మణుని పూజించి సేవించెదనని ప్రతిజ్ఞ చేయుచున్నాను. అసత్యము లాడుటలేదు బ్రాహ్మణులను పూజించుటయే నా స్వభావము అదియే ప్రీతికరమైన కార్యము, పరమ శ్రేయస్కరమని నేను తలచెదను ఆయన యొకవేళ, సాయంకాలమునందు గాని, ప్రాతఃకాలమునందు గాని, రాత్రియందు గాని, అర్ధరాత్రము నందుగాని వచ్చినప్పటికిని, ఆయనకు కోపము కలుగునట్లుగా నేను ఎంతమాత్రము మెలగను. బ్రాహ్మణులను పూజించుటవలన నాకు లాభమే కలుగును నీ యాజ్ఞానుసారము మెలగుచు హితమును నీకు చేకూర్చెదను రాజేంద్రా! నాపైన విశ్వాసముంచుము. మీ యింటిలో నివసించుచున్న యీ బ్రాహ్మణోత్తముని మనస్సునకు ప్రతికూలమైన కార్యమేదియు జరుగదని నమ్ముము. ఈయనకు ప్రియమైనది, నీకు హితమైనదియు నగు కార్యమును చేయుటకు జాగ్రత్తతో ప్రయత్నించెదను నీ మానసిక చింత యిక విడువుము.

"బ్రాహ్మణులు మహానుభావులు కనుక వారిని పూజించినచో మనను తరింపజేయుటకు వారు సమర్థులగుదురు వారికి అవమానము చేసినచో వధించుటకు సయితము సమర్థులగుదురు ఈ విషయము నాకు తెలియునుగనుక, ఈ బ్రాహ్మణోత్తముని సంతోషపరచెదను. రాజా! నా కారణముగా నీవు ఈ బ్రాహ్మణునివలన బాధ చెందబోవు. ఒక బాలికవలన యపరాధము కారణముగానైనను, బ్రాహ్మణులు రాజులకు అమంగళము చేయుటకు పూనుదురు 'సుకన్య' కారణముగా 'చ్యవన' మహాముని 'శర్యాతి' రాజునకు అనిష్టము చేయుటకు పూనెను. నీకు తెలియునుగదా! నీవు ఈ బ్రాహ్మణునకు నన్నుగూర్చి చెప్పినదానికి ఏమాత్రము లోపము రాకుండ అతి నియమముతో ఈ బ్రాహ్మణుని సేవించెదను" ఇట్లు మాటిమాటికి చెప్పుచున్న పృథాదేవిని కుంతిభోజుడు ఆలింగనము చేసుకొని, ఆమె మాటలను సమర్థించుచు, ఆమె కర్తవ్యమును గూర్చి —పుత్రీ! నా హితమును, నీ హితమును, నా వంశ హితమును గమనించి నీవిప్పుడు చెప్పినట్లే మెలగుము. నీకు శంక వలదు.' అని చెప్పెను."

"ఈ విధముగా కుంతిభోజుడు చెప్పి, పృథాదేవిని, ఆ బ్రాహ్మణుని సేవకై అర్పించి ఆయనతో నిట్లనెను:—

"బ్రాహ్మణోత్తమా! ఈ నా కూతురు చిన్నది. సుఖముగా పెంచబడినది బాల్యముచేత ఏదైన అపరాధము చేసినను మనస్సునకు తెచ్చుకొనక మీరు ఈమెను క్షమించ వేడెదను మహాత్ములైన బ్రాహ్మణులు, వృద్ధ—బాల తపస్వి జనులు అపరాధము చేసినను, వారియెడల ఎల్లప్పుడును క్రోధరహితులై యుండెదరు ఎంత గొప్ప తప్పు చేసినను, బ్రాహ్మణులు క్షమించవలెను విప్రులను పూజించువారు, తమ యుత్సాహమునకు శక్తికి తగిన సేవ చేసినప్పుడు, ఆ సేవను బ్రాహ్మణోత్తములు ఏలోపమెంచక స్వీకరించవలెను

"ఇట్లు కుంతిభోజుడు వేడుకొనగా ఆ బ్రాహ్మణుడు అట్లే యగుగాక' యనెను రాజు సంతసించి, హంసలవలెను చంద్ర కిరణములవలెను మెఱయుచున్న ఒక గృహమును ఆ బ్రాహ్మణుడు నివసించుటకు ఇచ్చెను.

"అచ్చట అగ్నిహోత్ర గృహమునందు ఆ బ్రాహ్మణుని కొరకు తళతళ మెరయుచున్న ఆసనము అమర్చబడెను ఉత్తమములైన హారాదులు, తదితర వస్తువులన్నియు అక్కడ రాజు ఏర్పరచెను. రాజు పుత్రియగు పృథాదేవి, అలసత్వమును (సోమరితనము), అభిమానమును విడిచి బ్రాహ్మణోత్తముని ఆరాధించుటలో సర్వవిధముల పాటుపడెను. మానసికముగాను, శారీరకముగాను పతివ్రతయైన పృథాదేవి, ఆ పూజ్య బ్రాహ్మణునివద్దకుపోయి అతనికి దేవతకు వలెపరిచర్యలుచేసి, యతనిని సంతోషపరచుచుండెను."

(సశేషం)

గ్రంథ సమీక్ష

శిఖరాలూ - లోయలు

(ఖలీల్ జిబ్రాన్ కవితోక్తులకు స్వచ్ఛందానుసరణం)

రచన : డా. సి. నారాయణరెడ్డి

(వెల : రెండు రూపాయలు పుటలు : యాభై ఆరు
ప్రచురణ : యువభారతి, ప్రతులకు : యువభారతి, తుసాహితీ
సాంస్కృతిక సంస్థ 5–కింగ్స్‌వే, సికింద్రాబాదు–500003.)

Tears and laughter (కన్నీళ్ళు–నవ్వు) Sand and foam(ఇసుక–నురుగు)అను శీర్షికలు గల రెండు పుస్తకాలు ఖలీల్‌జిబ్రాన్ వ్రాసినవి 'శిఖరాలూ–లోయలు' శీర్షిక పెట్టడంలో కూడా ఖలీల్‌జిబ్రాన్‌ను అనుసరించినాడు నారాయణరెడ్డి. నారాయణరెడ్డి అనుసరించిన ఖలీల్ కవితా ఖండికలు ఏ ఏ పుస్తకాలలోనివో సూచన ప్రాయంగానైనా తెలుపలేదు. అనువాదం అనుసరణ చేయడంలో ముఖ్యమైనవుద్దేశం మూలగ్రంధంయొక్క భాషలోపరిచయం లేనివారికి ఆ భావాలను అనువదించి భాష యెరిగినవారికి అందజేయడమే. అయినా మూలగ్రంథం భాష ఎరిగినవారికి అనువాద అనుసరణతో కలిగిన పరిచయాన్ని బట్టి గ్రంథం సాంతం చదువుకోడానికైనా సౌలభ్యం చేకూరేది, అనుసరణ అనువాదం చేసిన నారాయణరెడ్డి మూలగ్రంథముల సూచన చేసివుంటే. అది జరగలేదు ఇంగ్లీషులో ప్రచురితమైన దాదాపు 25 గ్రంధాలు ఖలీల్‌జిబ్రాన్‌వి అందుబాటులో వున్నాయి వానిలో ఏఏ పుస్తకాల నుండి నారాయణరెడ్డి యీ 150 భావ ఖండికలను ఏరుకున్నాడో బోధపడదు.

పీఠిక సమకూర్చిన జస్టిస్ చిన్నపరెడ్డిగారు కూడా మూల గ్రంథములలో ఇంగ్లీషు వాక్యాలను రెండింటిని ఉదాహరించి నారాయణరెడ్డి అనుసరణలో తెలుగు తియ్యదనం, నారాయణరెడ్డి కవిత్వం ఖలీల్‌జిబ్రాన్ భావానికి ఎలా మెరుగులు దిద్దిందో సూచించినారు. వారైనా ఇంగ్లీషు వాక్యాలు ఏ పుస్తకంలోనివో తెలుపలేదు. అట్టి తరి మనకు మిగిలింది తెలుగులో నారాయణరెడ్డి చిరకాలంగా ఖలీల్‌జిబ్రాన్ కవితలను చదివి కొన్నిటిని ఊహాల్లో ప్రతిష్ఠించుకొని. మరికొన్నిటిని ఒంటబట్టించుకొని ఏ కొన్నింటినో తెలుగులో అనువదిసే బాగుంటుందని అనుకుంటూనే "...... అప్పుడప్పుడు హృదయం స్పందించినప్పుడు తెలుగులో అల్లుకున్న ఖలీల్ కవితోక్తులు (150)" 'శిఖరాలూ లోయలు'గా మనముందున్నవి "ఆకాంక్ష" తనది 'ఆకృతి దీర్చింది యువభారతి' అంటున్నాడు. నారాయణరెడ్డి 'అనుసృజనం'లో 'అనువాద''అనుసరణ'లలో డా. నారాయణరెడ్డి భాష భావాలు ఖలీల్‌జిబ్రాన్‌వి. పీఠికాకర్తలు ఉదాహరించిన రెండు వాక్యాలను బట్టి చూస్తే అవి ఇంగ్లీషు పద్య ఛందస్సులో వున్నట్లు కనబడవు పోయం (ఇంగ్లీషు పద్యం)లో ప్రతి చరణానికి మొదటి మాటలోని మొదటి అక్షరం 'క్యాపిటల్' అయివుండడం తప్ప మరే పద్యలక్షణం మూలంలో కనిపించదు.

The human soul is but a part of burning bush
Which God seperated from Himself at creation.

(పేజీ 12 ముందుమాట)

డా. నారాయణరెడ్డి మాత్రం చాలావరకు తన సహజ ధోరణిలో అంత్య నియమాలు, విరుపులు, యమకం, గమకం పాటించినాడు. తను అనుసరణలో–గేయరచనలో చేయితిరిగినవాడు. ఈ విషయంలో సిద్ధహస్తుడన్న పేరు నిలబెట్టుకున్నాడు. తెనుగు నుడులపై ప్రభుత్వం సాధించినవాడు స్వయంగా కవి. అతని కమ్మని పాటలు ఇంటింట చిత్రసీమవారి పుణ్యాన ఇమ్ముగా పాడినవారి గొంతుల్లోంచి వినిపిస్తుంటాయి రేడియోలో. విశ్వవిద్యాలయంలో ఆచార్య పదవిలో వున్నవాడు తెనుగుభాష అధ్యయనం బోధన వృత్తిగా గలవాడు. తెనుగు తియ్యందనాలు పండుతున్నాయి. అతని నోట. ఆ పంటలో ఒకానొక భాగంగా ఖలీల్‌జిబ్రాన్ భావాలు తెనుగురూపం దాల్చడం తెలుగువారి భాగ్యం. కవినోట వెలువడినవి సామాన్యమైన పలుకులు కావు–

" ఈనాటి నా హృదయ ఘోష
రేపటి కోటి హృదయాల జీవద్భాష "

అంటాడు ఖలీల్‌జిబ్రాన్. "రేపటి కోటి హృదయాల జీవద్భాష" కాబోతున్న ఖలీల్‌జిబ్రాన్ హృదయఘోషను ఎంతటి 'హృదయ ఘోష' గా వెల్లడించినాడు డా నారాయణరెడ్డి. అనుసరణలోని యీ 'హృదయఘోష' తప్పక రేపటి కోటి హృదయాల జీవద్భాష కాకతప్పదు. ఈ తెలుగు సేతకు మనమంతా ప్రభావితులం కాకుండా వుండగలమా?

సృజనాత్మకమైన కళలలో మేటియైన కవిత్వాన్నిగూర్చి వివరణ పనికిరాదు. అసలు వివరణ, వ్యాఖ్యానం అవసరమైతే అది సృజనకాదు అంటాడు జిబ్రాన్ ఒకచోట.

"వివరించే అవసరమెప్పుడొస్తుంది
విషయం అసమగ్రమైనప్పుడే"

(పుట 50 లో 124 వ సూక్తి)

ఖలీల్ జిబ్రాన్ దివ్యదృష్టి చూడండి ఎంతటిదో—
"మంచు బిందువు తిలకిస్తున్నాను
మహోదధి రహస్యాలు కనుగొన్నాను"

(పుట 51 లో 126)

అసలీ జగత్తులో ఏమీ లేదట. అది చాలా మామూలుదేనట. కాని మన కంటి భూతద్దంలో ఏమీకాని లోకమే మహత్తరంగా అగుపిస్తుందట ఏమని సమీక్ష వ్రాయాలి ఇటువంటి భావాలకు, కవిత్వ రూపందాల్చిన జీవిత సత్యాలకు? నారాయణరెడ్డి తెలుగు రూపం ఇచ్చిన యీ రసగుళికలను-ఆస్వాదించడం మన భాగ్యం. యువభారతి వారిని యీ సందర్భంలో అభినందించవలసినదే. 'శిఖరాలూ-లోయలు' చదివిన ప్రతి పాఠకుడూ ఖలీల్ జిబ్రాన్ సృష్టించిన కొండ కొనలపైకెక్కి కూర్చొని సమగ్ర జీవితంపై ఒక విహంగదృష్టి ప్రసారించగలడు. అతడు నిర్మాణం చేసిన లోయలలో విహరించి కళానందాన్ని జుర్రుకొని ఆ ఊపిరిబలంతో ప్రతి రసికుడు వహ్వా అని తృప్తిచెందడమేకాదు, అతడూ తన 'హృదయఘోష' ను బైటపెట్టి రేపటి కోటి హృదయాల జీవద్భాషగా రూపొందించినను ఆశ్చర్యం లేదు.

"నా ఆత్మ
చీకటిలో సాగిపోయే జవనాశ్వం
పరుగునుబట్టి ప్రభాతం
గతినిబట్టి గమ్యం"

(పుట 48 లో 103)

ఆత్మలేని వాడెవ్వడు?
అందరూ ఆత్మగలవారే
అందరి జవనాశ్వాలు సాగేది చీకటిలోనే
ప్రభాతం ఎవరికైనా వారి పరుగునుబట్టే. గమ్యం చేరుకోవడం వారి వారి గతినిబట్టే

తెలుగువాళ్ళకు జిబ్రాన్ రచనల పరిచయం అనే విషయానికి వస్తాం. యువభారతి అధ్యక్షులు శ్రీ ఇరివెంటి కృష్ణమూర్తిగారు "మామాట" గా కొన్ని విషయాలు ఖలీల్ జిబ్రాన్ రచనలు తెలుగు ప్రపంచానికందించే విషయం చెప్పినారు దానికి తోడుగా మరికొన్ని వివరాలు చెప్పడం భావ్యమని తలుస్తాను 1953 డిసెంబర్‌లో "తెలంగాణా రచయితల సంఘం" వార్షికోత్సవం జరిగింది. ఆ సందర్భంలో "మంజీర" అనే ఒక సంచిక వెలువరించినారు ఆ సంఘంవారు దానిలో నేనెరిగినంత మేరకు మొదటిసారి తెలుగులో ఖలీల్ జిబ్రాన్ రచన "ది ప్రాఫెట్" నుండి ఒక అధ్యాయం "కర్మయోగము" అనే శీర్షికతో ప్రచురింపబడ్డది దాని తర్వాత 1968 లో యువభారతివారి ప్రచురణగా 'జీవన గీత' పేరుతో 'ది ప్రాఫెట్' గ్రంథరూపం దాల్చింది. 1962 లేక 63 లోనో ఖలీల్ జిబ్రాన్ రాసిన "ది ప్రాఫెట్" కు అనువాదంగా 'జీవన గీత' పుస్తకరూపం దాల్చకముందే వ్రాతప్రతి చదివి శశాంక ఆంధ్రప్రభ ఆదివారం సంచికలో పరిచయవ్యాసం రాసినాను 1965 లో 'జమీన్‌రైతు' లో 'ఖలీల్‌తో కలయిక' అనే శీర్షికతో ఒక పరిచయ వ్యాసం ప్రచురింపబడింది. ఆదే వ్యాసం యువభారతి వారి జీవన గీతలో (1968) అనువాదకునిపేర మళ్ళీ అచ్చైంది 1974 లో జూలై నెలలో గుంటూరు వాస్తవ్యులు ఆచార్య ధనకుధరంగారు "భారతి గ్రంథమాల" ద్వారా ఖలీల్ జిబ్రాన్ రెండు పుస్తకాలు "ది స్పిరిట్స్ రెబిలియస్" మరియు "ది సాండ్ అండ్ ఫోమ్" అను వాటిని "ఎదురుతిరిగిన ఆత్మలు" "వాలుకా చయము ఫేనపటలి" అను పేర్లతో అనువదించి ప్రచురించినారు. ప్రకాశకులు చతుర్వేదుల పార్థసారధి గుంటూరు-'O Earth' అనునది శశాంక తెలుగుసేత, ఆకాశవాణి హైదరాబాదు నుండి 1970 లో ప్రసారమైంది ఇది తెలుగువారికి ఇంతవరకు అందిన జిబ్రాన్ కవితా పరిచయము దీనికి తోడుగా నేడు 'శిఖరాలూ-లోయలు' అను పేరుతో 1971 డిసెంబరులో యువభారతి వారు అందించినారు. నారాయణరెడ్డి అందమైన అనుసరణ, చక్కని అనువాదం, తెలుగు ప్రపంచం ఖలీల్ జిబ్రాన్ సంపూర్ణరూపం త్వరలోనే దర్శించుకుంటుందని ఆశిద్దాం. నారాయణరెడ్డి తెనుగుసేతలో వాడిన పదాల విషయంలో ఒకటి రెండు మాటలు. రెండుచోట్ల 'నురుగు' అనేమాట పుస్తకంలో 'నురగు' అని వున్నది. నిఘంటువులోకూడా 'నురుగు' అనే ఉన్నది. నురువు అనే రూపం కూడా ఇవ్వడం జరిగింది నిఘంటువులో తెలంగాణాలో వాడుక కూడా నేను విన్నంతమట్టుకు 'నురుగే'. కరీంనగరంలో 'నురగు' అంటారేమో తెలియదు లేక 'రు' 'ర' గా పడడం అచ్చుపొరపాటా? ఇది చాలా చిన్న విషయమయినా తెలుగుసేత ఆచార్య డా నారాయణరెడ్డిది, కాబట్టి ఇంత వివరంగా రాయవలసివచ్చింది. యువభారతి ప్రచురణలో యీ మధ్య అచ్చుపొరపాట్లు విశేషంగా కనిపిస్తున్నాయి. ఎక్కువ సంఖ్యలో ప్రచురణలు వెలువరించే ఉత్సాహంలో వారికి సహజమైన జాగ్రత్త కొంత లోపిస్తున్నది 'శిఖరాలూ-లోయలు' పుస్తకం అచ్చుకు వాడిన కాగితంకూడా మంచిదికాదు. డా నారాయణరెడ్డి "అనుసృజనం" భాగం 6, 7, పేజీలు అచ్చు ఏ మాత్రం బాగులేదు కాగితం నాసిరకము దైన కారణాన సిరా పేరి అవతల ప్రక్కభాగం ఇటుదాకా చింది పాఠకునికి బాధాకరంగా వుంది యువభారతివారు అచ్చు తప్పుల విషయంలోనూ కాగితం విషయంలోనూ జాగ్రత్తగా మెలగడం మంచిదని సూచిస్తున్నాను.

ఏమైనా ఖలీల్ జిబ్రాన్ 'హృదయఘోష'కు తెలుగు అందచందాలు మప్పించిన డా నారాయణరెడ్డికి ఆ అందచందాలను 'శిఖరాలూ లోయలు' గా పుస్తకరూపమిచ్చిన యువభారతికి పాఠక లోకం కృతజ్ఞతలు అందించక తప్పదు

పుస్తకంలోని చిత్రాలు, ముఖచిత్రంతోపాటు చాలా బాగున్నాయి. డా నారాయణరెడ్డి మాటలలో "మాటలతో బొమ్మగీచింది నేను, రేఖలతో జీవంపోసింది బాపు" నిజం ఖలీల్ జిబ్రాన్ మహా రచయితే కాకుండా గొప్ప చిత్రకారుడు కూడా. అతని పుస్తకాల్లో సందర్భానుసారంగా స్వయంగా అతని చిత్రాలే వుంటాయి. "శిఖరాలూ-లోయలు"లో ఆ అవకాశం లేదు కాబట్టి ఆ లోటును బాపు తీర్చినట్టే!

—కాళోజి

జిల్లాల్లో..

నాగావళి నదిపై సంకిలి వంతెనకు శంకుస్థాపన

ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు మే 22వ తేదీన శ్రీకాకుళం జిల్లాలో నాగావళి నదిపై రూ. 69 లక్షలు వ్యయమయ్యే సంకిలి వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు

ఈ సందర్భంలో జరిగిన కార్యక్రమానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి శ్రీ చనుమోలు వెంకట్రావు అధ్యక్షత వహించారు సంకిలి వంతెన నిర్మాణానికి ఈ యేడాది సుమారు రూ 20 లక్షలు కేటాయింపబడుతుందనీ, ఈ వంతెన నిర్మాణం పూర్తయినప్పుడు వివిధ వ్యాపార కేంద్రాలమధ్య రవాణా రహదార్లకు యిది కూడ లిగా వుపయోగపడుతుందని మంత్రి అధ్యక్షోపన్యాసంలో తెలిపారు.

మధ్యతరహా నీటిపారుదల శాఖ మంత్రి శ్రీ వి. కృష్ణమూర్తి నాయుడు ప్రసంగిస్తూ ఇప్పుడు నిర్మాణంలోవున్న పదహారు ఇరిగేషన్ ప్రాజెక్టులలో పది ప్రాజెక్టుల నిర్మాణం యీ సంవత్సరం పూర్తవుతుందని చెప్పారు.

జిల్లా కాంగ్రెస్ సంఘాధ్యక్షుడు శ్రీ టి. రాఘవదాస్, జిల్లా పరిషత్ అధ్యక్షుడు శ్రీ సి రాజశేఖరం, పార్లమెంటు సభ్యుడు శ్రీ బి. రాజగోపాలరావు, శాసనమండలి సభ్యులు శ్రీయుతులు జి. శ్రీరాములు, కె. కృష్ణమోహనరావు, కె. నరసయ్య ప్రభృతులు ప్రసంగించారు.

ఆదోని చేనేత కార్మికులకు గృహవసతి

ఆదోనిలో చేనేత పనివారు నివాస గృహాలను కట్టుకోవడం కోసం కార్మిక పునరావాసశాఖమంత్రి శ్రీ టి. అంజయ్య మే 21వ తేదీన 36 భూమి పట్టాలను పంచిపెట్టారు. ఈ సందర్భంలో జరిగిన సభకు స్థానిక శాసనసభ్యుడు శ్రీ హెచ్. సత్యనారాయణ అధ్యక్షత వహించారు.

పట్టణంలో చేనేతపనివారి కృషిని ప్రశంసిస్తూ, వారి న్యాయమైన కోరికలను తీర్చడానికి ప్రభుత్వం ఎప్పుడు సహకరిస్తుందనీ సహకార సంఘములద్వారా అప్పులు సంపాదించి గృహనిర్మాణానికి పూనుకోవాలనీ మంత్రి శ్రీ అంజయ్య సూచించారు

కడప జిల్లాలో ఖరీఫ్ పంట కార్యక్రమం

కడప జిల్లాలో యిటీవల జరిగిన జిల్లాస్థాయి సమన్వయ సంఘ సమావేశంలో డిప్యూటి డైరెక్టర్ శ్రీ పిచ్చేశ్వరరావు ప్రసంగిస్తు జిల్లాలో ఖరీఫ్ పంటకోసం రూ. 15 లక్షలు అప్పు మంజూరయిందని తెలియజేశారు. ఈ సమావేశానికి జిల్లా రెవిన్యూ అధికారి లలిత్ మాథూర్ అధ్యక్షత వహించారు.

ఈ ఋణాన్ని అర్హత కలిగిన సమితులద్వారా రైతులకందజేస్తారు, లేదా అసిస్టెంట్ అగ్రికల్చర్ ఆఫీసర్ ద్వారా పంచిపెడతారు. ఆర్. యం. యస్. పథకం క్రింద యివ్వబడిన ఋణం కేవలం చిన్న రైతుల సహాయం కోసం వినియోగిస్తారు విత్తనాలు ఎరువుల కొసం మరో రూ. 4 లక్షలు విడిగా మంజూరు చేశారు. ఈ సొమ్ముతో రకరకాలయిన విత్తనాలనుకొని రైతులకు సకాలంలో అందజేస్తారు,

జిల్లా పరిషత్ అధ్యక్షులు శ్రీ ఆర్. సూర్యనారాయణ రెడ్డి యీ సమావేశానికి హాజరయ్యారు.

కల్వకుర్తిలో కొత్త ఆసుపత్రి భవనం ప్రారంభం

మహబూబ్ నగర్ జిల్లా కల్వకుర్తిలో ఒక క్రొత్త ఆసుపత్రి భవనానికి మే 6న ఆరోగ్య శాఖ మంత్రి కె. రాజమల్లు ప్రారంభోత్సవం చేశారు. భవన నిర్మాణానికి రూ. 4.12 లక్షలు వ్యయమయింది. ఇందులో 30 బెడ్ల సదుపాయం కలిగించారు. కుటుంబ నియంత్రణ అవశ్యకతను వివరిస్తూ ప్రజలంతా బాధ్యతనెరిగి ప్రభుత్వంతో సహకరించాలని మంత్రి శ్రీ రాజమల్లు విజ్ఞప్తిచేశారు.

ఎక్స్‌రేప్లాంటు, తదితర ఆసుపత్రి పరికరాల కొనుగోలుకై ఉదారంగా విరాళాలివ్వాలని జిల్లాపరిషత్తు అధ్యక్షుడు శ్రీ.కె.కె.రెడ్డి ప్రజలను కోరారు.

కల్వకుర్తి సమతి అధ్యక్షులు శ్రీ జైపాల్ రెడ్డి ప్రభృతులు యీ సందర్భంగా ప్రసంగించారు.

ఖమ్మం జిల్లా హరిజనులకు గృహవసతి

హరిజన గృహవసతికి భూసేకరణలో ఖమ్మం జిల్లా అగ్రగణ్యంగా ఎంచబడిందని జిల్లా అధికారుల సమన్వయ సంఘం సమావేశంలో ప్రసంగిస్తూ జిల్లా కలెక్టర్ శ్రీ. పి. వి. ఆర్. కె. ప్రసాద్ తెలియజేశారు.

ఖమ్మంజిల్లాలో హరిజన వాడలకు భూసేకరణ నిమిత్తం రూ 8.32 లక్షలు వ్యయమయినట్లు తెలుస్తున్నది 260.12 గుంటల భూమిని సేకరించి, దానిని 3,464 కుటుంబాలకు పంచియిచ్చారు, ఇదికాక 3322.07 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని బలహీనవర్గాల వారికి పంచి పెట్టారు మరో 6,115 గుంటల స్థలాన్ని షెడ్యూలు జాతుల వారికి కేటాయించారు.

జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు రెవిన్యూ అధికారి, బ్లాక్ డెవలెప్‌మెంటు ఆఫీసర్లు భూసేకరణ విషయంలో తీసుకొన్న శ్రద్ధను కలెక్టర్ కొనియాడారు.

కోటసమితిలో మరో రెండు గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా

నెల్లూరుజిల్లా రెవిన్యూ శాఖాధికారి, శ్రీ హెచ్. కె బాబు మే 18న కోటపంచాయతీ సమితిలోని అంకులపట్టూరు ఉడతవారి

పాలెం, అన్నంబాక గ్రామాలలో వీధిదీపాల విద్యుచ్ఛక్తి సరఫరాకు ప్రారంభోత్సవం చేశారు. రు. 10.5 లక్షల ఖర్చుతో కూడిన చింతవరం చిన్నతరహా క్లస్టర్ పథకంలో భాగంగా యీ గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేశారు.

శ్రీ ఎన్ శ్రీనివాసులురెడ్డి ప్రసంగిస్తూ యీ పథకాన్ని త్వరితగతిని పూర్తి చేసినందుకు విద్యుచ్ఛక్తి శాఖ అధికారులను అభినందించారు.

గూడూరు సబ్‌కలక్టరు, శ్రీ బి. దానం యీ సందర్భంగా ప్రసంగిస్తూ గ్రామాల అభివృద్ధికి స్వయం సహాయం పథకాలను చేపట్టాలని గ్రామస్థులను ఉద్బోధించారు.

జిల్లా రెవిన్యూ అధికారి, తిక్కవరం గ్రామానికి చెందిన 41 మంది గిరిజనులకు యిండ్ల పట్టాలను పంపిణీచేశారు. నెలుపూడికి చెందిన గిరిజనులకు 36 యిండ్ల పట్టాలను కూడా ఆయన పంపిణీ చేశారు.

పశ్చిమగోదావరి రైతులకు వ్యవసాయశాఖ మంత్రి అభినందనలు

పశ్చిమగోదావరి జిల్లా రైతులు ఆధునిక వరి వంగడాలను విజయవంతంగా సేద్యం చేసినందుకు వ్యవసాయశాఖ మంత్రి శ్రీ జె. చొక్కారావు వారిని అభినందించారు. ఆయన మే 20న ఏలూరు సమీపంలోని పినకడిమిలో తీవ్రతర వ్యవసాయ ఖరీఫ్ ఉద్యమానికి ప్రారంభోత్సవం చేశారు. గత రబీలో సాధించిన ఫలితాలను మంత్రి గుర్తుచేస్తూ రైతులకు సకాలంలో పరికరాలు, సలహాసహాయ సహకారాలు అందజేసినందుకు అధికారులను అభినందించారు. సహకార సంఘాలు, షెడ్యూలు బ్యాంకులు తమ పరపతి విధానాలను సరళం చేసిన విషయాన్ని వివరించారు. ఆహార వ్యవసాయశాఖ కార్యదర్శి శ్రీ కె సుబ్రహ్మణ్యం ప్రసంగిస్తూ గ్రామీణ ప్రాంతాలకు వ్యవసాయ సలహా పథకాన్ని అమలు జరుపుతారని ప్రకటించారు. ఈ పథకం ప్రకారం ఒకటి లేక రెండు గ్రామాల ప్రజలు వ్యవసాయ అసిస్టెంట్ల ఖర్చును భరిస్తారు ఆయన ఎల్లప్పుడూ రైతులకు సలహా యిస్తుంటారు. స్వల్పకాలిక అధిక దిగుబడి వంగడాల విషయంలో కూడా సలహా యిస్తారు.

జిల్లాకలెక్టరు శ్రీ జి. కుమారస్వామిరెడ్డి ప్రసంగిస్తూ ఎగువ ప్రాంతాలలో ఉత్పత్తిని అధికం చేయడానికి చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. భూగర్భజలాల గూర్చి పోలవరం, చింతలపూడి తాలూకాలతో సర్వే జరుపుతున్నారని తెలియజేశారు.

జిల్లాపరిషత్తు అధ్యక్షుడు శ్రీ అల్లూరి బాపినీడు ప్రసంగిస్తూ ఋణాలవాయిదాలను సక్రమంగా చెల్లించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

కడపలో "ముషాయిరా"

లా, కోర్టులు, జైళ్ళు, ముద్రణ శాఖ మంత్రి శ్రీ ఆసిఫ్‌పాషా మే 28 న కడపలో ఉర్స్-యి-షెరీఫ్ ఆధ్వర్యంలో జరిగిన "ముషాయిరా" (కవిసమ్మేళనం) ను ప్రారంభించారు. ప్రస్తుత సాంఘిక పరిస్థితుల్లో మతాధిపతులు ఎలుగెత్తి పాడిన ప్రేమ, సమత్వ గీతాలు ఎంతో ఆవశ్యకమనీ, నేటింతరంవారు వారి దారినే అనుసరిస్తూ మతాతీత లౌకిక సమాజంకోసం పాటు పడాల్సి ఉందనీ ఉద్బోధించారు.

ఆంధ్రప్రదేశ్ విధానసభ డిప్యూటీ స్పీకర్ శ్రీ సయ్యద్ రహమత్‌అలీ యీ సందర్భంలో మాట్లాడుతూ మతప్రవక్తలు ప్రజలలో జ్ఞానజ్యోతిని వెలిగించి, వారి జీవన విధానం మెరుగయ్యే మార్గంచూపారని అన్నారు. దేశం నలుమూలల నుండీ వచ్చిన 40 మంది కవులు యీ ముషాయిరా లో పాల్గొన్నారు. సుమారు పన్నెండు వేల మంది ముషాయిరాను తిలకించారు.

కొత్తపాడు హరిజన కాలనీకి ప్రారంభోత్సవం

ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు పశ్చిమ గోదావరి జిల్లాలోని కొత్తపాడు వద్ద రూ 85,000 వెచ్చించి 40 ఇళ్ళతో నిర్మింపబడిన హరిజన కాలనీకి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంలో మాట్లాడుతూ వచ్చే మూడేళ్ళలోను ప్రభుత్వం ఎంత ఖర్చయినా సరేభరించి హరిజనులకు ఇళ్ళస్థలాలను కేటాయించాలనే ఉద్దేశంతో ఉందని ప్రకటించారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విద్యామంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణారావు ప్రసంగిస్తూ రాష్ట్రంలో 17 లక్షల కుటుంబాలకు ఇళ్ళస్థలాలను కేటాయించడానికి రూ 64 కోట్లు అవసరమవుతాయని అన్నారు. శాసనసభ్యుడు శ్రీ వంకా సత్యనారాయణ, సమితి అధ్యక్షుడు శ్రీ యం భావరాజు ప్రభృతులు ప్రసంగించారు.

పుచ్ఛలపల్లిలో భూమి కాలనైజేషన్ పథకానికి శంకుస్థాపన

మైనర్ ఇరిగేషన్ శాఖ మంత్రి శ్రీ ఆనంవెంకటరెడ్డి నెల్లూరు జిల్లా కోటపంచాయతీ సమితిలోని పుచ్ఛలపల్లి వద్ద రూ 30,000 తో అమలు జరుపనున్న లాండ్ కాలనైజేషన్ పథకానికి మే 29 న శంకుస్థాపన చేశారు.

నెల్లూరు జిల్లాలోని సిద్దవరం, ఉత్తమ గ్రామాలలోని 160 మంది హరిజన, గిరిజన వర్గాలకు 10 ఫిల్టర్ పాయింట్లతో నూరు ఎకరాల భూమికి నీటి పారుదల సౌకర్యాలను కల్పించడానికి యీ పథకం ఉద్దేశించ బడింది.

విద్యుచ్ఛక్తితో నడిచే మోటార్లు పొందటంకోసం షెడ్యూలు బ్యాంకులు ఋణాల రూపంలో ఆర్థికసహాయం అందజేస్తాయి.

PRINTED BY THE DIRECTOR OF PRINTING. GOVT. OF ANDHRA PRADESH. AT THE GOVT. CENTRAL PRESS HYDERABAD
PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION. PUBLIC RELATIONS ANDHRA PRADESH. HYDERABAD



